www.manatelangana.news


Mana Telangana

మన తెలంగాణ


హైదరాబాద్ | సంపుటి 8 | సంచిక: 193 | గురువారం | 2 జనవరి, 2020

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



రాజ్‌భవన్



ప్రగతిభవన్

డబుల్ ట్వంటీ శుభక్షణాలు

ఆమెకే అధిక ఆయుష్షు

3లో



దేశంలో మగవారి కంటే మహిళలే ఎక్కువ కాలం జీవిస్తున్నారు

పురుషుల సగటు జీవితం 67.4ఏళ్లు, స్త్రీలు 70.3 ఏళ్లు

నూతన దశాబ్ది మాదే



2020-30 టిఆర్ఎస్, కెసిఆర్‌లదే రాష్ట్రాభివృద్ధిలో దేశానికే ఆదర్శం అవుతాం

- మున్సిపోల్స్‌పై వారంలో సిఎం కెసిఆర్ దిశానిర్దేశం
- ఎన్నికల తర్వాత కొత్త మున్సిపల్ చట్టం పటిష్టంగా అమలు
- సంక్రాంతి తర్వాత జిల్లా పార్టీ కార్యాలయాలు
- ఈ ఏడాదిలో ఫార్మా సిటీ
- చైనాతో దీటుగా కాకతీయ టెక్స్‌టైల్స్

మరి పది సంవత్సరాలకు పైగా మన సిఎం కెసిఆరే. 2019 టిఆర్ఎస్ సంవత్సరం. అన్ని ఎన్నికల్లోనూ సింహ భాగం గెలుచుకున్నాం. వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలన్నీ నెరవేర్చా

రాజకీయాల్లో మాకు శత్రువులు లేరు ప్రత్యర్థులే. బిజెపి ఎదుగు బొదుగు లేని పార్టీ. కాంగ్రెస్‌తోనే పోటీ. మజ్లిస్‌తో స్నేహబంధమే, ఎన్నికల్లో ఎదురెదురే

- మీడియాతో కెటిఆర్ చిట్‌చాట్

మన తెలంగాణ/హైదరాబాద్

2020 నుంచి 2030 వరకు టిఆర్ఎస్ పార్టీ రాష్ట్రాభివృద్ధిలో దేశానికే ఆదర్శమవుతుందని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చెప్పారు. దశాబ్దకాలంలో భారతదేశానికి తెలంగాణ ఆదర్శం కానుందన్నారు. ఈ దశాబ్దం టిఆర్ఎస్ నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్రానిదేనని కెటిఆర్ చెప్పారు. 2019 వ సంవత్సరం టిఆర్ఎస్‌కు అనేక విజయాలను సాధించిపెట్టిందన్నారు. అలాగే 2030 వరకు టిఆర్ఎస్ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా అనేక విజయాలు సాధిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా కెటిఆర్ కొద్దిసేపు మాట్లాడారు. ఈసందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నలకు కెటిఆర్ సమాధానాలు ఇచ్చారు. ముఖ్యమంత్రి పదవిలోకి ఎప్పుడు వస్తున్నారని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెపుతూ ఈ అంశంపై పార్టీ అధినేత. సిఎం ఎసిఆర్ శాసన సభలోనే స్పష్టత ఇచ్చారని గుర్తు చేశారు. మరో10 సంవత్సరాలకు పైగా ముఖ్యమంత్రి పదవిలో సిఎంకెసిఆర్ కొనసాగుతారన్నారు. ఈఅంశంపై సిఎం కెసిఆర్ స్పష్టత ఇచ్చినప్పటికీ పదే పదే ప్రస్తావించడం సరికాదన్నారు. రాజకీయాల్లో ప్రత్యర్థులే ఉంటారు, శత్రువులు ఉండరని కెటి.రామరావు చెప్పారు. రాష్ట్రాభి వృద్ధి కోసం పొరుగురాష్ట్రాలతో సత్సంబంధాలు కొనసాగించడమే సిఎం కెసిఆర్ విధానమన్నారు. మహారాష్ట్రతో మంచి సంబంధాలు ఉండటంతోనే కాళేశ్వరం ప్రాజెక్టును సిఎం కెసిఆర్ ప్రతిష్టాత్మకంగా నిర్మించగలిగారన్నారు. అలాగే కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు రాష్ట్రాలతో టిఆర్ఎస్ ప్రభుత్వానికి ఎలాంటి విభేదాలు లేవన్నారు. ఎపి సిఎం జగన్‌తో స్నేహం ఉన్నట్లుగానే ఇతర ముఖ్యమంత్రులతో కూడా సిఎం కెసిఆర్ స్నేహంగానే వ్యవహరిస్తారని చెప్పారు. ఎపి తరువాయి 6లో

వచ్చే ఏడాది చంద్రయాన్-3

8లో



- గగన్‌యాన్‌కు వ్యోమగాములు
- నలుగురికి రష్యాలో శిక్షణ

ఇంటర్ ప్రాక్టికల్స్‌లో ఈ సారీ జంబ్లింగ్ ఉండదు

7లో

కుంచెపోటు





80వ నుమాయిష్ షురూ

- ఆదాయం విద్యకే, అందుకే ఇది అనితరం : మహమూద్ అలీ

మన తెలంగాణ/ నాంపల్లి

నూమాయిష్ హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబిస్తోందని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. అత్యధిక సంఖ్యలో 20 లక్షల మంది నుమాయిష్‌కు వస్తున్నారని, దేశవిదేశీ ఉత్పత్తులను ప్రదర్శిస్తుండటం నగరానికే గర్వకారణమన్నారు. బుధవారం రాత్రి నాంపల్లిలోని ఎగ్జిబిషన్ సొసైటీ పక్షాన నిర్వహించిన 80వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహమూద్ అలీ మాట్లాడారు. తెలంగాణలో వెనకబడిన ప్రాంతాల్లో విద్యాసంస్థలు నెలకొల్పి, విద్యార్థులకు నాణ్యమైన చదువును అందిస్తున్న ఘనత ఈ సొసైటీకి దక్కుతుందని ఆయన కొనియాడారు. సుమారు తరువాయి 6లో

మెట్రో రికార్డు

- కొత్త సంవత్సరం వేళ ఒకే రోజు 4.6లక్షల మంది ప్రయాణం

3లో

ప్రైవేటులో అగ్ని కాలేజీలు

6లో

నాన్‌సబ్సిడీ గ్యాస్ ధర రూ. 19 పెంపు

9లో

2 పల్లె ప్రగతి నేటి నుంచే

- వర్ధన్నపేట మండలంలో దమ్మన్నపేటలో ప్రారంభం
- 10 రోజులు కొనసాగింపు



మన తెలంగాణ/హైదరాబాద్

నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీల్లో రెండవ విడత పల్లె ప్రగతి కార్యక్రమం ప్రారంభం కానుంది. పది రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమంలో అనేక కార్యక్రమాలను చేపడతారు. వరంగల్ రూరల్ జిల్లాలోని వర్ధన్నపేట మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో పల్లె ప్రగతి కార్యక్రమాన్ని రాష్ట్ర పంచాయతీ తరువాయి 6లో

రాజకీయాలకు దూరం

8లో



- కేంద్రంలో గల ప్రభుత్వం ఆదేశాలమేరకే నడుచుకుంటాం
- చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ పదవిని స్వీకరిస్తూ బిపిన్ రావత్



సిడిఎస్,సైనిక వ్యవహారాల శాఖ ఏర్పాటు చరిత్రాత్మకం

- ప్రధాని మోడీ, అమిత్ షా



మందో మస్త్

- కొత్త సంవత్సరానికి మత్తుగా, చిత్తుగా స్వాగతం, 2 రోజుల్లో రూ.400కోట్ల మద్యం విక్రయం
- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 3,148 కేసులు
- పట్టుబడిన వారిలో 9మంది మైనర్లు, ఒక మహిళ

2లో



సిబిఐ కేసులతో సంబంధం లేదు

మాజీ ఎంపి రాయపాటి

మనతెలంగాణ/హైదరాబాద్ : ట్రాన్స్ టాయ్ కంపెనీపై సిబిఐ కేసు నమోదు చేసిన నేపథ్యంలో మాజీ ఎంపి రాయపాటి సాంబశివరావు స్పందించాడు. ట్రాన్స్‌టాయ్‌పై సిబిఐ కేసులతో తనకు ఏమాత్రం సంబం ధం లేదన్నారు. ట్రాన్స్ ట్రాయ్ కంపెనీని తానే ప్రారంభించానని, అయితే తాను రాజకీయాలలో బిజీగా ఉన్న కారణంగా సదరు కంపెనీ ట్రాన్స్‌ట్రాయ్ సిఇఒ బాధ్యతలను చెరుకూరి శ్రీధరే చూసుకునే వారని వివరించారు. ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీని స్థాపించిన తర్వాత 14 బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నామని, ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు నుంచి తప్పించడంతో ట్రాన్స్‌ట్రాయ్‌కు భారీ నష్టం వాటిల్లిందని చెప్పారు. ఈ క్రమం లో కంపెనీ బ్యాలెన్స్ షీట్లపై మాత్రమే తాను సంతకం చేశానని, అయితే సంస్థకు సంబంధించిన కార్యకలాపాలతో తనకు ఏమాత్రం సంబంధం లేదన్నారు. ట్రాన్స్ ట్రాయ్ కంపెనీ తప్పు చేయలేదని తాను నమ్ముతున్నానన్నారు. సిబిఐకి తప్పుడు సమాచారం ఇచ్చిన యూనియన్ బ్యాంకులు తనపై తప్పుడు కేసులు పెట్టాయని రాయపాటి వివరణ ఇచ్చారు.

కృత్రిమ మేధో సంవత్సరంగా 2020

నేడు అధికారికంగా ప్రకటించనున్న ప్రభుత్వం

మన తెలంగాణ/హైదరాబాద్ : నూతన సంవత్సరాన్ని (2020) రాష్ట్ర ప్రభుత్వం కృత్రిమ మేధో (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ – ఎఐ) సంవత్సరం గా గురువారం ప్రకటించనుంది. అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలలో తెలంగాణ అగ్రగామిగా నిలుస్తున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఎఐ సంవత్సరంగా నామకరణం చేయనుంది. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ స్ట్రాటజీ ఫర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనే పైలట్ ప్రాజెక్టు నిర్వహించేందుకు ం నీతి అయోగ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ డాటా సైన్సెస్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను అంతర్జాతీయ ఐటి సంస నాస్కామ్ స్థాపించనుంది.



సిఎం కెసిఆర్‌కు యాదాద్రీశుడి ప్రసాదం

మనతెలంగాణ/యాదాద్రి : ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి కెసిఆర్‌కు యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి లడ్డు ప్రసాదాన్ని వైటిడిఎ వైస్ చైర్మన్ కిషన్‌రావు, ఆలయ ఇఒ గీత అందచేశారు. బుధవారం హైద్రబాదులో సిఎం కెసిఆర్ కలిసి ప్రసాదం అందచేసి నూతన సంవత్స శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం 2020 నూతన సంవత్సర క్యాలెండరును ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

యాదాద్రి నిత్య రాబడి రూ.33.36లక్షలు

శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం యాదాద్రి క్షేత్రంలో స్వామివారి ఆలయం నిత్యరాబడి భాగంగా నూతన సంవత్సరం జనవరి 1న రూ.33,36,491ల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని ప్రముఖ దేవాలయాల్లో ఒకటైన బిర్లా మందిర్ టెంపుల్‌లో శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

గవర్నర్‌తో కెసిఆర్ భేటీ

మూడు గంటల పాటు సమావేశం

సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను తమిళిసైకు వివరించిన సిఎం

గవర్నర్‌గా వంద రోజులు పూర్తి

మన తెలంగాణ/హైదరాబాద్ : రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌తో బుధవారం ముఖ్యమంత్రి కెసిఆర్ భేటీ అయ్యారు. సుమారు మూడు గంటల పాటు ఈ సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలు, వాటి ప్రగతి తదితర అంశాలపై గవర్నర్‌కు సిఎం వివరించారని తెలుస్తోంది. అలాగే త్వరలో ప్రారంభం కావాల్సిన రాష్ట్ర బడ్జెట్ సమావేశాల నిర్వహణ తేదీలపై కూడా ఆమెతో సిఎం కెసిఆర్ చర్చించారని సమాచారం. ఇటీవల గవర్నర్ కాళేశ్వరంను సందర్శించిన నేపథ్యంలో ప్రాజెక్టుకు సంబంధించిన ఫీడ్‌బ్యాక్‌ను సిఎం కెసిఆర్ అడిగి తెలుసుకున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నియమించిన కొత్తగా నియమించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నియమాకంపై కూడా గవర్నర్‌కు సిఎం కెసిఆర్ మర్యాదపూర్వకంగా వివరించారు. అనంతరం గురువారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో మొదలవుతున్న రెండో విడత పల్లె ప్రగతి గురించి గవర్నర్ దృష్టికి సిఎం తీసుకెళ్ళారు. మొదటి విడత పల్లె ప్రగతి జరిగిన తీరు...సాధించిన ఫలితాలను దృష్టిలో పెట్టుకుని రెండవ విడతలో పెట్టుకున్న ప్రాధాన్యత అంశాలపై వారిరువురు మధ్య చర్చ జరిగినట్లుగా సమాచారం. రాష్ట్ర ప్రస్తుత రాజకీయాలపై కొద్దిసేపు ముచ్చటించారని తెలుస్తోంది. కాగా బుధవారం నాటికి గవర్నర్‌గా తమిళిసై బాధ్యతలు చేపట్టి వంద రోజులు పూర్తి చేసుకోవడతో సిఎం కెసిఆర్ మరోసారి ఆమెకు అభినందనలు తెలిపారు.

శుభాకాంక్షలు తెలిపిన సిఎం కెసిఆర్, మంత్రులు, ఉన్నతాధికారులు

నూతన సంవత్సరం సందర్భంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను సిఎం కెసిఆర్ కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ సోమేశ్‌కుమార్, మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాథోడ్, బిజెపి నాయకురాలు డికె అరుణ, బ్రహ్మకుమారీలు కలిసి గవర్నర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా వేడుకలు

రాజ్‌భవన్‌లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరికీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా రాజ్ భవన్‌లో ప్రజాదర్బార్ నిర్వహించారు.

తెలంగాణ ప్రజలు మంచి మనసున్న వారు : గవర్నర్

తెలంగాణ ప్రజలు మంచి మనుసు కలిగిన వారని గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ కితాబిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం నీటిపారుదల వ్యవసాయం, విద్యారంగాల్లో అభివృద్ధి దిశగా పనిచేస్తుందని వంద రోజుల పాలనపై రాష్ట్రపతికి ఇచ్చిన నివేదికలో పేర్కొన్నట్లు స్పష్టం చేశారు. ఇటీవల గిరిజనుల వద్దకు వెళ్లాలని వారిని రాజ్‌భవన్‌కు ఆహ్వానించినట్లు తెలిపారు. రక్తదానం కోసం ఒక యాప్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నామని రెడ్‌క్రాస్ సంస్థతో కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో 15 లక్షల మంది సభ్యులుగా ఉండడం సంతోషాన్నిస్తుందన్నారు. దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించడం కూడా సంతోషంగా ఉందన్నారు. ఇక నుంచి నెలకొకసారి రాజ్‌భవన్ వేదికగా ప్రజా సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలు స్వీకరించి పరిష్కారం కోసం ఒక వ్యవస్థను తీసుకువస్తామన్నారు.





ఐవిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉప్పల శ్రీనివాస్ గుప్త

వరసగా మూడోసారి ఏకగ్రీవం

రోశయ్య చేతుల మీదగా అందుకున్న నియామకపత్రం

మన తెలంగాణ/హైదరాబాద్ : ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్)తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మూడవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య, ఐవిఫ్ సెంట్రల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంజి రాజమౌళి గుప్త చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ముషీరాబాద్‌లోని వైశ్య హాస్టల్‌లో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గుప్తతో పాటు పలువురు నియామక పత్రాలు అందుకున్నారు. వారిలో ఐవిఫ్ చీఫ్ అడ్వైజర్ మూస్త్యాల సత్తయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పబ్బ చంద్రశేఖర్ , రాష్ట్ర మీడియా కమిటీ చైర్మన్ రఘు గంగిశెట్టి, పొలిటికల్ కమిటీ చైర్మన్ బచ్చు శ్రీనివాస్ , ఆర్గనైజింగ్ సెక్రటరి వేణు, కో–ఆర్డినేటర్ కూర నాగరాజు, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు టిఎల్. సుజాతలు ఉన్నారు. అనంతరం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా రోశయ్య చేతుల మీదుగా కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. రోశయ్య మాట్లాడుతూ, ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్యుల అభ్యున్నతి కోసం సిఎం కెసిఆర్ ఐదెకరాల భూమి కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. తదనంతరం పలువురు మాట్లాడూతూ, పేద ఆర్యవైశ్యుల అభివృద్ధికి పాటు పడుతున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తను ప్రతి ఒక్కరూ కొనియాడారు. ఈ కార్యక్రమానికి 32 జిల్లాల నుంచి సుమారు 600 మంది ఐవిఫ్ సభ్యులు హాజరయ్యారు .

మందో మస్తీ

రాష్ట్రవ్యాప్త డ్రంకెన్ డ్రైవ్‌లో 3,148 కేసుల నమోదు

ట్రై కమిషనరేట్ల పరిధిలో అత్యధిక సంఖ్యలో మందుబాబుల హల్‌చల్

సైబరాబాద్ పరిధిలో పట్టుబడ్డ మహిళ



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ దుమ్ము లేపాయి. న్యూఇయర్ వేళ డిసెంబర్ 31రాత్రి చిన్నా పెద్దా అంతా న్యూఇయర్ ఫీవర్‌తో ఊగిపోయారు. చాలామంది యువత అర్ధరాత్రి మందు పార్టీల్లో మునిగి తేలారు. మద్యం మత్తులో యువత రోడ్లపైకి వచ్చి హల్‌చల్ చేసే అవకాశం ఉండటంతో పోలీసులు ఎక్కడికక్కడే డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం రాత్రి 3,148 కేసులు నమోదయ్యాయంటే మన మందుబాబులు ఎంతగా తాగి ఊగి ఉంటారో అవగతమవుతోంది. మంగళవారం అర్ధ రాత్రి నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు డ్రంకెన్ డ్రైవ్‌ను పోలీసులు కొనసాగించారు. రాష్ట్రమంతటా చెక్‌పోస్టులను నిర్వహించి మరీ డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు. ముందుగానే ఇందుకు సంబంధించి పోలీసు ఉన్నతాధికారులు హెచ్చరికలను సైతం జారీ చేశారు. రాజధాని హైదరాబాద్ మహానగరం పూర్తి స్థాయిలో న్యూఇయర్ జోష్‌లోకి వెళ్లింది. ప్రధానంగా వేడుకల్లో యువత సందడి చేసింది. బుధవారం తెల్లవారుజామున 4 గంటల వరకు జోరుగా వేడుకలు కొనసాగాయి. అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం అమ్మకాలు జరిగాయి. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 951, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 873, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 281 కేసులు నమోదయ్యాయి. దొరికినవారిలో అత్యధికంగా టూవీలర్లు నడిపినవారే. కోర్టుకు ఎక్కనున్న వారిలో 21 నుంచి 30 ఏళ్ల లోపువారే ఎక్కువ మంది ఉన్నారు. బిఎసి(బ్లడ్ ఆల్కహాల్ క్యాలికులేటర్) కౌంట్ అత్యధికంగా 550 పాయింట్లకు చేరుకుంది. మందుబాబులను స్వయంగా దిగబెడతామని బార్లు హామీ ఇవ్వడం, వారు రాత్రి 1.30 దాకా తమ రైళ్లు ఎక్కొచ్చని మెట్రో ఆఫర్ ప్రకటించడంతో డ్రంకెన్ డ్రైవ్ సంఖ్య తగ్గిందని, లేనిఎడల డ్రంకెన్ డ్రైవ్ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండేదని అంటున్నారు. ఇదిలా ఉండగా డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిలో మైనర్ల నుండి పండు ముసలోళ్ల వరకూ ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో 9 మంది మైనర్లు పట్టుబడగా.. మరో 9 మంది 65 ఏళ్లకు పైబడిన వారు పట్టుబడ్డారు. రాష్ట్రవ్యాప్త తనిఖీలలో కేవలం ఒకే ఒక్క మహిళ అందునా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పట్టుబడింది. తెలంగాణ వ్యాప్తంగా నల్గొండ, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో అధికంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదవ్వగా.. మిగతా జిల్లాల్లో కూడా ఓ మోస్తరుగా కేసులు నమోదయ్యాయి.

31కి మస్త్ తాగిన్రు

రెండు రోజుల్లో దాదాపు రూ.400 కోట్ల మద్యం విక్రయాలు

నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్రంలోని మందుబాబులు రూ.వందల కోట్ల మద్యాన్ని తాగేశారని ఎక్సైజ్ శాఖ వర్గాలు వెల్లడించాయి. డిసెంబరు 31న దాదాపు రూ.200 కోట్ల వరకు మద్యాన్ని తాగి రాష్ట్రానికి భారీగా ఆదాయాన్ని సమకూర్చినట్లు పేర్కొంటున్నారు. డిసెంబర్ 30వ తేదీన కూడా అదే స్థాయిలో విక్రయాలు జరిగాయని అధికారులు తెలిపారు. గడిచిన రెండు రోజుల్లో 4.85 లక్షల కేసుల లిక్కర్, 5.10 లక్షల కేసుల బీర్ల విక్రయాలు జరిపినట్లు తెలిసింది. సాధారణ రోజుల్లో రూ.50 కోట్ల నుంచి రూ.70 కోట్ల వరకు మద్యం విక్రయాలు జరుగుతాయి. నూతన సంవత్సరం సందర్భంగా..మద్యం ధరలు పెరిగినా, దాదాపుగా మూడింతల అమ్మకాలు జరిగాయి. ఇక డిసెంబరు చివరి వారంలో రూ.800 కోట్లకు వరకు అమ్మకాలు జరిగాయి. హైదరాబాద్, రంగారెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా, మేడ్చల్ జిల్లా అత్యధికంగా మద్యం అమ్మకాలు జరిగినట్లు తెలిసింది. 30న తెలంగాణలో రూ.200 కోట్లకు పైన మద్యం అమ్మకాలు జరిగాయి. ఇక 31న సాయంత్రం 5 గంటల వరకే దాదాపు రూ.150 కోట్ల మద్యం సేల్ అయ్యింది. సాయంత్రం 5 నుంచి అర్ధరాత్రి వరకు రూ.30 కోట్ల అమ్మకాలు జరిగి ఉండొచ్చని ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.



మోడీ మతపరమైన రాజకీయాలు

టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆరోపణలు

మనతెలంగాణ/హైదరాబాద్: కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ మతపరమైన రాజకీయాలను చేస్తున్నారని టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. బుధవారం మధ్యాహ్నం గాంధీభవన్ ఆవరణలో పార్టీలో చేరికల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పోలీసు శాఖ తీరుకు నిరసనగా త్వరలో జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ బెంబెలు చేందడం లేదని వ్యాఖ్యనిస్తూ రిజర్వేషన్‌ల ప్రకటన, నామినేషన్‌ల మధ్య మాత్రమే వారం రోజుల గడువు ఇవ్వాలని కోరామన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చెరిన నాయకులను ఆయన కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి చెన్నారెడ్డి, మాజీ ఎంపిపి శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల చిన్నారి కిడ్నాప్... అత్యాచారం


భూపాలపల్లి జిల్లాలో వెలుగు చూసిన సంఘటన

మన తెలంగాణ / వరంగల్ క్రైమ్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండల పరిధిలోని కోణం పేటలో దారుణం వెలుగు చూసింది .అదే గ్రామంలో నివాసం ఉంటున్న కొమురయ్య అనే వ్యక్తి మంగళవారం రాత్రి తల్లి వద్ద నిద్రిస్తున్న నాలుగేళ్ల చిన్నారిని కిడ్నాప్ చేసి అత్యాచారం చేశాడు.

అనంతరం చిన్నారిని అక్కడే వదిలి వేసి వెళ్లాడు. బాధిత చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డిఎస్‌పి బోనాల కిషన్ తెలిపారు. నిందితుడు కొమురయ్య పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలిస్తున్నామని ఆయన వెల్లడించారు.

ఎంఎంటిఎస్ ప్రయాణికులకు ఊరట

టికెట్ ధరల్లో మార్పులేదు



మనతెలంగాణ/హైదరాబాద్: ఇటీవల కేంద్ర ప్రభుత్వ రైల్వే మంత్రిత్వ శాఖ స్వల్పంగా రైల్వే టికెట్ చార్జీలను పెంచారు. నూతన ఛార్జీలు ఎంఎంటిఎస్ రైల్వే సర్వీసులకు మినహాయించారు. అలాగే సబర్బన్ ప్యాసింజర్, సిజన్ టికెట్ ధరల్లో మార్పు లేదని, రైల్వే పాస్ ధరలు పెంచలేదని రైల్వే అధికారులు వెల్లడించారు.



ప్రగతి భవన్‌లో సిఎం కెసిఆర్‌ను కలుసుకొని కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంఎల్‌సిలు శేరి సుభాష్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్



ముఖ్యమంత్రి కెసిఆర్‌తో ప్రభుత్వ విప్ బాల్క సుమన్ సెల్ఫీ



సిఎంతో మంత్రి నిరంజన్



సిఎంతో మంత్రి పువ్వాడ



సిఎంతో మంత్రి ఇంద్రకరణ్

సిఎంతో మంత్రులు దయాకర్‌రావు, సత్యవతి తదితరులు





సిఎంతో మంత్రి మల్లారెడ్డి



ముఖ్యమంత్రితో మంత్రి మహమూద్



సిఎంతో మంత్రి శ్రీనివాస్ గౌడ్



ముఖ్యమంత్రితో ఎంపిలు నామా, వెంకటేష్

సిఎం కెసిఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ

మన తెలంగాణ/హైదరాబాద్ : నూతన సంవత్సర ప్రారంభ సందర్భంగా ప్రగతిభవన్‌లో బుధవారం పలువురు ప్రముఖులు సిఎం కెసిఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్చాలిచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. యాదాద్రి, ఐనవోలు దేవస్థానాల క్యాలెండర్‌లు అందజేశారు. టిఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవ రావు, లోక్‌సభ పక్ష నేత నామా నాగేశ్వరరావు, రంజిత్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి, మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, వి.శ్రీనివాస్‌గౌడ్, పువ్వాడ అజయ్‌కుమార్, వేముల ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, పి.మల్లారెడ్డి సీఎంకు పుష్పగుచ్ఛాలిచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేలు బిగాల గణేష్‌గుప్తా, మాగంటి గోపినాథ్, గండ్ర వెంకటరమణారెడ్డి, ఎంఎల్‌సి పట్నం మహేందర్‌రెడ్డి ముఖ్యమంత్రికి బొకేలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. డిజిపి మహేందర్‌రెడ్డి, సిఎస్ సోమేశ్‌కుమార్ సిఎంకు పుష్పగుచ్చం అందించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



సిఎంతో ఎంఎల్‌సి నవీన్ కుమార్



ముఖ్యమంత్రికి మంత్రి సబిత, ఎంపి రంజిత్ విషెష్

ఈచ్ వన్-టీచ్ వన్‌కు మేం రెడీ

సిఎంకు అండగా ఉంటాం, ముందుకొచ్చిన పెన్షనర్లు

మన తెలంగాణ/హైదరాబాద్ : గ్రామాలు, వార్డులు, పట్టణాలు, బస్తీల్లో నివసిస్తున్న తాము వాలంటీర్‌గా పనిచేసి సిఎం కెసిఆర్‌కు అండగా ఉంటామని.. ఈచ్‌వన్ టీచ్‌వన్ అనే బృహత్తర కార్యక్రమాన్ని దిగ్విజయంగా ముందుకు తీసుకువెళ్తామని వినోద్‌కుమార్ సమక్షంలో పెన్షనర్లు ప్రతినబూనారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఇచ్చిన ఈచ్‌వన్ టీచ్‌వన్ పిలుపు మేరకు తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్లు స్పందించి స్వచ్ఛంధంగా సేవలందించేందుకు ముందుకు వచ్చారు. సిఎం కెసిఆర్ సంకల్పానికి సంపూర్ణంగా మద్దతు ప్రకటించారు. బుధవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి తమ సంసిద్ధతను వ్యక్తం చేశారు. సిఎం పిలుపును విజయవంతం చేసేందుకు అంకితభావంతో కృషిచేస్తామని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ప్రకటించింది. తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నరసయ్య నేతృత్వంలో ప్రధాన కార్యదర్శి ఇనగంటి నవనీతరావు, ఉపాధ్యక్షుడు మహ్మద్ రఫీ ఉద్దీన్, కోశాధికారి ఇ.శ్రవణ్ కుమార్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు హెచ్.రాములు, కార్యదర్శి జి.లక్ష్మీ నారాయణ తదితరులు వినోద్ కుమార్‌తో సమావేశమయ్యారు. ప్రభుత్వానికి వాలంటీర్లుగా పనిచేస్తామని వారు ప్రకటించారు. ఉద్యోగులుగా విధులు నిర్వహించి రిటైరైన తరువాత పెన్షన్ తీసుకుంటున్న వారు రాష్ట్ర వ్యాప్తంగా 3.64లక్షల మంది ఉన్నారు. కెసిఆర్ లక్ష్యసాధనకు పూర్తి సహకారాన్ని అందిస్తామని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్‌కు హామీ ఇచ్చారు. పింఛనర్లు తీసుకున్న నిర్ణయాన్ని వినోద్ కుమార్ స్వాగతించి వారిని అభినందించారు. కొత్త ఏడాదిలో పక్కా ప్రణాళికతో నూతన ఒరవడితో ప్రభుత్వం ముందుకు సాగుతుందని వినోద్ కుమార్ పేర్కొన్నారు. సిఎం కెసిఆర్ నిర్ణయానికి తెలంగాణ టీచర్ల సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. టిఎస్‌టియు రాష్ట్ర సంఘం అధ్యక్షుడు అబ్దుల్ల, ప్రధాన కార్యదర్శి చందూరి రాజిరెడ్డి ఆధ్వర్యంలో వివిధ జిల్లాల బాధ్యులు బుధవారం వినోద్‌కుమార్‌ను కలిసి నూతనసంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.

10లోగా నిరక్ష్యరాస్యుల జాబితా

కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్‌లో సిఎస్ సోమేష్‌కుమార్ ఆదేశం

మన తెలంగాణ/హైదరాబాద్ : నేటి నుండి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం అవుతున్న పల్లె ప్రగతి రెండోవ విడత కార్యక్రమంలో 18 సంవత్సరాలు పైబడి చదవడం రాయడం తెలియని నిరక్ష్యరాష్యుల జాబితాను ఈ నెల 10 వ తేది లోగా నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సోమేశ్ కుమార్ జిల్లా కల్లెక్టర్లను ఆదేశించారు. బుధవారం బిఆర్‌కెఆర్ భవనం నుండి పల్లె ప్రగతి రెండోవ విడతపై జిల్లా కల్లెక్టర్లతో ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, రాష్ట్రంలో వయోజనుల అక్షరాస్యతను పెంపొందిచడం కోసం ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించాలన్నారు. సిఎం కెసిఆర్ అక్షరాస్యత పెంపుకోసం అన్ని గ్రామ పంచాయతులలో ఈచ్ వన్...టీచ్ వన్ చేపట్టాలని నిర్ణయించారని తెలిపారు. రెండోవ విడత పల్లె ప్రగతి సందర్భం గా ప్రతి గ్రామ పంచాయతులలో చదవడం, రాయడం రాని వారి వివరాలను సేకరించాలని జిల్లా కల్లెక్టర్లను ఆదేశించారు. గ్రామానికి సంబంధించిన ఈ జాబితాలో 18 ఏండ్లకు పైబడి నిరక్ష్యరాస్యుల వివరాలు ఉండాలన్నారు. దీని కోసం 10 తేదీ వరకు వేచి చూడకుండా ఏరోజుకు ఆ రోజు అప్‌డేట్ చేయాలని సోమేష్‌కుమార్ ఆదేశించారు. ఈ నిరక్ష్యరాస్యుల వివరాలు సేకరించడానికి సంబంధిత ప్రొఫార్మాను జిల్లా కల్లెక్టర్లకు పంపించామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కల్లెక్టర్లు విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశం లో పంచాయత్ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి వికాష్ రాజ్, సెన్సెస్ డైరెక్టర్ ఇలంబర్తి, మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ రోనాల్ రోజ్, పంచాయత్ రాజ్ కమీషనర్ రఘునందన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల బాలికపై బాలుడి అత్యాచారయత్నం

మనతెలంగాణ/యైటింక్లయిన్‌కాలనీ : ఐదేళ్ల బాలికపై ఓ మైనర్ బాలుడు అత్యాచార యత్నానికి పాల్పడిన ఘటన పెద్దపల్లి జిల్లా గోదావరిఖని టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని మహాకవి పోతనకాలనీలో జరిగింది. పోతనకాలనీకి చెందిన ఒక బ్లాకులో నూతన సంవత్సర వేడుకల్లో అందరూ నిమగ్నమై ఉన్నారు. ఈ సమయంలో ఒంటరిగా ఉన్న ఐదేళ్ల చిన్నారిపై అదే బ్లాకుకు చెందిన మైనర్ బాలుడు అత్యాచారయత్నం చేశాడు. ఆ బాలుడి నుంచి తప్పించుకున్న బాధిత చిన్నారి, జరిగిన విషయం తన తల్లిదండ్రులకు చెప్పింది. ఈ ఘటనపై వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

పరశురామావతారంలో రామయ్య

- భక్తజన సంద్రంగా భద్రాద్రి
- నేడు శ్రీరామావతారంలో సాక్షాత్కారం



మన తెలంగాణ/భద్రాచలం : వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా బుధవారం భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రాచలంలో రామయ్య పరశురామావతారంలో దర్శనమిచ్చారు. అవతారాన్ని వీక్షించేందుకు భక్తులు భారీగా తరలి వచ్చారు. రామయ్య పరశురామావతారాన్ని వీక్షిస్తే శుక్రగ్రహ బాధలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. తొలుత స్వామిని ప్రత్యేక పల్లకిలో మాడ వీధుల గుండా ఆట పాటల మధ్య ఊరేగించారు. అనంతరం స్వామివారిని మిథిలా ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల కోలాహలం నడుమ స్వామి వారికి తిరువీధి సేవను నిర్వహించారు. వేద విద్యార్థుల మంత్రోచ్చారణల నడుమ తాతగుడి వరకు తిరువీధి సేవ సాగింది. ఈ సందర్భంగా రాత్రి మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా సీతారామ చంద్రస్వామివారు నేడు శ్రీరామావతారంలో దర్శనమిస్తారు.

ఆమెకే అధిక ఆయుష్షు

- 2019 ఆరోగ్య గణాంకాల నివేదికలో డబ్ల్యుహెచ్ఓ వెల్లడి

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రపంచంలో మగవాళ్ల కన్నా ఆడవాళ్లే ఎక్కువ కాలం జీవిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక వెల్లడించింది. భారత్‌లో పురుషులు సరాసరి 67.4 ఏళ్లు, మహిళలు 70.3 ఏళ్లు బతుకుతున్నారని తెలిపింది. మహిళల జీవితకాలం 2.9 ఏళ్లు అధికంగా ఉంది. ఇక ప్రపంచవ్యాప్తంగా చూస్తే సరాసరి మహిళలు 74.2 ఏళ్లు జీవిస్తున్నట్లు పేర్కొంది. మగవారు 69.8 ఏళ్లు బతుకుతున్నారని తెలిపింది. అయితే అదనంగా మహిళలు బతికే 4.4 ఏళ్లు కూడా ఒంటరితనం, పేదరికం, వ్యాధులతోనే కాలం గడుపుతున్నారని పేర్కొంది. పురుషుల కంటే మహిళల జీవితాలం ఎక్కువగా ఉండటానికి 40 ప్రధాన కారణాలున్నట్లు వివరించింది. అందులో 33 కారణాలు అధికంగా దోహదం చేస్తాయని వివరించింది. గుండెపోటు, ఊపిరితిత్తుల క్యాన్సర్,టిబి, రోడ్డు ప్రమాదాలు వంటివి ఉన్నాయి. ఇక తక్కువ ఆదాయం గల దేశాల్లో పుట్టినవారి జీవిత కాలం 62.7 ఏళ్లు కాగా, అధికాదాయ దేశాల ప్రజల జీవిత కాలం మాత్రం ఏకంగా 80.8 ఏళ్లుగా ఉంది. ఈ దేశాల జాబితాలో భారత్ కూడా ఉండటం గమనార్హం. ప్రపంచ ఆరోగ్య గణాంకాల నివేదిక 2019 ప్రకారం వివిధ దేశాల్లో ప్రజల జీవిత కాలాన్ని, ఆరోగ్య రంగంలో ఆయా దేశాల స్థానాన్ని వివరించింది. జపాన్‌లో ప్రపంచంలోనే అత్యధికంగా మహిళలు 87.1 ఏళ్లు, పురుషులు 81.1 ఏళ్లు బతుకుతున్నారు.



జీవిత కాలం ఇలా తగ్గిపోతుంది

తక్కువ ఆదాయం గల దేశాల్లో జీవితకాలం తక్కువ ఉండటానికి 10 ప్రధాన కారణాలు ఉన్నాయి. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లతో ఆయుర్దాయం 2.09 ఏళ్లు తగ్గింది. అతిసార వ్యాధులతో 1.97 ఏళ్లు, గుండెపోట్లతో 1.45 ఏళ్లు, ఎయిడ్స్‌తో 1.45 ఏళ్లు, టిబితో 1.35 సంవత్సరాలు, గుండె జబ్బులతో 1.35 ఏళ్లు, మలేరియాతో 10 నెలలు, రోడ్డు ప్రమాదాలతో ఏడున్నర నెలలు, పోషకాహార లోపంతో 6 నెలలు, ఇతరత్రా కారణాలతో మరో ఏడాదిన్నర ఆయుర్దాయం తగ్గుతోందని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా 2016లో మధుమేహం, గుండె పోటు, కిడ్నీ, క్యాన్సర్ తదితర వ్యాధుల కారణంగా 4.10 కోట్ల మంది చనిపోయారు. అంటే మొత్తం ప్రపంచంలో ఆ ఏడాది చనిపోయినవారిలో ఈ సంఖ్య ఏకంగా 71 శాతం ఉండటం గమనార్హం. ప్రపంచవ్యాప్తంగా వాయు కాలుష్యం వంటి కారణాల వల్ల 2016లో ఏకంగా 70 లక్షల మంది చనిపోయారు. పట్టణాలు, నగరాల్లో ప్రతీ పది మందిలో ఒకరు వాయు కాలుష్యం బారిన పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. వాయుకాలుష్యం కారణంగా గుండె జబ్బులు, ఊపిరితిత్తుల క్యాన్సర్, ఇతర శ్వాసకోశ వ్యాధులు రావడానికి ప్రమాదముంది. ఇక పరిశుభ్రమైన తాగునీటిని వాడుతున్న ప్రజల శాతం పెరిగింది. ఐదేళ్లలోపు చిన్నారులు డయేరియాతో 4.70 లక్షల మంది చనిపోయారు.

10 వేల మందికి 15 మంది డాక్టర్లు

ప్రపంచవ్యాప్తంగా ప్రతీ పది వేల మందికి 15 మంది డాక్టర్లు మాత్రమే ఉన్నారు. షుగర్, బిపి, గుండె, కిడ్నీ సంబంధింత వ్యాధులకు థాయ్‌లాండ్ కంటే కూడా భారత్‌లో యూనివర్సల్ హెల్త్ కవరేజీ ఎక్కువగా లేకపోవడం గమనార్హం. శ్రీలంకలో 62 శాతం జనాభాకు యూనివర్సల్ హెల్త్ కవరేజీ అందుతుండగా, దేశంలో కేవలం 56 శాతం మందికే అందుతోంది. గర్భిణిలు ఆసుపత్రికి వస్తే ప్రసవం చేయడానికి నిపుణులైన వైద్య సిబ్బంది ఉండటం లేదు. దీనివల్ల మాతా శిశుమరణాలు అధికంగా సంభవిస్తున్నాయని తెలిపింది. మొత్తంగా ప్రపంచవ్యాప్తంగా యూనివర్సల్ హెల్త్ కేర్ అందుబాటులోకి వస్తేనే ప్రజల ఆరోగ్య ప్రమాణాలు, ఆయుర్దాయం పెరుగుతాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ దేశాలకు పిలుపునిచ్చింది. అలాగే ప్రపంచంలో సగం జనాభాకు అత్యవసర వైద్య సేవలే అందడం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ప్రపంచంలోని జనాభాలో 80.80 కోట్ల మంది తమ ఇంటి ఖర్చులో 10 శాతం పైగా వైద్యానికి ఖర్చు చేస్తున్నారు. తమ ఇంటి ఖర్చులో వైద్యానికి అధికంగా ఖర్చు చేసిన ఫలితంగా 2010లో ఏకంగా 9.70 కోట్ల మంది పేదరికంలోకి వెళ్లాల్సి వచ్చింది. పెద్ద చిన్నా అనే తేడా లేకుండా అన్ని దేశాల్లోనూ మందుల కొనుగోళ్లకే ప్రజలు ఎక్కువగా ఖర్చు చేస్తున్నారు. ఇక దేశంలో ప్రతీ 10 వేల మంది జనాభాకు 7.8 మంది డాక్టర్లుండగా, నర్సులు 21.1 మంది ఉన్నారు. ప్రతీ లక్ష మందిలో 204 మందికి క్షయ వ్యాధి ఉంది. ప్రతీ వెయ్యి మందిలో 7.7 మందికి మలేరియా వచ్చే ప్రమాదముంది.

నూతన సంవత్సర వేళ

మెట్రో రికార్డు

- ఒక రోజే 4.60లక్షలమంది ప్రయాణం
- పోలీసులకు చిక్కకుండా మెట్రోలో మందుబాబులు
- ముందే పసిగట్టి సర్వీసులు పెంచిన అధికారులు

మన తెలంగాణ/సిటీబ్యూరో : నగరంలో ప్రజలను వివిధ ప్రాంతాలకు చేరవేస్తున్న మెట్రో రైళ్లు కొత్త సంవత్సరం సందర్భంగా మంగళవారం అర్థరాత్రి ప్రయాణీకులతో రద్దీగా మారాయి. అధికారులు ఊహించని విధంగా 4.60 లక్షల మంది మెట్రోలో ప్రయాణించడంతో మెట్రో కొత్త రికార్డు నమోదు చేసుకుంది. ఇప్పటివరకు ఆర్‌టిసి సమ్మె కాలంలో 4లక్షల మంది ప్రయాణించి రికార్డు కొట్టగా, తాజాగా నూతన సంవత్సరం సందర్భంగా ప్రమాదాలు జరగకుండా మందుబాబులు సొంత వాహనాల్లో వెళ్లకుండా రైళ్లలో ప్రయాణించి మెట్రోకు కాసులు వర్షం కురిపించారు. అర్థరాత్రి వరకు న్యూయర్ జోష్‌లో మునిగితేలిన నగరవాసులు సురక్షితంగా ఇంటికి చేరేందుకు మెట్రో వైపే మొగ్గు చూపారు. సాధారణంగా కొత్త సంవత్సరం వేడుకల్లో చాలామంది చిత్తుగా తాగి డ్రైవ్ కేసుల్లో పోలీసులకు దొరికిపోతుంటారు. కానీ ఈ సంవత్సరం డ్రంకెన్ డ్రైవ్ కేసులు చాలా స్వల్పంగా నమోదైనట్టు పోలీసులు పేర్కొంటున్నారు. కార్లు,ద్విచక్ర



వాహనాలు ఉన్నవారు వేడుకల్లో పాల్గొన్న తరువాత తమ వాహనాలను ఆయా హోటళ్లు, పార్కింగ్‌ల వద్ద ,ఆఫీసుల వద్ద వదిలేసి మెట్రోలో ఇంటికి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. అర్థరాత్రి వేళ రోడ్డుపై ప్రమాదాలు జరగకూడదని కొందరు, పోలీసులకు చిక్కొద్దని మరికొందరు మెట్రో వైపు అడుగులు వేశారు. ఇలాంటి పరిస్థితిని పసిగట్టిన మెట్రో అధికారులు ముందుగానే 31న అర్థరాత్రి వరకు మెట్రో సర్వీసులను అందుబాటులో ఉంచుతున్నట్లు ప్రకటించారు. ఇది నగరవాసులకు చాలా బాగా ఉపయోగపడింది. ప్రత్యేకించి జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, మియాపూర్, అమీర్‌పేట, లక్డీకాపూల్, దిల్‌షుక్‌నగర్, ఎల్‌బినగర్,నాగోల్ వంటి రూట్లలో మెట్రో రైళ్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. నూతన సంవత్స వేడుకుల సందర్భంగా రోజువారీ ప్రయాణికుల కంటే కొత్త సంవత్సరంలో 40వేలమంది ఎక్కువగా ప్రయాణించినట్లు మెట్రో అధికారులు తెలిపారు.

కామన్ సింబల్ కోసం గడువు 4

రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు


మన తెలంగాణ/హైదరాబాద్ :మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలు కామన్ సింబల్ కోసం జనవరి నాలుగవ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్ కుమార్ సూచించారు. ఈ మేరకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇప్పటి వరకు ఒక గుర్తు కేటాయించబడని రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రూ.10 వేల డీడీని సంఘం, కార్యదర్శి పేరుతో సమర్పించాలి. కమిషన్ సూచించిన అందుబాటులో ఉన్న గుర్తుల్లో నుంచి ఏవేనీ 10 చిహ్నాలను ప్రాధాన్యతాక్రమంలో పేర్కొనాలి. మొత్తం స్థానాల్లో కనీసం 10 శాతం స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టనున్నట్టు అండర్ ఇవ్వాలి. ఒకసారి కేటాయించిన గుర్తు ఐదేండ్ల పాటు ఉంటుంది. ఒకవేళ వరస ఎన్నికల్లో పోటీ చేయని పక్షంలో ఆ గుర్తును రద్దు చేస్తారు. ఒకే గుర్తును ఒకటిని మించి పార్టీలు కోరుకుంటే లాటరీ పద్ధతిలో కేటాయిస్తారు. పార్టీ కోరుకున్న గుర్తులు కేటాయించ లేని పక్షంలో సదరు పార్టీ ప్రతినిధులతో చర్చించి ఇతర గుర్తులను కేటాయిస్తారు.

ఇక ఢిల్లీ సమరం!

సంపాదకీయం

రాష్ట్రాల్లో రాజకీయాధికారానికి సంబంధించి 2019 భారతీయ జనతా పార్టీకి చేదు అనుభవాన్నే చవిచూపింది. గత నెలాఖరులో కోల్పోయిన జార్ఖండ్‌తో కలిపి చూసుకుంటే గడచిన సంవత్సరంలో ఐదు రాష్ట్రాల్లో అది అధికారం కోల్పోయింది. దాని ఆధిపత్య రాష్ట్రాల సంఖ్య 22 నుంచి 15కి పడిపోయింది. జార్ఖండ్‌కు ముందు చత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలను అది జారవిడుచుకున్నది. ఇవన్నీ పెద్ద రాష్ట్రాలే. ఒక్క కర్నాటకలో మాత్రం అతి కష్టం మీద ప్రభుత్వాన్ని తిరిగి ఏర్పాటు చేయగలిగింది. త్వరలో ఎన్నికలు జరగనున్న ఢిల్లీలో ఏమి కానున్నది, 2020 ముగిసేలోగా బ్యాలట్ పోరు సాగనున్న బీహార్ ఫలితం ఎలా ఉండబోతున్నది అనే ప్రశ్నలు ఉత్కంఠభరితమైనవి. ఢిల్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ త్వరలో విడుదల కావలసి ఉంది. ఇప్పటికే అక్కడ ఎన్నికల వేడి మొదలయింది. 1998 నుంచి ఢిల్లీలో అధికారానికి బిజెపి దూరంగా ఉంది. అక్కడి అసెంబ్లీలో గల 70 స్థానాల్లో 67 గెలుచుకొని 2014 నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధికారంలో కొనసాగుతున్నది. ఐదేళ్ల పాటు మంచి పాలన ఇచ్చిన కేజ్రీవాల్‌ను కొనసాగించండి అంటూ ఓటర్ల మనసును గెలుచుకునేందుకు ఆప్ ప్రయత్నిస్తున్నది. ప్రధాని మోడీ రామ్‌లీలా మైదానం భారీ సభతో కమల నాథులూ ఓటు వేటలో ముందున్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ కూడా గణనీయమైన శక్తే. గతంలో షీలాదీక్షిత్ పాలన అక్కడ ఆ పార్టీకి మంచి గుర్తింపునే తెచ్చింది. కేజ్రీవాల్ తనదైన నూతన పంథాలో మంచి పాలన అందిస్తున్నాడనిపించుకుని ప్రజలను ఆకట్టుకున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలోని మొత్తం ఏడు స్థానాలనూ బిజెపియే గెలుచుకున్నప్పటికీ, ఇప్పటి పరిస్థితుల్లో అక్కడి అసెంబ్లీ ఎన్నికలు దానికి ఆ మాదిరిగా నల్లేరు మీద నడక కాబోవని భావిస్తున్నారు. వచ్చే అక్టోబర్, నవంబర్‌లలో ఎన్నికలు జరగనున్న బీహార్‌లోనూ ఎలా ఉండబోతుందనే ప్రశ్న తలెత్తుతున్నది. అక్కడ ఇప్పుడే ఎన్నికల వాతావరణం గూడు కట్టుకోవడం మొదలయింది. లోక్‌సభ ఎన్నికల్లో చెరి సగం స్థానాల్లో పోటీ చేసిన పాలక పార్టీలు జెడి(యు)— బిజెపిలు ఈ సారి మెజారిటీ సీట్ల కోసం ఆరాటపడుతున్నాయి. అందుకోసం వాటి మధ్య పెనుగులాట ఇప్పుడే ప్రారంభమైంది. భారతీయ జనతా పార్టీ వరుసగా రాష్ట్రాలను కోల్పోతుండడం ఈ బేరంలో జెడి(యు)కి అనుకూల అంశం కానున్నది. పశ్చిమ బెంగాల్, అసోం, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి ఎన్నికలు కూడా 2021 ఏప్రిల్— మే నెలల్లో జరగవలసి ఉంది. వాటికి పూర్వ రంగం ఈ ఏడాది చివరిలోనే మొదలవుతుంది. జమ్ము, కశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతాలకూ ఎన్నికలు జరగవలసి ఉన్నాయి. కేంద్రంలో బిజెపి ఎదురులేని రీతిలో సుస్థిరమైన అధికారాన్ని అనుభవిస్తున్నప్పటికీ రాజ్యసభలో బలాన్ని పెంచుకోవలసి ఉంది. 245 స్థానాలున్న రాజ్యసభలో బిజెపి ప్రస్తుత బలం 83, కాంగ్రెస్ (46), ఇతర పార్టీల ఉమ్మడి బలమే అధికం. కాంగ్రెసేతర పార్టీల్లో బిజెపికి అనుకూల పక్షాలు చాలా ఉన్నందున కీలక బిల్లులను రాజ్యసభలో అది నెగ్గించుకోగలుగుతున్నది. అయితే తనంతతానుగా మెజారిటీ సాధించుకోవాలంటే చాలా కృషి చేయవలసి ఉంది. ఆ మేరకు రాష్ట్రాల్లో సంఖ్యాధిక్యతను సాధించుకోవలసి ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరి, జూన్, జులై, నవంబర్ మాసాల్లో రాజ్యసభలోని 73 స్థానాలకు 21 రాష్ట్రాల నుంచి ఎన్నికలు జరుగుతాయి. 2014లో కేంద్రంలో అధికారాన్ని చేజిక్కించుకున్నప్పటి నుంచి బిజెపి రాష్ట్రాలలోనూ విజయ విహారం సాగించింది. అప్పట్లో కేవలం ఏడు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ఆ పార్టీ 2017–18 నాటికి 21 రాష్ట్రాలను జేబులో వేసుకున్నది. ఆ తర్వాత ఒక్కొక్కటిగా పలు రాష్ట్రాలను కోల్పోతూ వస్తోంది. కేంద్రంలో సుస్థిరంగా అధికారంలో ఉన్నప్పటికీ బిజెపి రాష్ట్రాలను చేజార్చుకోవడం ఆగకపోతే దాని ప్రతిష్ఠ దారుణంగా దెబ్బ తింటుంది. ఇటీవల ఎన్నికలు జరిగిన మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్‌లలో జాతీయ స్థాయిలో తాను తీసుకున్న హిందుత్వ అనుకూల నిర్ణయాలనే చూపించి ప్రజల ఓటును ప్రధాని మోడీ అర్థించారు. కాని విజయాలు పొందలేకపోయారు. రాష్ట్రాల ఎన్నికల్లో స్థానికంగా అక్కడి ప్రభుత్వాల పాలన తీరే ప్రజలను ప్రభావితం చేస్తుందనే అభిప్రాయాన్ని కల్లగా చూపించాలని మోడీ చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. కశ్మీర్ స్వయం ప్రతిపత్తి రద్దు, పౌరసత్వ సవరణ చట్టం వంటి వివాదాస్పద నిర్ణయాలను ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో ప్రజలు ఆమోదించలేదని భావించడానికి ఆస్కారం కలిగింది. త్వరలో జరగబోయే ఢిల్లీ ఎన్నికల్లో కూడా ప్రధాని తన హిందుత్వ పాలనను చూపించి ఓట్లు అడుగుతారో లేదో చూడాలి. కేంద్రంలో తిరుగులేని అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపి వెనుకడుగు వేయడం ఆ మేరకు కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలు పుంజుకోడం భవిష్యత్తు భారతాన్ని ఎటువైపు నడిపిస్తాయనేది ఆసక్తికరం.

చాణక్య చంద్రశేఖరుడు



సురేష్ కాలేరు
9866174474

మనసా చింతితం కార్యం వచసాన ప్రకాశయేత్ / మంత్రేణ రక్షయేత్ గూడమ్ కార్యేచపీ నియోజయేత్

మనసులో ఆలోచించిన దాన్ని మాటల్లో ప్రకటించ కూడదు. రహస్యంగా వేసిన పథకాన్ని ఆచరణ ద్వారానే చూపాలి. ఎప్పుడో రెండు వేలపై చిలుకు ఏళ్ళ కిందట అర్థశాస్త్రంలో కౌటిల్యుడు చెప్పిన నీతి ఇది. పాశ్చాత్యుల దగ్గరి నుంచి అలెగ్జాండర్ దండయాత్రల ఫలితంగా చిన్న చిన్న రాజ్యాలుగా విడిపోయిన రాజ్యాన్ని ఐక్యం చేసి ఆధునిక భారతాన్ని నిర్మిద్దాం అని కలలుగన్న చాణక్యుడు అధికారంలోకి రావడానికి రాజు అవలంబించాల్సిన పద్ధతుల్ని అధికారంలోకి వచ్చాక అనుసరించాల్సిన అంశాలని వందల కొద్దీ శ్లోకాల్లో విడమర్చి విశదీకరించి తన అర్థశాస్త్ర గ్రంథంలో పేర్కొన్నాడు.

అర్థశాస్త్ర గ్రంథం కేవలం ఆర్థిక శాస్త్రం కాదని అది రాజనీతి శాస్త్రానికి ఆది మూలగ్రంథంగా రాజనీతి పండితుల ప్రశంసలు నేటికీ పొందుతోంది. ప్రభుత్వ రూపం ఏదైనా రాజ్య స్వరూపం ఏదైనా కౌటిల్యుని అర్థశాస్త్రం ఇప్పటి పాలకుల అధ్యయనం చేసి ఆచరించినట్లయితే పది కాలాల పాటు ప్రశంసలు పొందగలుగుతారు. రాజ్యాన్ని, ప్రభుత్వం ఎలా నడిపించాలని అనుకునేవారు తన లోపాలను దాచి శత్రువుల బలహీనతలను వెతకాలని కాలం కలిసి వచ్చినప్పుడు నాయకుడు నిర్బంధంగా నిక్కచ్చిగా నియంతగా వ్యవహరించాలని కాలం కలిసి రానప్పుడు ముక్కుసూటిగా పోకూడదని మౌనంగా ఉంటూ సందర్భం వచ్చినప్పుడే కుండను బద్దలు చేసినట్లు చేయాలని చెబుతాడు చాణక్యుడు. చాణక్యుడు ఆత్మను వెతికి పట్టుకొని ఈ భూమండలంలో నువ్వు చెప్పింది తూచ తప్పక ఆచరిస్తూ ఉన్నది ఎవరు అని అడిగితే ఇప్పుడు ఖచ్చితంగా ఒక వ్యక్తిని మాత్రం ముందుగా ఎంపిక చేస్తారు. ఆయన పేరు... కల్వకుంట్ల చంద్రశేఖర రావు.

అనుకూల పరిస్థితుల గురించి మీనమేషాలు లెక్కపెట్టకుండా స్థితిని అంచనా వేసి పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకుని లక్ష్యం చేరుకునే వాడే అంతిమంగా విజయం సాధిస్తాడు. కెసిఆర్ సాధించింది, సాధిస్తున్నది అదే. తెలంగాణ ఉద్యమం గత ఐదారు దశాబ్దాల కాలం నుండి అనేక రూపాలలో కొనసాగుతున్న తెలంగాణ రాష్ట్ర సాధన కెసిఆర్ ఆధ్వర్యంలో ఏర్పడ్డ టిఆర్‌ఎస్‌కు ముందు ఒక రకంగా ఉంటే ప్రజాస్వామిక వ్యవస్థలు రాజకీయ ప్రక్రియకు ఉన్న ప్రాముఖ్యతను గుర్తించి తెరాస అనుసరించిన పద్ధతులు వేసిన ఎత్తుగడలో పరిస్థితులను ప్రభావితం చేసిన తీరు కెసిఆర్ చేపట్టిన కార్యక్రమాలు నడిపించిన ఉద్యమాలు పాల్గొన్న రాజకీయ ప్రక్రియ ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని స్థిరపరచి విస్తృత పరచి వ్యవస్థీకృతం చేసి గమ్యాన్ని ముద్దాడిన తీరు చాణక్యుని యుద్ధనీతిని మరిపింప చేస్తుంది.

1999 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఫలితాలు తెలంగాణలో అధికార టిడిపి ఎదుర్కొన్న పరిస్థితులు, 2000 ఆగస్టు 11న లేక్ వ్యూ అతిథి గృహంలో 41 మంది తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోరుతూ సంతకాలు చేసి కాంగ్రెస్ అధ్యక్షురాలు లోక్‌సభలో ప్రతిపక్ష నాయకురాలు సోనియాగాంధీకి సమర్పించడం ఆమె క్షుణ్ణంగా విషయం తెలుసుకొని సానుకూలంగా స్పందించడం జరిగింది. అంతకుముందు 1998లో కేంద్ర ప్రభుత్వం మూడు కొత్త రాష్ట్రాల ఏర్పాటు ఉత్తరాంచల్, జార్ఖండ్, చత్తీస్‌గఢ్ ఏర్పాటు చేయడం, 1998 పార్లమెంట్ ఎన్నికల ముందు బిజెపి కాకినాడ సమావేశంలో ''ఒక ఓటు రెండు రాష్ట్రాల'' నినాదంతో తెలంగాణ ఏర్పాటుకు మద్దతు ఇవ్వడం ఏ రోజుకైనా జాతీయ ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీలు తెలంగాణ ఏర్పాటుకు ముందుకు వస్తాయని నాటి



పరిస్థితులన్నింటినీ 2000 సంవత్సరంలోనే అంచనా వేసి దూరదృష్టితో సందర్భం వచ్చినప్పుడు పార్టీని ప్రకటించి జెండాను పాతి ఎజెండా ప్రకటించిన చంద్రశేఖర రావు నాటి నుంచి నేటి వరకు ప్రతి సందర్భంలోనూ చాణక్య నీతిని ప్రదర్శిస్తున్నారు. 2000 ఏప్రిల్ 27 నుండి నేటి వరకు ఉద్యమకారునిగా పార్టీ నేతగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఆయనను నిశితంగా పరిశీలిస్తే చాణక్యుడు చెప్పిన నీతి బోధపడుతుంది.

ఇద్దరు పార్లమెంటు సభ్యులతో తెలంగాణ వచ్చిందా... సోనియమ్మ ఇచ్చింది. ఇందులో కెసిఆర్ గొప్పతనం ఏముంది? అని చెప్పుకునే కాంగ్రెస్ నాయకులు కెసిఆర్‌ను ఇంకా పూర్తిగా అధ్యయనం చేయలేదు అనిపిస్తుంది. వర్తమానంలో ఉన్న నాయకులతో పోల్చినప్పుడు కెసిఆర్ ది ఒక విశిష్టమైన వ్యక్తిత్వం. తెలంగాణ సమస్యలు సాధకబాధకాలతో ముడిపడిన అంశాలన్నింటినీ కూలంకషంగా అధ్యయనం చేసి విమర్శనాత్మకంగా విశ్లేషించగలిగిన, వివరించగలిగామని సత్తా ఏ అంశంపైనా సరే అలవోకగా అనర్గళంగా అబ్బురపరిచే రీతిలో ప్రసంగించి ప్రశంసలు పొందగలిగే అసమాన ప్రతిభాశీలి కెసిఆర్. చాణక్యుడు చెప్పిన రాజనీతి అదే. గతం పునాదులపై నిలబడి భవిష్యత్తును అంచనా వేసి వర్తమాన పరిస్థితులను తనకు అనుకూలంగా మలుచుకునేవారే నాయకుడు అవుతాడు. పది కాలాల పాటు నిలబడతాడు.

ఉద్యమ సమయంలో తెలంగాణలో నెలకొన్న వాస్తవాలను ఒకవైపు పాలక వర్గాల దృష్టికి తీసుకురావడంలో, మరోవైపు జన సామాన్యాన్ని ఆలోచింప చేయడంలో, వారిని ఉద్యమానికి సమాయత్తం చేయడంలో సాధించిన విజయం మామూలు విషయం కాదు. సమకాలీన రాజకీయ సంస్కృతిలో నిలదొక్కుకోవాలంటే ఏది అవసరమో, ఎంత వరకు అవసరమో అదే కెసిఆర్ అనుసరించారు, అవలంబించారు. అందుకే వరుస విజయాలు సాధిస్తున్నారు. మంచి ముఖ్యమంత్రిగా అశేష జనవాహిని మదిలో నిలిచి పోతున్నారు.

''తెలంగాణ కోసం కొట్లాడిన, మాట్లాడిన ఎంతో మంది నాయకులను చూశాను కలిసి పని చేశాను. కానీ మీతో మాట్లాడిన తర్వాత మీ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడుతుందని నమ్మకం విశ్వాసం నాలో కలుగుతున్నది. ''ఇది కెసిఆర్‌తో జయశంకర్ సార్ 2000 సంవత్సరంలోనే అన్న మాటలు. నిజమే కావచ్చు తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది కాంగ్రెస్. మరి ఎందుకు తెలంగాణ ప్రజలు ఇంతగా కెసిఆర్‌ను విశ్వసిస్తున్నారు. ఎప్పుడైనా కాంగ్రెస్ పార్టీ నేతలు ఆలోచించారా? ఆలోచించరు. కెసిఆర్ వ్యవహార శైలిని పోటాపోటీగా విమర్శించడం తప్ప వారికి ఇంకా ఏమీ తెలియదు. ఉన్న ఆర్‌టిసి సమ్మెను ఉధృతం చేస్తే హుజూర్‌నగర్‌లో విజయం సాధిస్తామని అనుకున్నా వారు ఫలితాన్ని చూసి డీలా పడిపోయారు. ఆర్‌టిసి సమ్మె విషయంలో, దిశ సంఘటన విషయంలో కెసిఆర్ ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ఆశించినా, ప్రతిపక్షాలకు కెసిఆర్ ఇచ్చిన ఫినిషింగ్ టచ్‌లతో బెంబేలెత్తిపోయారు. మొన్నటి వరకు డిపోల ముందు వరుసగా నిలబడి తిట్టినోళ్లే నేడు జేజేలు పలుకుతున్నారు. పిడికిలి బిగించి నినాదాలు చేసిన చేతులే ఇవాళ క్షీరాభిషేకం చేస్తున్నాయి.

ఆయన మాటల వెనక, మౌనం వెనుక ఏదో పరమార్థం దాగి ఉంటుంది. ఫామ్‌హౌస్‌లో పడుకుంటారు అనే విమర్శించే ప్రతిపక్షాలు ఆయన వేసే పాచికల ముందు పరేషాన్ అవుతున్నాయి. కెసిఆర్ చాణక్యుడి రాజనీతిని ఔపోసన పట్టి ఉంటారు. ఎవరు ఎన్ని పోకడలు పోయినా సమయం వచ్చే వరకు ఓపిక పట్టి మళ్లీ లేవకుండా గిరవాటు వేయడంలో ఆయన అనుసరించిన పద్ధతుల్ని ప్రత్యర్థులు అధ్యయనం చేయాల్సిందే. చివరాఖరికి చెప్పేది ఏమిటంటే రాష్ట్రంలో విపక్షాలు, కెసిఆర్ విమర్శకులు, ప్రత్యర్థులు చాణక్యుడిని చదవకున్నా పర్వాలేదు.. చంద్రశేఖర రావును చదివితే చాలు. ఎందుకంటే చాణక్యుడు బ్రతికి ఉంటే చంద్రశేఖర రావు దగ్గర చాలా నేర్చుకునేవాడు.

చుట్టుముడుతున్న ఫాసిజం

బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజం దేశాన్ని చుట్టేస్తోంది. అల్లకల్లోలం చేస్తోంది. గాలి పొరాడకుండా చీకటి కొట్టులా మార్చేస్తోంది. కశ్మీర్‌ను బందీఖానాలోకి తోసేసింది. బాబ్రీ మసీదు రామజన్మభూమి వివాదంలో అత్యున్నత న్యాయస్థానం హిందుత్వ తీర్పును ప్రకటించింది. రాజ్యాంగ వ్యతిరేకంగా పౌరసత్వ సవరణ బిల్లును మూక బలంతో తీసుకొచ్చింది. చీకటి న్యాయానికి ఉరితాళ్లను పేనుతోంది. అన్ని సమస్యలకు, పోరాటాలకు, ధిక్కారాలకు హింసాత్మక సమాధానాలు చూపిస్తోంది. నాలుగు వైపుల నుంచి ఫాసిజం చుట్టుముడుతున్న వేళ విరసం యాభై ఏళ్ల సభలు జరుగుతున్నాయి.

ఉత్పత్తి కులాలు, ముస్లింలు, ఆదివాసులు, మహిళలు నెత్తురోడుతున్న సందర్భం ఇది. పశ్చిమ కనుమల నుంచి దండకారణ్యం, ఆంధ్రా ఒడిషా సరిహద్దు ప్రాంతాల దాకా లక్షల సైన్యం విప్లవోద్యమ నిర్మూలనకు తలపడుతున్న యుద్ధ సన్నివేశంలో ఈ సభలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎక్కడ చూసినా కన్నీళ్లు, ధ్వంసమైపోతున్న మానవ దేహాలు, కలుషితమవుతున్న సాంస్కృతిక విలువలతో చీకటి ఆవరిస్తున్న సన్నివేశంలో ఈ సభలకు తెలుగు సాహిత్య లోకం సిద్ధమవుతోంది. సారాంశంలో మావోయిస్టు రహిత, ముస్లిం రహిత అండ భారత్ కోసం బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజం బరితెగించిన సంక్షోభ సందర్భంలో విరసం తన యాభై వసంతాల మహా సభలు జరుపుకోబోతోంది.

అందుకే ఇది వసంతాలు పూచే కాలమా? కవులు గొంతెత్తి స్వేచ్ఛాగానం చేసే దేశమా? విరసం చరిత్రలో కూడా యాభై వసంతాలతో పాటు యాభై శిశిరాలు కూడా ఉన్నాయి. ప్రతి వసంతమూ మానవులు పరిమళించే తీరం వైపు సాగిపోయిందే. ప్రతి సంక్షోభమూ రేపటి మీద పైచేయి కోసం సాచినదే. శిశిర వసంతాల కలనేతలోంచే మానవ జాతి సుందర భవితవ్యం కోసం విరసం తన కాల్పనికశక్తినంతా ధారపోస్తున్నది. విరసం ఏర్పడ్డాక ఆర్నెల్లకల్లా విప్లవ రచయితల అరెస్టులు, పుస్తక నిషేధాలు మొదలయ్యాయి. ఇప్పటి దాకా మూడు తరాల విరసంలో కనీసం ఒక్క అక్రమ కేసైనా మోయ ని, ఒక్కసారైనా ఖైదు కాని సభ్యులు లేకపోవచ్చు. రచన కోసం, విశ్వాసం కోసం చిత్రహింసలు అనుభవించిన సభ్యులు ఎందరో. ఏండ్ల తరబడి జైలు జీవితం గడిపిన వారెందరో. ఈ యాభై ఏళ్ల సందర్భంలో కూడా వ్యవస్థాపక సభ్యుడు వరవరరావు, సీనియర్ సభ్యుడు జివిఎన్ సాయిబాబ, కార్యవర్గ సభ్యుడు జగన్ దీర్ఘకాలంగా జైల్లో ఉంటున్నారు. కార్యవర్గ సభ్యుడు కాసిం మీద ఏడు కుట్ర కేసులు ఉన్నాయి. ఎందరో విరసం సభ్యుల మీద ఇలాంటి కేసులు ఉన్నాయి. ప్రతి సృజన స్వరం మీద కత్తి వేలాడుతూనే ఉన్నది. అయినా ధిక్కారమే తన నైజమని విరసం చాటి చెప్తోంది. రచన కోసం, ఆలోచన కోసం, అంతిమంగా ఈ దేశ ప్రజల విముక్తి కోసం ఎడతెగని రాపిడిని యాభై ఏళ్లుగా అనుభవిస్తున్నది. విరసంలోని ఈ శక్తి అంతా అట్టడుగు ప్రజల వర్గ పోరాటాలలో ఉన్నది. సాంఘిక స్వేచ్ఛా ఉద్యమాలలో ఉన్నది. అందుకే తరతరాల ఈ నేల బిడ్డల ధిక్కారానికి తనను తాను వారసురాలిగా విరసం మొదట్లోనే ప్రకటించుకున్నది. నిర్బంధాలు, అణచివేతలు, ఆటుపోట్ల మధ్య విస్తారమైన అనుభవాలను గడించింది. భారతీయ సాహిత్య చరిత్రలో ఇలాంటి రచయితల సంఘంగా తానే ఒక ఉదాహరణగా నిలబడింది. అక్షరం కోసం అణచివేతను ఎదుర్కొంటున్నది.

ఇవాళ దేశవ్యాప్తంగా ప్రగతిశీల బుద్ధిజీవులు, రచయితలు ఇలాంటి హింసను అనుభవిస్తున్నారు. ఎందరో ఆలోచనాపరులను ఫాసిజం బలి తీసుకున్నది. దేశవ్యాప్తంగా అపూర్వమైన మేధావులను ఫాసిస్టు రాజ్యం ఖైదు చేస్తున్నది. వాళ్ల కంఠ స్వరానికి, కలం పదునుకు భయపడిపోతున్నది. ఇక అసంఖ్యాక ఆదివాసులు, ముస్లింలు, దళితులు వేల సంఖ్యలో జైళ్లలో ఉన్నారు. 'ప్రశాంత' పాలన కోసం ఫాసిజం మరిన్ని అప్రజాస్వామిక చట్టాలను తీసుకొస్తోంది. బ్రాహ్మణీయ పార్లమెంటరీ విధానం ద్వారానే ఫాసిజం పెచ్చరిల్లుతున్నది.

సమాజాన్ని భయానికీ, అభద్రతకు, నిరాశకూ లోనుచేయడమే ఫాసిజం లక్షణం. ఇక మనమేమీ చేయలేమనే నిస్సహాయతను పోరాట శక్తులపై పులమడమే ఫాసిజం. సమాజమంతా మౌనంలోకి జారిపోవడమే ఫాసిజానికి కావాలి. ఇదీ ఇవ్వాల్టి కవి సమయం. హృదయాన్ని సాచి మానవ ప్రేమను ప్రకటించదల్చుకున్నావా? జైలు పాలు కావాల్సి వస్తుందని ఫాసిజం హెచ్చరిస్తున్న సాహిత్య సందర్భం. ఈ విపత్కర పరిస్థితిలో కూడా విరసం తన అచంచలమైన నిర్భయ ప్రకటన చేయడానికే ఈ సభలు నిర్వహిస్తోంది. ఫాసిజం ఓడిపోతుందని, ప్రజలు జయిస్తారని, భవిష్యత్తు కార్మిక వర్గానిదేనని చెప్పడానికి ఈ సభలు జరుపుతోంది. చరిత్రలో ఫాసిజం ముసిరిన వేళ సాహసోపేతంగా జీవించి, మరణించిన రచయితలు, కళాకారులు తనకు ఆదర్శం. రాజ్యం నిరంకుశంగా మారినా, సామాజిక హింస పెచ్చరిల్లినా, ప్రగతిశీల మార్పులు సంక్షోభంలో పడినా విప్లవ రచయితలకు కల చెదిరిపోదు. గుండె చెమ్మగిల్లవచ్చుగాని విషాదాన్ని ఆలింగనం చేసుకోరు. నిస్పృహ గీతాలను ఆలపించరు. ఇది మొండి ధైర్యం కాదు, చారిత్రక పరిణామాల మీద తార్కిక అంచనా. ఈ కల్లోలాన్ని రద్దు చేసే శాస్త్రీయ ఆచరణకు సిద్ధం కాగలమనే విమర్శనాత్మక వైఖరి.

చరిత్ర పొడవునా ఎన్నో భావజాల యుద్ధాలు జరిగాయి. ఇప్పుడది తీవ్రస్థాయికి చేరుకుంది. రాజ్యమే మత భావ జాలానికి అధికార ప్రతినిధి అయింది. పైకి ఇది ఎట్లా కనిపించినా దేశంలోని ఆర్థిక సంక్షోభమే ఈ ఫాసిజానికి మూలం. ఆస్తి సంబంధాల సంఘర్షణలో దోపిడీ వర్గ ప్రయోజనాల కోసం ఇదంతా. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పరిణామాల్లో భాగంగా మన దేశంలో ఫాసిజం వచ్చింది. ఇది యావత్ సమాజాన్నే భౌతిక, భావజాల యుద్ధాల మధ్యలోకి తీసికెళ్లింది. విరసం నక్సల్బరీ శిశువుగా ఈ పరిణామాలను మొదటి నుంచి అర్థం చేసుకొని విశ్లేషిస్తోంది. మతాన్ని మత వర్గతత్వంగా చూడాలని, మన దేశంలో ఫాసిజాన్ని బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజంగా చూడాలని చాలా కాలం కిందే సూత్రీకరించింది. సనాతన సంప్రదాయాన్ని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని, రివిజనిజాన్ని తిరస్కరిస్తూ ముందుకు వచ్చిన నక్సల్బరీ పంథాను సామాజిక పీడనలన్నిటికీ, ఫాసిస్టు అణచివేత రూపాలన్నిటికీ వ్యతిరేకంగా సాహిత్య సాంస్కృతిక మేధో రంగాల్లోకి తీర్చిదిద్దుతోంది.

ఈ క్రమంలో శ్రామిక ప్రజల సాయుధ పోరాటానికి సృజనాత్మక వ్యక్తీకరణ అయింది. అట్టడుగు కులాల, శ్రామికుల నిర్దిష్ట జీవితాన్ని సాహిత్య ఇతివృత్తం చేసింది. ప్రజల పలుకుబళ్లను, మాండలికాలను సమున్నతంగా ఎత్తిపట్టింది. జానపద, మౌఖిక కళారూపాలకు, దేశీయ సంప్రదాయాలకు ఎనలేని ప్రాధాన్యతను తీసుకొచ్చింది. సాహిత్య విమర్శను తత్వశాస్త్రం, చారిత్రక భౌతికవాదం, రాజకీయార్థిక శాస్త్రం, చరిత్ర తదితర సామాజిక శాస్త్రాల పునాది మీద శక్తివంతం చేసింది. విప్లవానికి ఉండే బహుముఖీన కళాత్మకతనంతా తన రచన, ఆలోచన, ఆచరణల ద్వారా ప్రపంచానికి చాటి చెప్తున్నది.

తన లక్ష్య ప్రకటనకు, దృక్పథానికి కట్టుబడి ఐదు దశాబ్దాల తెలుగు సమాజ చరిత్రలో విరసం భాగమైంది. విప్లవ సాహిత్య సంస్థగా ఇదొక అరుదైన సందర్భం. అన్ని రకాల ప్రజా పోరాటాలను, ధిక్కారాలను తనలో సంలీనం చేసుకొని సమకాలీన ప్రజా ఆకాంక్షలకు సృజనాత్మక వేదికగా నిలబడింది. నూతన ఆలోచనలకు అవసరమైన ప్రజాస్వామిక భూమికను ఏర్పరిచింది. దీని వల్ల తెలుగు సాహిత్యంలో అనేక ధిక్కార స్వరాలు వెల్లువెత్తడానికి విరసం కూడా కారణమైంది. తరతరాల సాంఘిక విముక్తి ఆకాంక్షలు, ఉద్యమాలు వర్గపోరాట ప్రేరణ వల్ల బలోపేతం అయ్యాయి. వ్యవస్థ మార్పుతో పాటు పితృస్వామ్యం, అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన చైతన్యాలు తెలుగు సాహిత్య రంగాన్ని ప్రజాస్వామికీకరించాయి. ఆధిపత్య శక్తులకు, భావజాలానికి వ్యతిరేకంగా సమానత్వం ఒక ప్రధాన విలువగా స్థిరపడింది. వర్గపోరాటం కళా సాహిత్యాలతో పాటు ఉపరితల జీవన రంగాలన్నిటినీ కుదిపివేస్తుందనడానికి తానే ఒక సజీవ చారిత్రక సాక్ష్యం.

ఈ విజయాలన్నీ విప్లవ సాహిత్య సాంస్కృతికోద్యమం ఒక్కటే సాధించలేదు. ధిక్కారం, రాజ్య వ్యతిరేకత గీటురాయిగా గల సోదర సాహిత్య కళా సంస్థలు, అద్భుతమైన సృజనకారుల అండదండలతోనే ఇవన్నీ చేయగలిగింది. ఉమ్మడి కృషి వల్లనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయి. అన్ని సంక్షోభాల్లో అండగా నిలిచే మూడు తరాల మిత్రులు విరసానికి అసంఖ్యాకంగా ఉన్నారు. స్నేహపూర్వక విమర్శలతో కొత్త వెలుగును అందించిన సన్నిహితులు ఎందరో ఉన్నారు. తమ రక్తతర్పణతో వర్గ పోరాటాలను పదునెక్కిస్తున్న ప్రజలు అందించే ఉత్తేజం లేకుండా, దిశా నిర్దేశం లేకుండా విరసం ఏ పనీ చేయగలిగేది కాదు. ఆ ప్రజలతో నడుస్తూ కలిసి రచించడమే విరసం బలం. యాభై ఏళ్ల పోరాటంలోని సంక్షోభాలను, సవాళ్లను, చీకటి వెలుగులను, విజయ దరహాసాలను, కన్నీటి చారికలను, చీకటి జైలు అనుభవాలను విరసం ఈ యాభై ఏళ్ల సందర్భంలో తరచి చూసుకుంటోంది. సమీక్షించుకుంటోంది. మార్క్సిజంలోని విమర్శనాత్మకతే విరసం చైతన్యం. చరిత్ర పట్ల అంతులేని తార్కిక విశ్వాసంతో పాటు వినయం, వినడం, నేర్చుకోవడం, తనలోకి తాను తొంగి చూసుకోవడం, పునః సంఘటితం కావడం విరసం జీవధాతువు. దీని వల్లే చారిత్రక శక్తుల సంఘర్షణలోంచి పుట్టిన విరసం తానే సాహిత్య రంగంలో చరిత్ర కాగలిగింది. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా వర్గపోరాట శక్తులు, పీడిత అస్తిత్వ పోరాట శక్తుల ఐక్యత దిశగా ఈ సభలు నిర్వహిస్తున్నాం. అందరూ రండి. విజయవంతం చేయండి.

* విప్లవ రచయితల సంఘం

'బేటీ పడావో'కి ఆద్యురాలు ఫాతిమా బేగం

భారతదేశంలో ముస్లింలకు ఆధునిక విద్య ను అందించిన ఆద్యుడిగా సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ (1817 –1898) పేరు పొందారు. ముస్లింలు ప్రగతి సాధించడానికి, ప్రభుత్వ ఉద్యోగాలలో పెద్ద వాటా పొందడానికి ఆధునిక విద్య మాత్రమే ఇది సాధ్యమవుతుందని ఆయన భావించారు.1864లో సర్ సయ్యద్ ఒక విజ్ఞాన శాస్త్ర సంఘాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా, 1875 లో అలీగడ్‌లో మహమ్మదన్ ఆంగ్లో ఓరియంటల్ కళాశాలని స్థాపించారు.

అయితే రచయిత్రి సయ్యద్ నస్రీన్ పరిశోధనల ప్రకారం అహ్మద్ ఖాన్ కంటే ముందే షేక్ ఫాతిమా బేగం దేశంలో ముస్లింలకు ఆధునిక విద్య అందించడానికి పునాదులు వేశారు. ఫాతిమా ప్రముఖ సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలేతో కలిసి పని చేశారు. పూలే దంపతులు 1848లో పుణెలో వివక్షకు గురైన బాలికల కోసం ఒక పాఠశాలను స్థాపించారు. రెండు వందల సంవత్సరాల క్రితం మన దేశ పరిస్థితులు భిన్నం గా ఉండేవి. చాలా మంది పిల్లలకు ఐదు, ఆరు సంవత్సరాలకే పెళ్లిళ్లు జరిగిపోయేవి. కొన్ని ప్రాంతాలలో ఉన్నత కుల కుటుంబాలలో సతీ సహగమనం వంటి దురాచారాలుండగా, నిమ్న కులాల వారు అంటరానితనానికి గురయ్యేవారు.

పూలే దంపతులు ఆనాటి పరిస్థితులను ఎదురొడ్డి తమ సేవా కార్యక్రమాలను కొనసాగించారు. వారు మత పెద్దల ఆగ్రహానికి గురై సంఘ బహిష్కరణకి గురికాబడ్డారు. వారికి పూలే మిత్రుడు షేక్ ఉస్మాన్ ఆశ్రయం కల్పించాడు. అక్కడ ఉస్మాన్ సోదరి ఫాతిమాతో సావిత్రికి పరిచయం ఏర్పడింది. వారిద్దరూ ఉస్మాన్ గృహంలోనే బాలికల కోసం మరో పాఠశాలను ప్రారంభించారు. షేక్ ఉస్మాన్ ప్రోత్సాహంతో ఫాతిమా ఉన్నత విద్యను అభ్యసించింది. అప్పట్లో సామాన్యులకు పాఠశాలలు ఉండేవి కావు.


క్రైస్తవ మిషనరీ పాఠశాలల్లోనే ఫాతిమా చదువుకున్నారు. భర్త ప్రోత్సాహంతో సావిత్రి, అన్న సహకారంతో ఫాతిమా చదువుకొని మన దేశంలో తొలి తరం మహిళా ఉపాధ్యాయులు పేరు పొందా రు. ఫాతిమా భావాలు చాలా విశాలమైనది. సయ్యద్ నస్రీన్ ఫాతిమా పై పుస్తకాన్ని రాశారు. సావిత్రిబాయి పలు రచనలు చేసినందువల్ల ఆమె గురించి వివరాలు సేకరించేందుకు చరిత్రకారులు వీలు పడింది. 'ఫాతిమా నాకు బాగా సహకరించారు. ఆమె సహకారంతో నేను సేవా కార్యక్రమాలను కొనసాగించగలిగాను' అంటూ సావిత్రి తన భర్తకు రాసిన లేఖలలో పేర్కొంది.

ఫాతిమా సేవా కార్యక్రమాలపై పెట్టినంతగా సాహిత్యంపై దృష్టి పెట్టలేదు. ఆ రోజుల్లో సనాతన ముస్లింలు స్త్రీ విద్యని నిరసించినప్పటికీ ఆమె పట్టుదల అంతా ముస్లిం బాలికలని చదువుకోమని ప్రోత్సహించింది. 1825– 27 మధ్య కాలంలో జనవరి 9 న ఫాతిమా జన్మించినట్లు చాలా మంది చరిత్రకారులు భావిస్తున్నారు. ముస్లిం సాహితీ వేత్తలు కూడా ఆమెపై పరిశోధనలు చేయకపోవడం వల్ల ఆమె గురించి మనకు తక్కువగా వివరాలు లభ్యమవుతున్నాయి. నస్రీన్ ప్రకారం ఫాతిమా ఉర్దూలో పద్యాలు రాశారు. కులం లేని సమాజం కోసం ఆమె పరితపించారు. సుగుణబాయి, సావిత్రి బాయి, ఫాతిమా బేగంలు కలిసి బాలికా విద్యపై ఎనలేని కృషి చేశారు. బహుజనుల, ముస్లింల ఐక్యతా ఉద్యమాలకై వారు బీజం వేశారు. 1856 తర్వాత ఫాతిమా ఎక్కడ నివసించారనే విషయంపై వివరాలు దొరకడం లేదు. మహారాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ పాఠ్యపుస్తకాలలో ఆమె గురించి ప్రచురించారు. ఫాతిమా బేగం స్ఫూర్తితో పాట్నా, కలకత్తాలలో ముస్లిం బాలికలకు బేగం రోకియా సఖావత్ హుస్సేన్ పాఠశాలను ప్రారంభించారు. ఈ సంఘ సంస్కర్తల కృషి ఫలితంగా బాలికల కోసం పాఠశాలలు, కళాశాలలు దేశ వ్యాప్తంగా స్థాపించబడ్డాయి. చరిత్రకారులు దృష్టి పెట్టి ఫాతిమా సమాజానికి చేసిన సేవలు మరింత వెలుగులోకి తీసుకోరావాల్సి ఉంది. ఆలస్యంగానైనా భారత దేశంలో తొలి ముస్లిం మహిళ ఉపాధ్యాయినిగా ఆమె గుర్తించడం హర్షణీయం పరిణామం.

* ఎంఆర్ ప్రదీప్
9492712836

ప్రణాళికలతో పనులు సులభం

ఉద్యోగినులకు పని ఒత్తిడి ఎక్కువ. ఇంటాబయటా బాధ్యతలు ఉండటం వల్ల అవి ఒక్కోసారి వారి ఫోకస్‌ను దెబ్బతీస్తాయి. ఎప్పుడు ఏపని చేయాలో స్పష్టత ఉంటే ఏమాత్రం ఇబ్బంది కలగదని చెబుతున్నారు నిపుణులు. ప్రణాళిక ప్రకారం పనులు చేసుకుంటే ఒత్తిడి అనేదే ఉండదని సూచిస్తున్నారు.



ఏ సమయంలో ఏ పనులు చెయ్యడానికి ఎక్కువ ఏకాగ్రత ఉంటుందో ఆ మేరకు పనుల్ని ప్లాన్ చేసుకోవాలి. ఉదాహరణకు కొందరు ఉదయం వేళ బాగా ఫోకస్ చెయ్యగలిగితే, ఇంకొందరు అర్ధరాత్రులలో చెయ్యగలుగుతారు.

* ఉత్తమంగా ఎప్పుడు పనిచెయ్యగలమన్న విషయంలో వ్యక్తిగత విశ్లేషణ ఉండాలి. తొంభైశాతం మంది ఆఫీస్ వెలుపల బాగా ఆలోచించ గలుగుతారని పరిశోధనలు పేర్కొన్నాయి. కాబట్టి, ఏ సమయంలో చురుగ్గా ఉంటామనుకుంటే ఆ సమయంలో క్లిష్టమైన పనుల్ని ప్లాన్ చేసుకోవాలి.
* దీనివల్ల సమయాన్ని అత్యుత్తమంగా సద్వినియోగ పరుచుకోగలుగుతారు. తక్కువ శక్తి ఉన్నప్పుడు సులువుగా చెయ్యగల పనులు పూర్తి చేసుకోవాలి. దీనివల్ల పనుల హైరానా తగ్గుతుంది. చేసే పనుల వల్ల ఫోకస్ పెరుగుతుంది.
* చాలా మంది ప్రొఫెషనల్స్ చేసే తప్పు ఏంటంటే మీటింగులపైన ఎక్కువగా ఆధారపడుతూ, కలిసి పని చేస్తున్న వారితో వ్యక్తిగత ఇంటరాక్షన్ పెట్టుకోకపోవడం. చాలామంది 35 నుంచి 55 శాతం సమయాన్ని సమావేశాల్లో గడుపుతారన్నది సర్వేల సారాంశం.
* ఉదయాన్నే ఈ పనులు చేయొద్దు. చాలామంది ఉదయం లేచీ లేవగానే ఫోన్ చేతిలోకి తీసుకుని మెసేజ్‌లు, మెయిల్స్ చెక్ చేసుకుంటారు. ఫోన్ చెక్ చేసుకోవడం వల్ల ఒత్తిడితో కూడిన ప్రతిస్పందన నిరంతరం బుర్రలో వెంటాడుతూ ఉంటుంది. దీనివల్ల జ్ఞాపకశక్తి సామర్థ్యాలు, ఎటెన్షన్ స్థాయిలు తగ్గుతాయి.
* ఉదయం ప్రశాంతంగా నిద్ర లేచి, రోజును చక్కని స్ఫూర్తితో ఆరంభించాలి. నచ్చిన పనితో ఆరంభిస్తే మరింత చురుగ్గా, ఉత్సాహంగా ఉంటుంది. వ్యాయామం కూడా చెయ్యొచ్చు.
* ధ్యానం, యోగా ఏదైనా చెయ్యవచ్చు. అయితే ఈ పనుల ద్వారా మనసుకు, నాడీ వ్యవస్థకు కాన్షస్‌గా శిక్షణ ఇచ్చుకోవాలి. ఆందోళన, ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఉండే వ్యక్తులు ఎమోషనల్‌గా బాగా తెలివితేటలతో వుంటారు. మంచి నిర్ణయాలు తీసుకోగలుగుతారు.
* పని సమయంలో చురుగ్గా ఉండడమే ఉత్పాదక శక్తిని పెంచడంలో కీలకంగా ఉంటుంది. పని చేస్తున్నప్పుడు ఎటువంటి ఆటంకాలూ వుండకూడదు. కాబట్టి పని సమయాన్ని అరగంట, గంట, గంటన్నర అన్నట్లు విభజించుకుని ఆ ప్రకారం పని లక్ష్యాలు పూర్తి చేస్తూ బ్రేక్ తీసుకుని రీఛార్జ్ అవుతుండాలి. అప్పుడే పనిపట్ల మరింత ఫోకస్ పెరుగుతుంది.
* కొద్ది నిమిషాలు సంగీతం వినడం, స్ట్రెచింగ్ వంటి చిన్న చిన్న వ్యాయామాలు చెయ్యడం ద్వారా ఫోకస్‌ను రీఛార్జ్ చేసుకోవాలి. రీఛార్జ్ అయి, తదుపరి పని సైకిల్ ఆరంభించాలి.
* పనిలో కలిగే ఆటంకాలవల్ల జాప్యం అవుతున్నదన్న ఒత్తిడికి కారణమవుతాయి. పని షెడ్యూల్‌ను తప్పకుండా అనుసరించడం వల్ల ఫోకస్ పెరుగుతుంది. అనుకున్న పని పూర్తి చేసిన ప్రతిసారీ బ్రేక్ తీసుకోవాలి. ఇటువంటి దృష్టి మళ్లింపు కాకుండా, ప్రతి షెడ్యూల్‌నూ ముగించాక తీసుకునే బ్రేక్ మంచిదే అవుతుంది. వర్కవుట్లు, ఫ్రెండ్స్‌కు ఫోన్ చేయడం, మెసేజ్‌లు వంటివి పనుల నడుమ చేయవచ్చు.

అలాగని అదేపనిగా ఇవే చేస్తుంటే పనిపట్ల బాధ్యతలేకుండా పోతుంది. అందుకనే బ్యాలెన్స్ చేసుకుంటూ ఉండటం ఎంతో అవసరం. ఇవన్నీ కొత్త సంవత్సరంలో తీసుకునే తీర్మానాలుగా ఎంచుకోవచ్చు.



బిర్యానీఆకు సువాసనతో ఒత్తిడి మాయం

ప్రతి ఒక్కరు ఏదో ఒక ఒత్తిడితో బాధపడుతూనే ఉంటారు. అలాంటి సమయాల్లో ఒత్తిడి నుండి ఎలా బయట పడాలో అర్థం కాదు. ఒత్తిడి తొలగి మనసు తేలికగా ఉండాలంటే సువాసనతో నిండిన పరిసరాల్లో గడపాలని అంటారు. ఇందుకోసం సుగంధ ద్రవ్యమైన బిరియానీ ఆకునూ ఉపయోగించవచ్చు.

బిరియానీ ఆకులో ఒత్తిడిని తొలగించే గుణాలు ఉంటాయి. తులసి ఆకుల్లో ఉండే 'లినలూల్' ఒత్తిడికి కారణమయ్యే హార్మోన్లను నెమ్మదించేలా చేస్తుంది. ఆరోమాథెరపీలో భాగంగా ఈ కాంపౌండ్‌ను వాడుతూ ఉంటారు. ఒత్తిడిగా అనిపిస్తే బిరియానీ ఆకును కాల్చి, వాసన పీల్చాలి. ఇందుకోసం పచ్చి ఆకుల బదులుగా బాగా ఎండిన ఆకులను ఎంచుకోవాలి. గది తలుపులు మూసి, ఓ గిన్నెలో బిరియానీ ఆకును తుంచి వేసి, మండించాలి. ఆకులు కాలడంతో పల్చని పొగతో పాటు, సువాసన గది మొత్తం అలముకుంటుంది. ఈ వాసనను పీల్చడం వల్ల మనసు నెమ్మదించి, ఒత్తిడి తొలగిపోతుంది. ఇంట్లో ఎప్పుడూ ఈ ఆకులు ఉండేలా చూసుకోవాలి.

మితంగా తీసుకోవడం మంచిది



చాలామందికి అరటిపళ్లు తినే అలవాటు ఉంటుంది. అది మంచి అలవాటు. అయితే మన దగ్గర ఏడెనిమిది రకాల అరటిపండ్లు దొరుకుతాయి. ఏ రకం ఎక్కువ తింటే ప్రమాదమా అనే అపోహలు చాలా మందికి ఉంటాయి.

నీటి శాతం తక్కువగా ఉండే పండ్లలో కెలోరీలు, పిండి పదార్థాలు ఎక్కువ. వంద గ్రాముల అరటిపండులో... రకాన్ని బట్టి ఎనభై నుండి నూట ఇరవై కెలోరీల శక్తి లభిస్తుంది. వీటిలో పిండి పదార్థాలు ఎక్కువ. అందుకే తిన్న వెంటనే శక్తి వస్తుంది. ఈ పిండి పదార్థాలు చక్కెర రూపంలోనూ, పీచు రూపంలోనూ ఉంటాయి. కొవ్వు పదార్థాలు చాలా తక్కువ. పిండి పదార్థాలు ఎక్కువగా ఉన్నా అరటిపళ్ల గ్లైసీమిక్ ఇండెక్స్ 45–58 మధ్య మాత్రమే ఉండడం వల్ల రక్తంలోని గ్లూకోజు పరిమాణాన్ని పెంచవు. మధుమేహం ఉన్న వారు మాత్రం భోజనం చేసిన వెంటనే అరటిపండు తీసుకోకపోవడం మంచిది. ఈ పండ్లలోని పీచుపదార్థం పెద్ద పేగుల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. అరటిపళ్లలోని పొటాషియం గుండె ఆరోగ్యానికి అవశ్యకమైన ఖనిజం. విటమిన్ బి 6, విటమిన్ సి అరటిపళ్లలో అధికం. డోపమిన్, కాటచిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు వీటిలో ఉంటాయి. పండించిన నేలను బట్టి పోషక విలువలు ఆధారపడతాయి. కాబట్టి ఓ రకం పండు వేరే రకం కంటే మంచిదని చెప్పలేం. ఏ రకమైన మరేదైనా మితంగా తీసుకుంటే పర్వాలేదు.

కీరదోసతో ముఖానికి తాజాదనం

ఈ నెలంతా పార్టీలు, పండుగలూ వేడుకల్లో హడావిడిగా ఉంటారు అమ్మాయిలు. పార్లర్‌కి వెళ్లే అవసరం లేకుండా ఇంట్లోనే సహజసిద్ధంగా దొరికే వస్తువులతో ముఖాన్ని చక్కగా అందంగా తీర్చిదిద్దుకోవచ్చని చెబుతున్నారు సౌందర్య నిపుణులు.

* కీరదోసని మెత్తగా పేస్టులా చేయాలి. దానికి కొంచెం రోజ్‌వాటర్ కలిపి పావుగంట సేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. రోజులో రెండు సార్లు ముఖానికి రాసుకుంటే మంచి టోనర్‌లా ఉపయోగపడుతుంది.
* ఇది అన్ని చర్మతత్వం ఉన్న వాళ్లకి బాగా పనిచేస్తుంది. ఇక జిడ్డుతత్వం ఉన్నవాళ్లు కీరదోసని పేస్టులా చేసి అందులో కొంచెం పెరుగూ, తేనె, కొన్ని చుక్కల రోజ్‌వాటర్ కలిపి ఫ్రిజ్‌లో పది నిమిషాలు ఉంచాలి. తరువాత ముఖానికి రాసుకుని పావుగంటయ్యాక కడిగేసుకుంటే జిడ్డు పట్టడం తగ్గి, తాజాగా అనిపిస్తుంది.
* ముఖానికి మంచి మెరుపు కావాలనుకుంటే మెంతుల్ని నీళ్లలో అరగంట సేపు నానబెట్టాలి. వాటిని మెత్తని మిశ్రమంలా చేసుకుని రోజూ స్నానానికి వెళ్లే ముందు ముఖానికీ, చేతులకీ రాసుకోవాలి. కాసేపాగి, స్నానం చేశాక చూస్తే మార్పు మీకే తెలుస్తుంది. పెద్ద పెద్ద పార్లర్‌లకు వెళ్లకుండా ఇలా చేయడం మంచిది.



ఇక చెదరకుండా ఉంటాయి!

ఉతికిన బట్టల్ని బీరువాలో జాగ్రత్తగా సర్దుకుంటాం. అవసరమైనప్పుడు తీసుకుని ఆ తర్వాత వాటిని అలాగే వదిలేస్తుంటాం. అవి చిందరవందరగా అవుతుంటాయి. వాటిని తిరిగి మడతపెట్టుకోవాలంటే అదో పెద్ద పని.

చక్కగా మడతపెట్టి వార్డురోబ్‌లో భద్రపరిచిన టాపులని బయటకు తీయడానికి ఎంత కష్టపడాలో! పైనున్న వాటి సంగతి సరే కానీ అడుగున ఉన్న టాప్స్‌ని లాగామంటే పైన ఉన్న వాటి మడత చెదిరిపోతుంది. ఈ సమస్య నుంచి బయటపడటానికే కొత్తగా లాండ్రీ ఫోల్డర్ అనే సాధనం అందుబాటులోకి వచ్చింది. ప్లాస్టిక్ అట్టల మాదిరిగా ఉండే వీటితో దుస్తుల మడతలు చెదిరిపోకుండా ఉంటాయి. ఒక సెట్‌లో పది టాంప్లేట్లు ఉంటాయి. వీటిపై దుస్తులని అమర్చుకోవాలి. మడతలు చెదిరిపోకుండా బయటకు లాగొచ్చు. వీటిని సూట్‌కేసుల్లోనూ వీటిని ఉపయోగించొచ్చు.



రంగవల్లిక



16 చుక్కలు
6 వరుసలు
6 వచ్చేవరకు



ఎం. మణెమ్మ
బర్కత్‌పుర, హైదరాబాద్



15 చుక్కలు
మధ్య చుక్క
8 వచ్చే వరకు



వంగాల యశోద,
మెహదీపట్నం

పార్టీలకు సింపుల్ మేకప్

ఈ నెలంతా పార్టీలు, వేడుకలు చేసుకుంటారు. పార్టీలకు సింపుల్‌గా ఎలా తయారవ్వాలో చూద్దాం..



ఫౌండేషన్ : ముందుగా ముఖాన్ని శుభ్రం చేసుకొని తడిలేకుండా పొడిబట్టతో తుడుచుకోవాలి. ఆ తర్వాత ఫౌండేషన్ క్రీమ్‌ను చేతివేళ్లతో తీసుకొని ముఖానికి రాసుకోవాలి. ముందుగా క్రీమ్‌ను అక్కడక్కడా చుక్కలుగా అప్లై చేసుకోవాలి. వాటిని అనుసరిస్తూ ముఖం అంతా రాసుకోవాలి. పొడిపొడిగా లేకుండా చేసుకోవాలి. ఫౌండేషన్ పౌడర్ రాసుకోవాలి.

ఐలైనర్ : కళ్లకు కింది భాగంలో కాజల్ పెట్టుకొని పైభాగంలో ఐలైనర్ వాడాలి. పక్కకు పోనివ్వకుండా పర్‌ఫెక్ట్‌గా వేయాలి. తర్వాత కనురెప్పలకు మస్కారా వాడాలి. కనురెప్పలకు సరిపోయే కలర్ మస్కారా అప్లై చేయాలి. తర్వాత కనురెప్ప పైన పింక్ కలర్‌ను రాసుకోవాలి. ఆ కలర్‌నే చెంపలపై రాసుకోవాలి. తర్వాత పెన్సిల్‌తో ఐబ్రోస్ చేసుకోవాలి.

లిప్‌స్టిక్ : రెడ్, పింక్, ఆరెంజ్, మెరూన్ ఇలా ఏ రంగులైనా పెదవులకు నప్పుతాయి. ఎవరికి ఏవీ నప్పుతాయో ముందుగా టెస్ట్ చేసుకోవాలి.





లేదంటే మ్యాచ్ అవ్వదు. తెల్లగా ఉండేవారికి ఏ రంగైనా నప్పుతుంది. చామనచాయగా ఉండేవారు ముదురురంగు లిప్‌స్టిక్ వేసుకుంటే బాగుంటుంది.

నగలు : పార్టీకి తగినట్లుగా దుస్తులు ధరిస్తాం. ఈ రెండింటినీ దృష్టిలో పెట్టుకొని నగలు ధరించాలి. చేతికి సన్నని గాజు, వాచీ, చెవులకు కమ్మలు, మెడలో సన్నని నెక్లెస్ పెట్టుకుంటే సరిపోతుంది. వీటన్నింటితోపాటు చక్కని పెదాలపై చక్కని చిరునవ్వు ఉండటం మరవొద్దు.



ఎస్‌టియు డైరీని ఆవిష్కరించిన గవర్నర్

మనతెలంగాణ/హైదరాబాద్ : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిది ద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. బుధవారం రాజ్‌భవన్‌లో ఎస్‌టియుటిఎస్ రూపొందిం చిన నూతన సంవత్సర డైరీని గవర్నర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధిం చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.సదానందం గౌడ్, ఎం.పర్వతరెడ్డి, డైరీ కన్వీనర్ ఎ.వి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎఎండి డైరెక్టర్‌గా డికె సిన్హా



మన తెలంగాణ/హైదరాబాద్ : డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీలోని అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రిసర్చ్(ఎ ఎండి) డైరెక్టర్‌గా డాక్టర్ డి.కె. సిన్హా నియమితు లయ్యారు. ఈ పదవిని చేపట్టడానికి ముందు ఆయన ఇదే డైరెక్టరేట్‌లో అదనపు డైరెక్టర్‌గా పని చేశారు. మధ్యప్రదేశ్, సాగర్ లోని డాక్టర్ హరి సింగ్ గౌర్ విశ్వవిద్యాలయం నుండి ఆయన అనువర్తిత భూగర్భ శాస్త్రం (అప్లైడ్ జియాలజీ)లో ఎం.టెక్ పొందిన తరువాత 1984లో ఎఎండిలో చేరారు. నాగ్‌పూర్ విశ్వవిద్యాలయం నుండి 1993లో భూగర్భ శాస్త్రంలో పిహెచ్‌డి డిగ్రీ పూర్తి చేశారు. భారతదేశంలోని తూర్పు, పశ్చిమ మరియు మధ్య భాగాల యొక్క భిన్నమైన భౌగోళిక డొమైన్‌లలో 35 ఏళ్లుగా విస్తరించి ఉన్న అణు ఖనిజాల అన్వేషణలో సిన్హాకు విశేష అను భవజ్ఞానం ఉంది. ఆయన అన్వేషణ కారణంగా మధ్య ప్రదేశ్, మహా రాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్,ఝార్ఖండ్ రాష్ట్రాలలో పెద్ద ఎత్తున అణు ఖని జాల నిక్షేపాలను పెంపింది. అన్వేషణ భూగర్భ శాస్త్రానికి ఆయన అంకి తమైన పరిశోధకుడు. దేశంలో యురేనియం అన్వేషణ ప్రోగ్రామ్‌లో విస్తృతంగా ఉపయోగించబడుతున్న అనేక కొత్త అంశాలను ఆయన ప్రమోదించారు. యూనివర్సిటీ మరియు పరిశోధన సంస్థలతో సహకారం చేదానికి ఆతని భౌగోళిక వరురకు విభిద విద్యావేత్తలు అనేక సింపోజి యంలలో, సెమినార్లు, శిక్షణ మరియు సహకార ప్రాజెక్టుల వంటి అనేక కార్యక్రమాలలో ప్రదర్శించారు. జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో అనేక పరిశోధనా కథనాలను డాక్టర్ సిన్హా ప్రచురించారు. అందుబాటు ఆయనకు 100కి పైగా అనులేఖనాలు ఉన్నాయి. వివిధ జాతీయ, అంత ర్జాతీయ సంఘాలలో జీవిత కాల సభ్యుడు. భౌగోళిక అన్వేషణలో అను భవం సంపాదించడానికి ఆయన దేశం మొత్తం విస్తృతంగా తిరిగాడు.

2వ పల్లె ప్రగతి నేటి నుంచే

మొదటిపేజీ తరువాయి

రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రారంభి స్తారు. కాగా రెండవ విడతలో పారిశుద్య కార్యక్రమానికి అధిక ప్రాధాన్య తను ఇచ్చే విధంగా ప్రణాళికలను రూపొందించారు. మొదటి విడత కార్యక్రమం గత సెప్టెంబర్ 6వ తేదీ నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు నిర్వహించిన విషయం తెలిసిందే. మొదటి విడతలో అనేక గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు కావల్సిన ప్రాథమిక సౌకర్యాలు పెద్దఎత్తున జరిగాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం మూడు మార్లు పల్లెప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే రెండవ విడతను నేటి నుంచి ఈ నెల 12వ తేదీ వరకు తలపెట్టింది. కాగా ఈ కార్యక్రమం పనితీరును ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 50 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసింది. ఈ స్క్వాడ్‌లో ప్రతిగ్రామంలో జరుగుతున్న పల్లెప్రగ తిని ఎప్పటికప్పుడు తెలుసుకుని సిఎం కెసిఆర్‌కు నివేదికను అందజే స్తుంది. ఇక పల్లె ప్రగతిలో అన్ని గ్రామపంచాయతీల్లో వైకుంఠధా మాలు, డంపింగ్ యార్డుల నిర్మాణం, ప్రజాప్రతినిధులు, అధికారుల్లో జవాబుదారీతనం పెంచేలా కార్యాచరణ ప్రణాళికను అమలు చేయ నుంది. తొలి రోజు గ్రామ సభ నిర్వహించి.. మొదటి విడతలో చేపట్టిన పనులు, చేసిన చెల్లింపు వివరాలను ప్రజల ముందుంచనుంది. కాలిపో యిన ఇండ్లు, పాడుబడిన పశువుల కొట్టాలు, పిచ్చిచెట్లను తొలగించాలని పంచాయతీ శాఖ ఇప్పటికే సంబంధిత అధికారులను నిర్దేశించింది. పాఠశాలలు, సంతలు, రోడ్లను క్లీన్‌గా ఉంచేందుకు చర్యలు తీసుకోవా లని, ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి ఉండేలా ప్రజలను చైతన్యపరచాలని సూచించింది. పచ్చదనం పెంపొందించేందుకు గ్రామ పంచాయతీ అధ్య ర్యంలో శాశ్వత నర్సరీని ఏర్పాటు చేయాలని, అటవీశాఖ అధికారుల నుంచి సాంకేతిక సహకారం తీసుకోవాలని ఆదేశించింది. గ్రామ బడ్జె ట్‌లో పదిశాతం విధిగా పచ్చదనం పెంపొందించేందుకు కేటాయించాలని స్పష్టం చేసింది. పల్లెప్రగతిలో భాగంగా పవర్‌వీక్‌ను నిర్వహించాలని కూడా ఆదే శించింది. మిగిలిపోయిన విద్యుత్ పనులు పూర్తి చేయాలని, వేలాడు తున్న, వదులుగా ఉన్న కరెంటు తీగలు, స్తంభాలను సవరించాలని సూచించింది. గ్రామాల్లో తప్పనిసరిగా ఎల్‌ఇడి బల్బులను వినియోగిం చేలా చూడాలని పేర్కొంది. వార్షిక ప్రణాళిక తప్పనిసరి 2021 వార్షిక ప్రణాళిక రూపొందించి,దానికి అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు చేపట్టాలని నిర్దేశించింది. అప్పులు, వేతనాలు, కరెంటుబిల్లుల చెల్లింపు లను మదింపు చేయాలని, ఆస్తిపన్ను వసూలు, పన్ను పరిధిలోకి రాని ఇళ్లను గుర్తించడం, మొక్కలు నాటడం, స్మశానవాటికలు, డంపింగ్‌యా ర్డుల ఏర్పాటుకు ఉపాధి హామీ నిధులను వినియోగించాలని స్పష్టం చేసింది. నిధుల సమీకరణకు ప్రభుత్వ కేటాయింపులేకాకుండా.. సిఎస్ ఆర్ నిధి, దాతల నుంచి విరాళాలు సేకరించాలని సూచించింది.

ప్రతి పల్లెకు ప్రత్యేకాధికారి

పల్లె ప్రగతి కార్యక్రమం అమలుకు ప్రతి పంచాయతీకి మండల స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించారు. మండల స్థాయిలో మండల పంచాయతీ అధికారి పర్యవేక్షకుడిగా వ్యవహరించనున్నారు. వీరికి అదనంగా జిల్లా స్థాయిలోనూ ప్రత్యేక బృందాలు పనిచేస్తాయి.

నుమాయిష్ షురూ

మొదటిపేజీ తరువాయి

30 వేల మందికి విద్యనందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఎగ్జి బిషన్ ద్వారా వస్తున్న ఆదాయాన్ని వంద శాతం విద్యా సంస్థలకే ఖర్చు చేయడం అభినందనీయమన్నారు. నాడు నిజాం ఏలుబడిలో ప్రారంభిం చిన నుమాయిష్, ఇలా సుదీర్ఘకాలంగా కొనసాగించడం , దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి వ్యాపారులు తమ ఉత్పత్తుల విక్రయించడానికి దీన్ని వేదికగా ఎంచుకోవడం అభినందనీయమన్నారు. రాష్ట్ర పశుసంవ ర్ధక శాఖమంత్రి టి. శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ నుమాయిష్‌ను గత 80 ఏళ్లుగా విజయవంతంగా నిర్వహించడం సొసైటీ సభ్యుల అంకిత భావానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎగ్జిబిషన్‌కు అన్ని విధాలా పూర్తి సహకారాన్ని అందిస్తుందని, ఈ విధిగా సిఎం కెసిఆర్‌తో మాట్లాడుతామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ఆరోగ్యశాఖమంత్రి ఈటెల రాజేందర్ మాట్లాడుతూ హైదరాబాద్ నుమాయిష్‌కు గొప్ప చరిత్ర ఉందని, ప్రజల భద్రత, అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రాబడి కంటే ప్రజల భద్రతకే ఎక్కు వగా ప్రాధాన్యం ఇస్తున్నామని ఈటెల పేర్కొన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ ప్రభాశంకర్ నివేదిక ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఆర్థిక సంస్థ ఛైర్మన్ అక్బర్ హుస్సేన్, మాజీ ఎంఎల్‌సి పి.సుధాకర్ రెడ్డి, రాజేశం గౌడ్, ఎంఎల్‌సి లక్ష్మణ్ దాస్, ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు శ్రీనివాస్ రావు, మర్రం అశ్విన్, వినయ్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కెటిఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ

టిఆర్ఎస్ కార్యాలయంలో కొత్త సంవత్సరం సందడి



కెటిఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మాగంటి గోపీనాథ్, పల్లా రాజేశ్వరరెడ్డి, కొప్పుల ఈశ్వర్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బాల్క సుమన్ తదితరులు

మనతెలంగాణ/హైదరాబాద్: టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నూతన సంవత్సరం సందర్భంగా నాయకుల సందడి ఏర్పడింది. టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కల్వకుంట్ల తారకరామారావును పార్టీకార్యాల యంలో కలిసేందుకు టిఆర్ఎస్ నేతలు, అభిమానులు బారులు తీరారు. అలాగే పార్టీ అభిమానులు కెటిఆర్‌కు పుష్పగుచ్చాలిచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలి పారు. పార్టీ కార్యాలయానికి వచ్చిన వారందరిని కెటి ఆర్ కలిశారు. ఇందులో ప్రధానంగా టిఆర్ఎస్ శాసన సభ్యులు, పార్లమెంట్‌సభ్యులు, శాసనమండలి సభ్యులు, మంత్రులు, నాయకులు అనేకమంది ఉన్నారు. కెటిఆ ర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన వారిలో శాసన మండలి సభ్యులు నవీన్ రావు, వెంకటే శ్వర రావు, నారదాసు లక్ష్మణరావు, పోచంపల్లి శ్రీని వాస్ రెడ్డి, ప్రభాకర్ తదితరులు ఉన్నారు. అలాగే శాసన సభ్యులు మాగంటి గోపీనాథ్, బాల్కసుమన్, కాలేరు వెంకటేష్, ముఠాగోపాల్, గండ్ర వెంకట రామిరెడ్డి, సుధీ ర్‌రెడ్డి, మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, సిఎం ఒఎ స్‌డి దేశపతి శ్రీనివాస్, బెవరేజ్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవి ప్రసాద్,టిఎస్ పిసి సభ్యుడు విఠల్, టిఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు, మాజీ ఎంపి గుండు సుధారాణి, ఇంటర్‌నేషనల్ వైశ్యఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా, శాసనసభ మాజీ స్పీకర్ మధుసూధనా చారి, రైతుసమన్వయ సమితి అధ్యక్షుడు పల్లారాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపిలు బూర నర్సయ్యగౌడ్, సీతారాం నాయక్, పిజెఆర్ కూతురు విజయ రెడ్డి, మాజీ ఎంఎల్‌సి పాటూరి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేటు వ్యవసాయ కళాశాలలు

- డిమాండ్ ఉండటంతో రాష్ట్రంలో ఏర్పాటుపై ప్రభుత్వం యోచన
- మహారాష్ట్ర, పంజాబ్ రాష్ట్రాలకు భారీ సంఖ్యలో వెళ్తున్న విద్యార్థులు
- చట్టాన్ని సవరించాలంటున్న యూనివర్సిటీ ఉన్నతాధికారులు



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో ప్రైవేటు వ్యవ సాయ కళాశాల ఏర్పాటుపై ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది. దీనిపై ఇప్పటికే వ్యవసాయశాఖ, జయశంకర్ వ్యవసాయ వర్సిటీలు ఒక నివేదికను రూపకల్పన చేయా లని నిర్ణయించాయి. వ్యవసాయ, ఉద్యాన తదితర అను బంధ రంగాల కోర్సులకు భారీ డిమాండ్ ఉంది. అయితే ప్రభుత్వ వ్యవసాయ కాలేజీల్లో సీట్లు పరిమితంగా ఉండ టంతో అనేకమంది పంజాబ్, మహారాష్ట్ర సహా ఇతర ప్రాంతాలకు వెళ్లి అక్కడ ప్రైవేటులో చదువుతున్నారు. దీంతో మన రాష్ట్రంలోనే ప్రైవేటు వ్యవసాయ కళాశాలలు ఏర్పాటు చేస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమౌ తోంది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో అందుకు సంబంధించిన విధానపరమైన నిర్ణయాన్ని అక్కడి ప్రభుత్వం తీసు కుంది. ఇప్పటికే ప్రైవేట్ యూనివర్సిటీల చట్టం తెలంగా ణలో అమల్లోకి వచ్చింది. దీంతో ముఖ్యమంత్రి కెసిఆ ర్‌కు ఒక నివేదికను సమర్పించి, యూనివర్సిటీ యాక్ట్‌ను సవరించుకోవడం ద్వారా ప్రైవేటు వ్యవసాయ కళాశాల లకు అనుమతించవచ్చునని జయశంకర్ వర్సిటీ ఉన్నతా ధికారులు తెలిపారు. వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కూడా ప్రైవేటు వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్దం చేయాలని సూచించినట్లు తెలిసింది. ఇప్పటికే కొందరు ప్రై వేటు వ్యవసాయ కాలేజీల ఏర్పాటుకు ముందుకువచ్చినప్ప టికీ, ప్రైవేటు కాలేజీల ఏర్పాటుపై విధానపరమైన నిర్ణ యం తీసుకోనందున వాటిని తిరస్కరించారు.

మెడికల్ సీటు రాకపోతే.. అగ్రికల్చర్‌కు

రాష్ట్రంలో ఈ ఏడాది బైపిసి వార్షిక పరీక్షలో పాసైన వారు 62 వేల మంది ఉన్నారు. వారు కాకుండా గతంలో ఫెయిల్ అయి పరీక్ష రాసినవారు, అడ్వాన్స్ సప్లమెంటరీ రాసిన విద్యార్థులు మరో 40 వేల మంది ఉన్నారు. అంటే లక్ష మందికిపైగా బైపిసి పూర్తి చేశారు. వారిలో చాలామంది సాధారణ బిఎస్‌సి డిగ్రీకి బదులు ఎంబిబి ఎస్, బిడిఎస్ తదితర మెడికల్ కోర్సులకు ప్రాధాన్యం ఇస్తారు. కానీ ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఎంబిబిఎస్‌లో 4,670 సీట్లు, డెంటల్‌లో 1140 సీట్లు, ఆయుర్వేద, హోమియో, యునాని కోర్సుల్లో 655 సీట్లు న్నాయి. అంటే అన్ని మెడికల్ సీట్ల సంఖ్య 6,465 ఉన్నాయి. మెడికల్‌లో సీట్లు రానివారిలో వేలాదిమంది వ్యవసాయ కోర్సులు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఫలితంగా సీట్లు రానివారంతా ఇతర రాష్ట్రాల్లో ప్రైవేటు వ్యవసాయ కోర్సులు చదువుతున్నారు.

జయశంకర్ వర్సిటీ పరిధిలో సీట్లు ఇలా

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిధిలోని ఆరు వ్యవసాయ కళాశాలల్లో బిఎస్‌సి ఆనర్స్ అగ్రికల్చర్‌లో 432 సాధారణ సీట్లు, 75 పేమెంట్ సీట్లు ఉన్నాయి. కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని రెండు కళా శాలల్లో బిఎస్‌సి ఆనర్స్ హార్టీకల్చర్‌లో 130 సాధారణ సీట్లు, 20 పేమెంట్ సీట్లు, ఇక పివి నరసింహారావు తెలం గాణ పశువైద్య విద్యాలయం పరిధిలోని మూడు కళాశా లల్లో బివిఎస్‌సి అండ్ యానిమల్ హజ్బెండరీలో 158 సీట్లు, అలాగే వనపర్తి జిల్లా పెబ్బేరు, ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా ముత్తుకూర్లలోని ఫిషరీస్ సైన్స్ కళాశాల ల్లోని బిఎఫ్ఎస్‌సిలో (తెలంగాణ కోటా) 36 సీట్లలో ప్రవే శానికి అవకాశముంది. ఈ ఏడాది బిఎస్‌సి ఆనర్స్ అగ్రి కల్చర్‌లో 25 సీట్లు ఎన్ఆర్ఐ స్పాన్సర్ కోటా కింద భర్తీకి అవకాశం కల్పించారు. ఎన్ఆర్ఐ కోటా సీటుకు ఫీజు రూ. 34 లక్షలు, పేమెంట్ సీట్లకు రూ. 14 లక్షల చొప్పున వసూలు చేయాలని యూనివర్సిటీ ఈ ఏడాది నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇంటర్ బైపిసి పూర్త యిన విద్యార్థులకు ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా వ్యవ సాయ, ఉద్యాన, పశుసంవర్ధక, ఫిషరీస్ సైన్స్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు.

కండక్టర్‌ను అడిగి మరీ టిక్కెట్ తీసుకోవాలి

ప్రయాణికులకు ఆర్‌టిసి అధికారుల అవగాహన

మన తెలంగాణ/హైదరాబాద్: తప్పనిసరిగా కండక్టర్‌ను టిక్కెట్లు అడిగి మరీ తీసుకోవాలని ప్రయాణికులకు ఆర్ టిసి అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఎవరైనా బస్సులో టిక్కెట్లు తీసుకోకపోతే కండక్టర్ బాధ్యత వహిం చే పరిస్థితులు ఆర్‌టిసిలో ఇప్పుడు లేవు. డిసెంబర్ 1న ఆర్‌టిసి ఉద్యోగులతో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో కం డక్టర్లకు టిక్కెట్ల బాధ్యతను మినహాయిస్తున్నట్లు సిఎం కెసిఆర్ ప్రకటించారు. దీంతో కండక్టర్లు హమ్మయ్యా అ న్నట్లు ఊపిరిపీల్చుకున్నారు. లేకపోతే ప్రయాణిలకుంద రినీ అడిగిమరీ టిక్కెట్లు ఇచ్చేందుకు కండక్టర్లు నానాఇ బ్బందులు పడేవారు. ప్రయాణికులను లెక్కబెట్టుకుని ఇచ్చిన టికెట్లు సరిపోయాయా..? అని స్టాప్ స్టాప్‌కు లెక్కవేసుకునే వారు. ఈ పరిస్థితి బస్సు రద్దీగా ఉన్న ప్పుడు మరింత ఇబ్బందికరంగా ఉండేది. కిక్కిరిసిపోయి ప్రయాణిస్తున్న వారిని లెక్కించడం, ప్రతిఒక్కరినీ అడిగి మరీ టిక్కెట్లు ఇవ్వడం అంత సులభంగా ఉండేది కాదు. ఈ క్రమంలో అదే సమయంలో చెకింగ్ స్క్వాడ్ వస్తే కం డక్టర్ పరిస్థితి మరింత దయనీయంగా ఉండేది. కండక్టర్ల ఇటువంటి ఇబ్బందులకు సిఎం కెసిఆర్ విముక్తి కలిగిం చారు. ప్రయాణికుల టిక్కెట్ల బాధ్యతను ప్రయాణికులకే ఉండాలని ఆదేశించారు. ఈ క్రమంలో టిక్కెట్లు తీసుకో వాలని ప్రయాణికులకు అవగాహన కలిగించేపనిలో అధి కారులు నిమగ్నమయ్యారు. బస్సు ఎక్కిన తరువాత టిక్కెట్ అడిగి మరీ తీసుకునే బాధ్యత ప్రయాణికులదేనని చెబుతున్నారు. ఈ క్రమంలోనే నగరంలో పలు ప్రాంతా ల్లో బస్సులు ఎక్కి మరీ అవగాహన కలిగిస్తున్నారు. ఒక్క హైదరాబాద్‌లోనే నెలకు రూ.30 నుంచి రూ.50వేల వరకు జరిమానా వసూలు చేసేవారు. టిక్కెట్లు విష యంలో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని అధికా రులు హెచ్చరిస్తున్నారు. కండక్టర్ వచ్చినప్పుడు టిక్కెట్ తీసుకుందామనే ధీమాతో ఉండకుండా అడిగి మరీ టిక్కెట్ తీసుకోవాలని కచ్చితంగా చెబుతున్నారు.

నూతన దశాబ్ది మాదే

మొదటిపేజీ తరువాయి

మాజీ సిఎం చంద్రబాబు ఆనాడు పిలిచినా కెసిఆర్ వెళ్లారని గుర్తు చేశారు. ఎంఐఎంతో స్నేహం ఉందే కానీ రాజకీయ పొత్తు కాదని కెటిఆర్ స్పష్టం చేశారు. ఎంఐఎంతో ఎన్నికల్లో టిఆర్ఎస్ పోటీ పడుతుందన్నారు. పౌరసత్వ సవరణ చట్టంపై టిఆర్ఎస్ పార్లమెంట్ సభ్యులు చెప్పిందే అంతిమం అన్నారు. అయితే ప్రభుత్వ పరంగా ఈ అంశంపై అధికారులతో సిఎం కెసి ఆర్ సమావేశమయ్యే ఆలోచన ఉందన్నారు.

2019వ సంవత్సరం టిఆర్ఎస్‌కు కలిసొచ్చింది

2019లో జరిగిన సర్పంచ్ , జిల్లాపరిషత్, పార్లమెంట్ ఎన్నికల్లో సింహ భాగం గెలుచుకున్నాము. జిల్లాపరిషత్ ఎన్నికల్లో టిఆర్ఎస్ జిల్లాపరిషత్‌ల న్నింటినీ గెలుచుకుని కాంగ్రెస్,బిజెపి ఉనికిని ప్రశ్నించిందని గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో సింహభాగం టిఆర్ఎస్ సొంతం చేసుకుందని తెలి పారు. 2019వ సంవత్సరం టిఆర్ఎస్‌కు కలిసివచ్చిన సంవత్సరమని చెప్పారు. ఎన్నికలు ఏవైనా టిఆర్ఎస్ సిఎం కెసిఆర్‌ను ప్రజలు ఆశీర్వదిస్తూ విజయం చేకూర్చారని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. అలాగే టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా తనకు బాధ్యతలు ఇచ్చి సంవత్సరం గడిచింది. ఈ సంవత్సరంలో పార్టీ ఆదేశించిన పనులన్నీ సంపూర్ణంగా పూర్తిచేశాను, 60ల క్షల మందిని పార్టీలోకి చేర్చుకుని రికార్డును నమోదు చేసినట్లు చెప్పారు. టిఆర్ఎస్ ఆవిర్భవించినప్పటినుంచి నేటివరకు అత్యధిక సభ్యత్వాన్ని 2019లో నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. పార్టీల కొత్తకమిటీల నిర్మాణం గ్రామ,వార్డు,పట్టణ మండల కమిటీలను 98 శాతం ఏర్పాటు చేసు కుకుని అతిపెద్దరాజకీయపార్టీగా టిఆర్ఎస్ ఆవిర్భవించిందన్నారు. ప్రస్తుతం జరగ నున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో జిల్లా పరిషత్ ఎన్నికల విజయం పునరావృతం అవుతుందని కెటిఆర్ చెప్పారు.

రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ కార్యాలయాలు

60లక్షల మంది పార్టీ సభ్యులతో ఆవిర్భవించిన టిఆర్ఎస్ పార్టీ జిల్లాపార్టీ కార్యాలయాల నిర్మాణాలపై దృష్టి సారించింది. గతంలో కేవలం ఖమ్మంజి ల్లాలోనే టిఆర్ఎస్ పార్టీ కార్యాలయం ఉండేది. ప్రస్తుతం 30 జిల్లాల్లో పార్టీ కార్యాలయాల నిర్మాణాలు దాదాపుగా పూర్తి కావస్తున్నాయి. 90 శాతం వరకు పనులు పూర్తి అయ్యాయి. సంక్రాంత్రి అనంతరం పార్టీ అధినేత, సిఎం కెసిఆర్ పార్టీ కార్యాలయాను ప్రారంభించనున్నారని ప్రకటించారు.

పార్టీ శ్రేణులకు శిక్షణ తరగతులు

రాష్ట్ర వ్యాప్తంగా టిఆర్ఎస్ పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవం అనంతరం. జనవరి తర్వాత పార్టీ శ్రేణులకు శిక్షణ తరగతులను ఏర్పాటు చేయనున్నట్లు కెటిఆర్ ప్రకటించారు. ఎన్నికల మాసమైన జనవరి అనంతరం 11 నెలలు పూర్తిగా పార్టీ నిర్మాణం, శిక్షణతరగతులకు అత్యంతప్రాధాన్యత ఇవ్వను న్నట్లు తెలిపారు. ఇప్పటికే పార్టీ అధినేత, సిఎం కెసిఆర్ కొన్ని సూచనలు చేశారు. ఈ మేరకు జిల్లాపార్టీ కార్యాలయాల్లో కొన్ని శిక్షణతరగతులు, మరి కొన్ని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి కెటిఆర్ తెలిపారు. కొత్తపుంతలు తొక్కుతున్న సాంకేతిక రంగం గురించి కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వానికి పార్టీకి మధ్య 60 లక్షల మంది గులాబి సేనతో సంక్షేమ ఫలాలను విరివిగా ప్రజల్లోకి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అభివృద్ధి కోసం ఎంత శ్రమించినా ప్రతిపక్షాలు చేస్తున్న అబద్దపు ప్రచారాన్ని టిఆర్ఎస్ శ్రేణులు తిప్పికొట్టే అంశాలపైకూడా కార్యక ర్తలకు శిక్షణ ఉంటుందన్నారు.

మున్సిపాలిటీ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం

మున్సిపాలిటీ ఎన్నికలకు ఇప్పటికే ఇన్‌ఛార్జీలను నియమించుకున్నాము, మున్సిపాలిటీల వారిగా నివేదికలను తెప్పించుకున్నాము. క్షేత్రస్థాయిలో టిఆర్ఎస్ నుంచి పో టీకి సిద్ధమంటున్న బలమైన నాయకులను కూడా గుర్తించాము. కొన్ని మున్సిపాలిటీల్లో టిఆర్ఎస్ నాయకుల మధ్యనే సీటును ఆశించేవారికి పోటీ ఉంది. వారందరినీ ఓ దార్చి గెలిచే అభ్యర్థులకు ప్రస్తుతం పోటీ చేసే అవకాశం రాకున్నా భవిష్యత్‌లో నామిననేటెడ్ పోస్టులు కల్పిస్తామని చెపుతూ ఏకాభిప్రాయం సాధిస్తున్నామని కెటిఆర్ చెప్పారు. ఇప్పటివరకు మూడు పర్యాయాలు జరిగిన పార్టీ ఆంతరంగిక సమావేశాల్లో మున్సిపాలిటీ ఎన్నికలపై మున్సిపాలిటీల వారిగా సమీక్షించి నివేదికలను రూపొంచామని తెలిపారు. ఈనివేదికలతో పాటు క్షేత్ర స్థాయి నివేదికలను పరిశీలించి వారం రోజుల్లోగా టిఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రజాప్రతి నిధులతో సంయుక్త సమావేశాన్ని ముఖ్యమంత్రి కెసిఆర్ అధ్యక్షతన జరగనుందనీ, ఈసమావేశంలో సిఎం కెసిఆర్ పలు నిర్ణయాలు తీసుకోను న్నారని కెటిఆర్ చెప్పారు. మున్సిపాలిటీ ఎన్నికల అనంతరం పల్లెప్రగతికి సమాంతరంగా పట్టణ ప్రగతి కార్యక్రమాలు నిర్వహించి రాష్ట్రాన్ని వేగవం తంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

సమర్థవంతంగా మున్సిపాలిటీ చట్టం అమలు

మున్సిపాలిటీ చట్టాన్ని పదునుగా అమలు చేసేబాధ్యత మున్సిపాలిటీ మంత్రిగా నాపైనే ఉంది. ఈ చట్టంలో అనేక అంశాలు ఎంతో ప్రభావితంగా ఉన్నాయి. 71 గజాల స్థలంలో మున్సిపాలిటీ అనుమతులు లేకుండా ఇల్లు నిర్మించుకునే అవకాశం ప్రజలకుంది. స్వీయధృవీకరణతో 71 గజాల స్థలంలో ఇళ్లు నిర్మించుకోవచ్చు. గతంలో 21 రోజుల్లో అనుమతులు ఇవ్వాల్సి ఉండగా అధికారులు ఇవ్వలేదు. చివరిరోజు ఏదో కారణాలు చెప్పి అనుమతులు నిరాకరించేవారు. కానీ ఇప్పుడు అలాగాదు. స్వీయధృవీకరణ తోనే ఇళ్లనిర్మాణం చేసుకోవచ్చు. దీనిని సమర్థవంతంగా అమలు చేయాల నేది నాసంకల్పమన్నారు. స్వీయధృవీకరణతో 71 గజాల్లో ఇల్లు నిర్మించు కుంటే ప్రభుత్వపరంగా పూర్తి సౌకర్యాలను సమకూరుస్తుంది. ధృవీకరణలో తప్పులు ఉన్నా, ఎక్కువస్థలంలో ఇల్లుకట్టి 71 స్థలమని ధృవీరరించినా ఆకట్ట డాన్ని కూల్చి వేయటంతో పాటు ఇంటివిలువ అంచనాపై 25 పర్యాయాల అధిక నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందని కెటిఆర్ హెచ్చరించారు. అలాగే అక్రమకట్టడం ఏదైనా ఎలాంటి ముందస్తు సమాచారం తెలపకుండా, అధికారుల అనుమతులు లేకుండా ఆకట్టడాలను కూల్చివేసే అధికారాలు ఈ చట్టానికి ఉన్నాయని ఆయనతెలిపారు. ఈచట్టంద్వారా కలెక్టర్లకు విశేషాధి కారాలు లభించాయి. ఒకవేళ మున్సిపాలిటీ కమీషనర్లు తప్పు చేసినా, అధి కారులు తప్పుచేసినా కఠినంగా వ్యవహరించేందుకు కలెక్టర్లకు అధికారాలు ఉంటాయని చెప్పారు. మున్సిపాలిటీ ఎన్నికల అనంతరం గెలిచిన ప్రజాప్రతి నిధులందరికీ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. టిఆర్ ఎస్ తో పాటు ఏపార్టీ సభ్యులు గెలిచినా వారికి కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులకు నిధులు,విధుల పై పూర్తి అవగాహన కల్పించ నున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ ఎన్నికల అనంతరం 4 సంవత్సరాలు ఏ ఎన్నికలు లేకపోవడంతో అభివృద్ధికే ప్రాధాన్య ఇవ్వనున్నట్లు చెప్పారు, ఒక వైపు పల్లెప్రగతి, మరోవైపు పట్టణ ప్రగతి సమాంతరంగా జరిగితే వేగవంత మైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

అడ్మినిస్ట్రేషన్‌లో సమస్యలు ఉన్నా పరిష్కరిస్తాం

పార్టీ ఎంతబలోపేతంగా ఉన్నా అడ్మినిస్ట్రేషన్‌లో సమస్యలు వస్తుంటాయి. వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత. ఆర్‌టిసి కార్మి కులు సమ్మెను ప్రభుత్వం సమర్థవంతంగా పరిష్కరించింది. ఆర్‌టిసి కార్మి కులు కోరుకున్న దానికంటే అధికంగా వారికి లాభం చేస్తూ ముఖ్యమంత్రి కెసిఆర్ పరిష్కరించారు. ఆర్‌టిసిని లాభాలబాటల్లోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ఆర్‌టిసి ఉద్యోగులతో కలసి కృషి చేస్తోంది. ఆర్‌టిసి లాభాల బాట లోకివెళ్లి బోనస్ తీసుకునే రోజులు కూడా వస్తాయనే ఆశాభావాన్ని కెటిఆర్ వ్యక్తం చేశారు. దురదృష్ట సంఘటనలు సంభవించినప్పుడు ప్రభుత్వం కఠి నంగా వ్యవహరించి ప్రజలకు మేలు చేస్తుందని చెప్పారు.


ఏడాదిలోగా ఫార్మాసిటీ ప్రారంభం

ఫార్మాకంపెనీలన్నీ ఒకే చోటకు చేర్చి, కాలుష్యం లేనివిధంగా నిర్మిస్తున్న ఫార్మాసిటీ ప్రస్తుత సంవత్సరంలో ప్రభుత్వం ప్రారంభించనుందని కెటిఆర్ ప్రకటించారు. అనేక అంతర్జాతీయ సంస్థలు ఫార్మాలో పెట్టుబడులు పెట్టా యని గుర్తు చేశారు. అలాగే వేయి ఎకరాల్లో నిర్మిస్తున్న కాకతీయ టెక్స్‌టైల్ పార్కు నిర్మాణాలు వేగవంతం అవుతున్నాయని తెలిపారు. చైనాతో పోటీ పడే విధంగా ఈ పార్కునిర్మాణం జరుగుతుందన్నారు. ప్రభుత్వం రాయితీలతో పాటు మౌలికసదుపాయాలను సమకూరుస్తోందని చెప్పారు. దేశంలో పారి శ్రామిక ప్రగతికి పార్కులు ఏర్పాటు చేస్తే దక్కన్‌లో కూడా పార్కులు ఏర్పాటు చేయాలని ఆయన కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ప్రగతి శీల రాష్ట్రాలను కేంద్రం గమనంలోకి తీసుకుంటే దేశానికే మంచిదన్నారు. రాజకీయంగా ఆలోచిస్తే మంచిది కాదని ఆయన కేంద్రానికి చెప్పారు. ఐదు ట్రిలియన్ డాల ర్లకల సాకారం కావాలంటే రాష్ట్రాలను కేంద్రం ప్రోత్సహించాలని సూచిం చారు. కేంద్రసహాయం చేయకున్నా హైదరాబాద్‌లో ఐటి పరిశ్రమను తెలం గాణ ప్రభుత్వం అగ్రగామిగా తీర్చిదిద్దామన్నారు. అలాగే హైదరాబాద్ పాత బస్తీ వరకు మెట్రోరైలు వచ్చేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని చెప్పారు.

మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ మా ప్రత్యర్థి

త్వరలో జరగనున్న మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల్లో టిఆర్ఎస్‌కు కాంగ్రెస్ పార్టీ ప్రత్యర్థిగా ఉన్నప్పటికీ ప్రజల ఆశీర్వాదంతో టిఆర్ఎస్ అపూర్వ విజయం సాధించనుందన్నారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్‌కు బలం లేకపోయినా ఆపార్టీకి వందసంవత్సరాల చరిత్ర ఉందన్నారు. ఎన్నో ఒడిదుడుకులను ఆపార్టీ చూసిందని చెప్పారు. బిజెపి పార్టీ రాష్ట్రంలో పూర్తిగా క్షీణ దశలో ఉందన్నారు. తాను చిన్నప్పటినుంచి చూసిన విధంగానే రాష్ట్రంలో బిజెపి ఉందని కెటిఆర్ వ్యాఖ్యానించారు.




నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం ప్రగతిభవన్‌లో అధికారులు ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛాలిచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డిజిపి మహేందర్‌రెడ్డి, సిఎస్ సోమేశ్‌కుమార్ సిఎంకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. టిఎస్‌పిఎస్‌సి చైర్మన్ ఘంటా చక్రపాణి, ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్‌ఎస్ అధికారులు, జెన్‌కో-ట్రాన్స్‌కో సిఎండి దేవులపల్లి ప్రభాకర్‌రావు, కమిషన్, కార్పొరేషన్ చైర్మన్లు ప్రగతిభవన్‌లో సిఎం కెసిఆర్‌ను కలిసి శుభాకాంక్షలు చెప్పారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇచ్చేందుకు రూపొందించిన నమూనా డిక్షనరీని విద్యాశాఖ కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి ముఖ్యమంత్రికి అందించారు. ప్రగతిభవన్ సిబ్బంది సైతం ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సిఎం అందరికీ తిరిగి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ మేనిఫెస్టో రూపకల్పన కమిటీ

మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో జరిగే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో రూపకల్పనకు ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేస్తూ ఎఐసిసి ఇన్‌చార్జి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి ఆర్‌సి.కుంతియా బుధవారం ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టో రూపకల్పన కమిటీ చైర్మన్‌గా మాజీ శాసనమండలి సభ్యులు మగ్గం రంగారెడ్డిని నియమించినట్లు తెలిపారు. ఆయనతో పాటు మరో 10 మంది సభ్యులను నియమించారు. ఈ కమిటీ సభ్యులుగా మాజీ మండలి సభ్యులు రాములు నాయక్, అల్ ఇండియా ఆదివాసి కమిటీ చైర్మన్ బెల్లయ్యనాయక్,టిపిసిసి మైనారిటీ విభాగం చైర్మన్ సోహెల్, మాజీ శాసన సభ్యులు ఆకుల రాజేందర్ ముది రాజ్, మెదక్ మాజీ డిసిసిబి చైర్మన్ జైపాల్ రెడ్డి, పల్లవి శ్రవంతి,సత్యం శ్రీరంగం,గాలి అనిల్‌కుమార్, టిపిసిసి కార్యదర్శి మల్లాది ఉంటారని పేర్కొన్నారు. ఈ మేరకు మేనిఫెస్టో కమిటీ రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల పై సమగ్రమైన మేనిఫెస్టో నివేదికను ఈనెల 4వ తేదీ వరకు టిపిసిసి కమిటీకి అందజేయాలని నిర్దేశించారు.

త్వరలో ఉర్దు అకాడమీ డైరెక్టర్‌గా మహ్మద్ గౌస్ బాధ్యతల స్వీకరణ

మనతెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ నూతన డైరెక్టర్, కార్యదర్శిగా నియమితులైన మహ్మద్ గౌస్ త్వరలో నూతన బాధ్యలను స్వీకరిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. సంగారెడ్డి మహిళా డిగ్రి కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులను నిర్వహిస్తున్నారు. ఏడాది కాలం డిప్యూటెషన్ ప్రాతిపదిక మీద అదనపు బాధ్యతలను అప్పగిస్తూ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ఉత్తర్వులను జారీ చేశారు. ఇప్పటి దాక మైనారిటీ సంక్షేమ శాఖ డైరెక్టరేట్‌కు డైరక్టర్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్న షానవాజ్ ఖాసీం ఉర్దూ అకాడమీ అదనపు బాధ్యతలను నిర్వహించారు.

కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి మృత్యుంజయం రాజీనామా

మనతెలంగాణ/హైదరాబాద్ : కరీనంగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మృత్యుంజయం తన పదవికి,పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను పార్టీ అధినేత్రి సోనియా గాంధీకి ఫ్యాక్స్ ద్వారా పంపించామని బుధవారం మీడియాకు ఆయన వెల్లడించారు.

వెస్ట్ వర్జీనియా బార్‌లో కాల్పులు

హన్‌టింగ్టన్ : వెస్ట్ వర్జీనియాలో ఒక బార్‌లో జరిగిన కాల్పుల్లో ఏడుగురు గాయపడ్డారు. నూతన సంవత్సరం ప్రారంభమైన కాసేపటికి ఈ సంఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. ఇక్కడి కుల్చర్ హూకాహ్ బార్ లో బుధవారం తెల్లవారు జామున కాల్పులు జరిగాయని హన్‌టింగ్టన్ పోలీస్ చీఫ్ రే కార్న్‌వెల్ ఒక ప్రకటనలో వెల్లడించారు. బార్ లోపల, బయట చాలామంది కాల్పులు జరుపుతూ కనిపించారని ఆ ప్రకటన తెలిపింది. కొందరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవ కాల్పులకు దారితీసిందని కార్న్‌వెల్ చెప్పారు. వోక్స్ టీవీ కథనం ప్రకారం బార్ బయట, వీధిలో పార్కింగ్ లాట్‌లో డజనుకు పైగా తుపాకీ గుళ్ల కేసులు కనిపించాయి. పోలీసులు వచ్చే సమయానికి బార్ లోపల దాదాపు 50 మంది ఉన్నారు. కాల్పుల్లో గాయపడిన వారిని చికిత్సకోసం ఆస్పత్రికి తరలించారు. అయితే వారి గాయాలు ఏ రకమైనవో ప్రకటన పేర్కొనలేదు. ఈ కాల్పులపై దర్యాప్తు జరుగుతోంది.

చనిపోయి తొమ్మిది మందిని బతికించింది



మన తెలంగాణ/హైదరాబాద్ : సాటి మనిషికి సాయం చేయాలంటే ఐశ్వర్యవంతులే కానవసరం లేదు. అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన హైదరాబాద్ నేరెడ్‌మెట్‌కు చెందిన చరితారెడ్డి అవయవదానంతో తొమ్మిది మందికి జీవితాన్ని ప్రసాదించింది. మాట సాయం కరవైపోతున్న ఈ రోజుల్లో తన ప్రాణం పోయిన తర్వాత అవయవాలు అవసరమైన వారికి ఉపయోగపడాలనుకునే వారు అరుదు. అలాంటి వారి కోవలోకే వస్తుంది చరితారెడ్డి. మూడు రోజుల కిందట అమెరికా లాన్సింగ్‌లో జరిగిన కారు ప్రమాదంలో హైదరాబాద్ నేరెడ్‌మెట్‌కి చెందిన చరితారెడ్డి మృతి చెందింది. ఈ ఘటనలో ఆమె బ్రెయిన్‌డెడ్ అయినట్లు ముస్కేగాన్ ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. మరణానంతరం తల్లిదండ్రుల అంగీకారంతో అవయవదానం చేశారు. జ్ఞాపకాలను తల్లిదండ్రులకు మిగిల్చి తొమ్మిది కుటుంబాల్లో వెలుగులు నింపింది. ధన సాయం చేస్తే ఖర్చు అయ్యే వరకూ గుర్తుండొచ్చు. అదే విధంగా మాట సాయం చేస్తే మనిషి ఉన్న వరకూ గుర్తుండొచ్చు. అవయవదానంతో మరణానంతరం కూడా గుర్తుండిపోవడమే కాదు.. ఎందరో జీవితాల్లో వెలుగులు నింపొచ్చు అనేందుకు చరితారెడ్డి నిదర్శనం.

ఆర్‌అండ్‌బిలో నూతన సంవత్సర సందడి

మన తెలంగాణ/హైదరాబాద్ : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అధికారులు, ఉద్యోగులు కలిసి రాష్ట్ర రోడ్లు, భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి ఇంజనీర్స్ అసోసియేషన్ రూపొందించిన 2020 క్యాలెండర్, డైరీని మంత్రి ప్రశాంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ ఏడాది అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని అధికారులు, ఉద్యోగులను ఉద్దేశించి ప్రశాంత్ రెడ్డి ఆకాంక్షించారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అందరితో మంత్రి కాసేపు సరదాగా గడిపారు. మంత్రి ప్రశాంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపినవారిలో గృహ నిర్మాణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ చిత్రరామచంద్రన్, ఆర్ అండ్ బి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్ శర్మ, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు, ఇఎన్‌సి గణపతి రెడ్డి, ఆర్ అండ్ బి స్టేట్ రోడ్స్ ఇఎన్‌సి రవీందర్ రావు, న్యాక్ డిజి భిక్షపతి, టిజివో నేతలు కృష్ణ యాదవ్‌తో పాటు అభిమానులు ఉన్నారు.

రవాణశాఖ పరిధిలోకి క్యాబ్ సర్వీసులు

- ప్రయాణికుల భద్రత, భరోసాపై నజర్
- రవాణాశాఖ చట్టసవరణకు చర్యలు



మన తెలంగాణ, హైదరాబాద్/సిటీబ్యూరో : ఇప్పటివరకు ప్రత్యేకంగా ఎటువంటి నిబంధనలు లేకుండా నడుస్తున్న క్యాబ్, టూవీలర్ తదితర సర్వీసులను భద్రత వలయంలోకి తెచ్చేందుకు రవాణా శాఖ సిద్ధమైంది. ఉబర్, ఓలా, రాపిడో వంటి సర్వీసులను రవాణా శాఖ తమ పరిధిలోకి తీసుకువచ్చేందుకు రవాణాశాఖ సన్నద్ధమైంది. వీటి నిర్వహణపై ఇప్పటివరకు రవాణాశాఖకు ఎటువంటి నియంత్రణ లేదు. తొలుత అరకొరగా ప్రారంభమైన క్యాబ్ సర్వీసులు ఇప్పుడు విస్తృతమవడంతో ఆర్‌టిఎ దృష్టి సారించింది. ప్రయాణాలు చేసేవారిలో 15 నుంచి 25 శాతం మంది ఇటువంటి సర్వీసులనే ఆశ్రయిస్తున్నట్లు అంచనా. ఇలాంటి తరుణంలో ప్రజల భద్రతను ప్రభుత్వం పర్యవేక్షిస్తుంది. ఈ క్రమంలోనే సర్వీసుల పొందుతున్న పౌరుల భద్రత, భరోసా కల్పించేందుకు రవాణాశాఖ ప్రణాళికలు రూపొందిస్తుంది. ఇప్పటివరకు క్యాబ్ ఓనర్లు మాత్రమే ట్యాక్స్ ప్లేట్ రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. క్యాబ్‌లకు సమన్వయకర్తలుగా మాత్రమే ఉంటూ అనేక కంపెనీలు క్యాబ్‌లు నడుపుతున్నాయి. కొత్తగా తెస్తున్న నిబంధలన ప్రకారం లైసెన్స్ పొందాలంటే రవాణశాఖకు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. రవాణాశాఖకు నిబంధనలు తప్పకపాటించాల్సి ఉంటుంది. ఇకనుంచి వీటిని నడపాలంటే రవాణాశాఖ నుంచి ఆయా సంస్థల ఆపరేటర్లు లైసెన్స్‌లు పొందాల్సి ఉంటుంది. కొత్తగా తెస్తున్న రవాణాశాఖ చట్ట సవరణల్లో ఈ విషయాన్ని చేర్చారు. నూతన నిబంధనల ప్రకారం లైసెన్స్ పొందాలంటే ఆపరేటర్లు రవాణాశాఖకు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అందిస్తున్న సేవల విషయంలోనూ రవాణాశాఖకు సదరు ఆపరేటర్లు పలు అంశాలపై హామీ ఇవ్వాల్సి ఉంటుంది. సంస్థ ఉద్యోగుల అర్హతలు, వినియోగిస్తున్న వాహనాల సామర్థ్యం, వసూలుచేస్తున్న ఛార్జీలు, కల్పిస్తున్న భద్రత తదితర అంశాలకు సంబంధించిన వివరాలు డాక్యుమెంట్ల రూపంలో సమర్పించాలి. త్వరలో తీసుకురానున్న రవాణాశాఖ చట్టసవరణల్లో ఈ అంశాన్ని చేర్చనున్నట్లు తెలుస్తున్నది. నూతన మార్గదర్శకాల ప్రకారమే క్యాబ్ సర్వీసులు ఆపరేట్ చేయాల్సి ఉంటుంది. నూతనంగా వచ్చే ఈ విధానం వల్ల ఆ సర్వీసులను వినియోగించుకునే ప్రయాణికులకూ ప్రయోజనం కలుగుతుంది. నగరంలో సుమారు 60 వేల క్యాబ్‌లు తిరుగుతుండగా వీటన్నింటిని ఎన్‌ఫోర్స్ చేయడానికి రవాణాశాఖకు అధికారం ఉంటుంది. ప్రయాణికుల హక్కులు, సౌకర్యాలకు ఇబ్బందులు కలిగితే వెంటనే రవాణా శాఖకు ఫిర్యాదు చేయవచ్చు. తద్వారా అధికారులు పరిస్థితులను సమీక్షించి బాధ్యతలపై చర్యలు తీసుకుంటారు. అంతేకాదు ఆపరేటర్ల మధ్య భరోసా, పోటీతత్వం పెరిగి తద్వారా ప్రయాణచార్జీలు తగ్గే అవకాశం ఉంటుంది. వారికి సురక్షితమైన ప్రయాణం కూడా అందుతుంది. ఇష్టారీతిన సర్వీసుల్లో ఛార్జీలు వసూలు చేసేందుకు కొత్త విధానంలో అడ్డుకట్ట పడుతుంది.

జాతీయ సమగ్రత పరిరక్షణ అందరి బాధ్యత

- రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ మహ్మద్ ఖమ్రుద్దీన్ పిలుపు

మనతెలంగాణ/హైదరాబాద్ : జాతీయ సమగ్రత పరిరక్షణ అందిరి బాధ్యతగా రాష్ట్ర మైనారిటీ కమిషనర్ చైర్మన్ మహ్మద్ ఖమ్రుద్దీన్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఉర్దూ భాష పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగిన ముషాయిరా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో జాతీయ సమగ్రత పరిరక్షణ అత్యున్నతమైందిగా వెల్లడించారు. ఈ మేరకు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషలో ముషాయిరాను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమితి అధ్యక్షులు మహ్మద్ అరిఫొద్దీన్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఉస్మాన్, ఉపాధ్యక్షులు షేక్ సయిద్ ఆహ్మద్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సబితకు డిఎస్‌సి 98 క్వాలిఫైడ్స్ వినతి

మన తెలంగాణ/హైదరాబాద్ : ముఖ్యమంత్రి కెసిఆర్‌తో మాట్లాడి డిఎస్‌సి 1998 క్వాలిఫైడ్స్ హైకోర్ట్ పిటిషర్లు అందరికి త్వరగా ఉద్యోగాలు ఇప్పించి న్యాయం చేయాలని 1998 డిఎస్‌సి సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కె . శ్రీనివాస్ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, కెటిఆర్‌ను కోరారు. బుధవారం ఆయన విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని పంజాగుట్టలోని ఆమె నివాసంలో, తెలంగాణ భవన్‌లో కెటిఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేశారు. వినతి పత్రాలు అందజేశారు. 21 సంవత్సరాలుగా న్యాయపోరాటం చేస్తు న్న 1998 డిఎస్‌సి క్వాలిఫైడ్స్‌కి ముఖ్యమంత్రి కెసిఆర్



జనవరి 3, 2016న ఉద్యోగాలిచ్చి ఆదుకుంటానని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారని శ్రీనివాస్ మంత్రులకు విన్నవించారు. హైకోర్టు ఇచ్చిన అనుకూల తీర్పుపై స్పందించి పిటిషన్లు అందరికి ఉద్యోగాలు ఇచి న్యాయం చేసేలా సిఎంతో మాట్లాడాలని అభ్యర్థించగా మంతులు సబితా ఇంద్రారెడ్డి, కెటిఆర్ సానుకూలంగా స్పందించారు. విద్యారంగం సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి దృష్టి సారించారని, ఈ నూతన సంవత్సరంలో మీకు న్యాయం చేసేలా సిఎంతో తప్పకుండా మాట్లాడతామని వారు హామీ ఇచ్చారు.

మరో రెండ్రోజుల పాటు మోస్తరు వర్షాలు..!

మన తెలంగాణ/హైదరాబాద్ : హైదరాబాద్ వాతావరణ కేంద్రం మూడు రోజుల వరకు వాతావరణ సూచనలు విడుదల చేసింది. రెండు రోజుల పాటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో మరో రెండు రోజులు తేలిక పాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. ఉత్తర ఒరిస్సా, దాని పరిసర ప్రాంతాలలో 1.5 కి.లోమీటర్ల నుంచి 2.1 కిలోమీటర్ల మధ్య ఏర్పడిన ఉపరితల ఆవర్తనం బలహీనంగా మారిందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తెలంగాణలో ప్రధానంగా ఆగ్నేయ దిశ నుంచి గాలులు వీస్తుండగా, ఏపిలో తూర్పుదిశ నుంచి గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. కోస్తాంధ్ర, యానాం ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాయలసీమ ప్రాంతంలో రాగల మూడు రోజులు తేలికపాటిపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు.

ఈసారి జంబ్లింగ్ లేదు..

- సిసి కెమెరాల నిఘా
- ఫిబ్రవరి 1 నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం
- కళాశాలలలో ప్రయోగాలు చేయకుండానే పరీక్షలు
- విద్యార్థుల్లో కొరవడుతున్న శాస్త్రీయ పరిజ్ఞానం

మనతెలంగాణ/హైదరాబాద్ : ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఈ సారి కూడా జంబ్లింగ్ విధానం లేకుండా పాత పద్ధతిలోనే జరుగనున్నాయి. కానీ ఈ సారి ఇంటర్ ప్రయోగ పరీక్షలు సిసి కెమెరాల నిఘా మధ్యలో జరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి 1 నుంచి 20 వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్న ప్రయోగ పరీక్షల్లో ఈ విధానాన్ని అనుసరించనున్నారు. ప్రాక్టికల్ పరీక్షల ముగిసిన తర్వాత సిసి కెమెరాల ఫుటేజీని సిడిల రూపంలో తెప్పించుకుని పరిశీలిస్తామని ఇంటర్‌బోర్డు కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్ ఇటీవల వెల్లడించారు. ఈ పరీక్షల నిర్వహణకు మొత్తం 1,517 కేంద్రాలను, ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలకు 449 గుర్తించిన ఇంటర్ బోర్డు ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. ప్రాక్టికల్ పరీక్షలపై సరైన పర్యవేక్షణ, నిఘా ఉండటం లేదనే విమర్శలు ఉన్న నేపథ్యంలో ఈ సారి ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. అయితే జంబ్లింగ్ విధానం మాత్రం ఈ సారి కూడా అమలు చేయడం లేదు. ఏ కళాశాల విద్యార్థులు ఆ కళాశాలలోనే ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్నారు.

ప్రయోగాలు చేయకుండానే పరీక్షలకు

ప్రైవేట్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ప్రాక్టికల్స్ చేయకుండానే ప్రాక్టికల్ పరీక్షలకు హాజరయ్యే పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలోని జూనియర్ కళాశాలల్లో ఎక్కువగా థీయరీపైనే దృష్టి సారించి, ప్రాక్టికల్స్‌ను విస్మరించారన్న విమర్శలు ఉన్నాయి. కొన్ని కళాశాలల్లో అవసరమైన సామాగ్రి లేకపోవడం, మరికొన్నింటిలో



నేర్పించే సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంటుంది. కొత్త ఆవిష్కరణలకు విద్యార్థి దశలోనే పునాదులు పడాల్సి ఉంటుంది. అందుకోసం ఇంటర్‌లో సైన్స్ గ్రూపులు చదివే విద్యార్థులకు ప్రయోగాత్మక విద్యను బోధిస్తారు. ప్రైవేట్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరిపడా అధ్యాపకులు, ప్రయోగశాలలు లేకపోవడం విద్యార్థులకు శాపంగా మారుతుంది. కొన్ని కళాశాలల ప్రయోగశాలల్లో పరికరాలు, రసాయనాలు ఉన్నా యాజమాన్యాల నిర్లక్ష్యం వల్ల విద్యార్థులకు ప్రయోగాలు నిర్వహించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మరికొన్నింటిలో ప్రయోగశాలలు కేవలం అలంకారప్రాయంగా ఉంటున్నాయి. విద్యార్థి దశలో ఇంటర్ విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ముఖ్యంగా ఎంపిసి, బైపిసి విద్యార్థులకు పాఠ్యాంశాలకు అనుగుణంగా ప్రయోగాలు చేయిస్తూ బోధన చేయాల్సి ఉంటుంది. ప్రథమ సంవత్సరం నుంచే వారానికి ఒకసారైనా ప్రయోగాలు నిర్వహించాలి. రాష్ట్రంలో చాలా చోట్ల ఆ పరిస్థితి లేదు. కొన్ని కళాశాలల్లో ప్రయోగశాలలకు ఆసలు గదులే లేవు. జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తున్న దాఖలాలు కన్పించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే అందుకు భిన్నంగా కోర్సు ముగింపు సమయంలో మొక్కుబడిగా ప్రయోగశాలకు తీసుకువెళ్లుతున్నారు. దీంతో విద్యార్థులకు ఆయా పాఠ్యాంశాలపై పూర్తి స్థాయి అవగాహన కలగడం లేదు. దీనికి తోడు బోర్డు అధికారుల ఉదాసీన వైఖరి కారణంగా ప్రైవేటు కళాశాలల ప్రాక్టికల్స్ నిర్వహణను సీరియస్‌గా తీసుకోవడం లేదు.

ప్రాక్టికల్స్ మార్కులే కీలకం

ఇంటర్ ప్రాక్టికల్స్‌లో ఎంపిసి విద్యార్థులకు 60 మార్కులు, బైపిసి విద్యార్థులకు 120 మార్కులు ఉంటాయి. ఎంపిసి విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్ట్‌ల్లో ప్రయోగ పరీక్షలు జరుగుతాయి. బైపిసి విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీతో పాటు జువాలజీ, బోటనీ సబ్జెక్ట్‌ల్లో ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. ఒక్క మార్కు తేడాతో కూడా ర్యాంకులు తారుమరవుతుంటాయి. దాంతో ర్యాంకుల పోటీలో ప్రతి మార్కూ కీలకంగానే మారుతుంది. ఎంసెట్ ఇంటర్ పరీక్షల మార్కులకు 25 శాతం వెయిటేజి ఉండటంతో ప్రయోగ పరీక్షల్లో మార్కులకు అత్యంత ప్రాముఖ్యత ఉంటుంది. అలాగే ఇంటర్‌లో 75 శాతం మార్కులు వస్తేనే జెఇఇకి అర్హత ఉండటంతో నామమాత్రంగా పరీక్షలు నిర్వహించి అధిక మార్కులు వేసుకునేలా కార్పొరేట్ యాజమాన్యాలు ఏర్పాట్లు చేసుకుంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంటర్ సబ్జెక్ట్‌ల్లో ఉత్తీర్ణులు కాలేని వారికి సైతం ప్రయోగ పరీక్షల్లో సెంట్ పర్సెంట్ మార్కులు వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని బలహీనపరుస్తూ మతతత్వం వైపు అడుగులు వేస్తుండడాన్ని వ్యతిరేకిస్తూ జరిగే నిరసనలు హింసాత్మకం కాకూడదని బిఎస్‌పి అధినేత్రి మాయవతి అన్నారు. ఈ ఏడాది గతేడాది మాదిరిగా బాధాతప్తమైన సంవత్సరంగా ఉండకూడదని ఆమె ఆకాంక్షించారు. 2019లో బిజెపి ప్రభుత్వాలు, కేంద్రప్రభుత్వం మతతత్వ, అనాలోచిత విధానాలు అవలంబిస్తూ రాజ్యాంగాన్ని బలహీపరిచాయన్నారు. దీంతో ఆందోళనలు, నిరసనలు జరగడం బాధాకరమని, దురదృష్టకరమని మాయావతి పేర్కొన్నారు. దేశంలో చోటుచేసుకునే నిరసనలతో ప్రజలకు, ఏ మతానికి సైతం ఇబ్బందులు కలగకూడదన్నారు.

విశాల

రాష్ట్రాలు తప్పించుకునే దారిలేదు



న్యూఢిల్లీ : పార్లమెంట్‌లో ఆమోదించిన చట్టాలను అమలు చేయడం రాష్ట్ర ప్రభుత్వాల రాజ్యాంగబద్ధమైన బాధ్యత, అవి తప్పించుకునే దారి లేదని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని (సిఎఎ) అమలు చేయవద్దని చెబుతున్న వారు న్యాయపరమైన అభిప్రాయాలను కోరవచ్చునన్నారు. బుధవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాజ్యాంగం ప్రకారం ప్రమాణం చేసి పాలన అధికార బాధ్యతలు చేపట్టే రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగానికి విరుద్ధమైన ప్రకటనలు చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని కోరుతూ కేరళ అసెంబ్లీ తీర్మానం చేసిందన్నారు. తాము సిఎఎను అమలు చేయమబోమని లేదా దానిని వ్యతిరేకిస్తూ తీర్మానాలు ఆమోదిస్తున్నామని పేర్కొన్న ప్రభుత్వం రాజ్యాంగ నిబంధనలపై తగిన న్యాయ అభిప్రాయాలను కోరవచ్చునన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 245 లోని రెండవ నిబంధనను ఈ సందర్భంగా కేంద్రమంత్రి ప్రస్తావించారు.

వన్ నేషన్-వన్ రేషన్ ప్రారంభం

న్యూఢిల్లీ : ఒక దేశంఒకే రేషన్ కార్డు సదుపాయాన్ని కేంద్ర ప్రభుత్వం బుధవారంనాడు ప్రారంభించింది. రెండు తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా 12 రాష్ట్రాల్లో ఈ పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించింది. నూతన సంవత్సరం తొలిరోజున ఎపి, తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్ర, హర్యానా, రాజస్థాన్, కర్నాటక, కేరళ, మధ్యప్రదేశ్, గోవా, జార్ఖండ్, త్రిపురల్లో ప్రారంభించింది. ఈ 12 రాష్ట్రాల్లో ప్రజాపంపిణీ వ్యవస్థ లబ్ధిదారులు వారు ఏ రాష్ట్రంలో నివసిసున్నా తమ రేషన్ వాటాను పొందే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది. 2020 జూన్ నాటికి దేశంలోని అన్ని రాష్ట్రాలను ఒన్ నేషన్..ఒన్ రేషన్ సదుపాయానికి అనుసంధానిస్తారు. ఈ సదుపాయం కింద నూతన ఫార్మాట్‌లో రేషన్ కార్డును రూపొందించాలని కేంద్రం రాష్ట్రాలను ఆదేశించింది. జూన్ 1, 2020 నుంచి నూతన రేషన్ కార్డులు అందుబాటులోకి వస్తాయి.

జూన్ నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి : పాశ్వాన్

వలస కార్మికులకు, దినసరి కూలీలకు ప్రయోజనకర పథకంగా భావిస్తున్న 'వన్ నేషన్, వన్ రేషన్ కార్డ్' పథకం వచ్చే జూన్ నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానుంది. జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం, అర్హత కలిగిన లబ్ధిదారులు ఈ రేషన్ కార్డు ద్వారా దేశంలోని ఏదైనా చౌక ధరల దుకాణం నుంచి తమ కోటా ఆహార ధాన్యాలను పొందగలుగుతారు. బయోమెట్రిక్ లేదా ఆధార్ ధ్రువీకరణ తర్వాత ఇది అందుబాటులోకి వస్తుందని ప్రజా పంపిణీ శాఖ మంత్రి రాంవిలాస్ పాశ్వాన్ చెప్పారు.

పెరిగిన ధరలపై కాంగ్రెస్ ఆగ్రహం

న్యూఢిల్లీ: రైలు ఛార్జీల పెంపు, ఎల్‌పిజి సిలిండర్ ధరల పెరుగుదలపై కాంగ్రెస్ పార్టీ బుధవారం కేంద్రంపై నిప్పులు చెరిగింది. ఇవి సామాన్యుడిని తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి నెడతాయని విరుచుకుపడింది. కాంగ్రెస్ ప్రతినిధి సుస్మితాదేవ్ మాట్లాడుతూ – ఆర్థికపరిస్థితి దుర్భరంగా ఉన్న సమయంలో ధరలు పెంచారన్నారు. 'ఈ దుస్థితి ఎప్పటికి తీరుతుంది? ఇది ప్రభుత్వం సామాన్యుడికి ఇచ్చిన నూతన సంవత్సర కానుకా?' అని సుస్మిత అవహేళన చేశారు. సామాన్యుడికి ఇది తీరని అన్యాయమని ఆవేదన చెందారు. ప్రభుత్వం డిసెంబర్ 31న రైలు చార్జీల్ని ప్రయాణించే స్థాయినిబట్టి కిలోమీటర్‌కు ఒక పైసా నుంచి నాలుగు పైసల వరకూ పెంచింది. ఇప్పుడు ఎల్‌పిజి సిలిండర్ రేటును రూ. 19 ఎక్కువ చేసింది.

మహిళను కొట్టిన పోప్, తర్వాత సారీ



వాటికన్ సిటీ: తన చేతిని పట్టుకున్న ఒక మహిళను చెంపదెబ్బ కొట్టినందుకు పోప్ ఫ్రాన్సిస్ బుధవారం క్షమాపణ చెప్పారు. నూతన సంవత్సరం సందర్భంగా కేథలిక్ మార్గాన్ని అనుసరించే భక్తులకు సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో పోప్ శుభాకాంక్షలు చెప్పిన సందర్భంలో ఈ సంఘటన సంఘటన జరిగింది. తన చేతులు పట్టుకుని లాగిన అభిమానిని విడిపించుకొని ఫ్రాన్సిస్ చెంపదెబ్బ కొట్టిన ఇమేజ్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. దాంతో ఆయన వ్యక్తిగతంగా క్షమాపణ చెప్పారు. 'మేము చాలాసార్లు సహనాన్ని కోల్పోయాము' అని ఫ్రాన్సిస్ అంగీకరించారు. 'నిన్నటి సంఘటన చాలా దురదృష్టకరం. నాకూ అలా జరుగుతుంది' అని వాటికన్‌లో భారీ ఉత్సవాల ప్రారంభానికి ముందు పోప్ చెప్పారు. ఈ సంఘటనపై ట్విటర్‌లో వెలువడిన వ్యాఖ్యలు చాలావరకు మతగురువు పోప్ చర్యను సమర్థించేవిగా ఉన్నాయి. 'ఆయన కూడా మనిషే. ఎవరినీ బాధపెట్టాలనుకోరు' అని ఒక నెటిజన్ పేర్కొన్నారు.

మున్సిపోల్స్‌పై హైకోర్టులో పిల్

మన తెలంగాణ/ హైదరాబాద్: మునిసిపాలిటీ ఎన్నికల షెడ్యూల్‌ను సవాల్ చేస్తూ హైకోర్టులో పిల్ పడింది. మున్సిపల్ పదవులకు రిజర్వేషన్లు నిర్ధారణ చేయకుండా రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ ఎలక్షన్ షెడ్యూల్ ప్రకటించడం చెల్లదంటూ టీపీసీసీ అధినేత, నల్లగొండ పార్లమెంటు మెంబర్ ఎన.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పిల్ వేశారు. మున్సిపాలిటీలు 120, వార్డులు 2727, కార్పొరేషన్లు 10, కార్పొరేషన్‌లో వార్డులు 385 చొప్పున ఉన్నాయి. వీటిలో ఓటర్ల జాబితాను కూడా సిద్ధంగా లేకుండానే షెడ్యూల్ వెల్లడించారు. ఈ నెల 22న ఎన్నికలు జరిపేస్తామని కూడా ప్రకటించింది. రిజర్వేషన్లు ఖరారు చేయకుండానే ఎలా షెడ్యూల్ వెల్లడిస్తారు. ఎలక్షన్ నోటిఫికేషన్ వెల్లడి అయితే ఒక్క రోజు మాత్రమే గడువు ఇచ్చి రిజర్వేషన్లు ప్రకటిస్తామని చెప్పడం అన్యాయం. రిజర్వేషన్ల ప్రకటన తర్వాత ఆయా కేటగిరీల అభ్యర్థులు కుల సర్టిఫికెట్ తీసుకునే గడువు కూడా తగినంత ఉండేలా చేయాలి.

■2020 జిగేల్





ముంబయిలోని గేట్ వే ఆఫ్ ఇండియా వద్ద బాణసంచా వెలుగుల్లో నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతున్న పర్యాటకులు. ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద కొత్త ఏడాది వేడుకలకు హాజరైన హస్తిన వాసులు

వచ్చే ఏడాది చంద్రయాన్-3

- గగన్‌యాన్‌కు వ్యోమగాములు
- ఇస్రో ఛైర్మన్ శివన్ వెల్లడి
- మేలుచేసే ఉపగ్రహాలే లక్ష్యం



బెంగళూరు : చంద్రయాన్ 3 యాత్రను వచ్చే ఏడాది చేపడుతారు. ఇక ప్రతిష్టాత్మక గగన్‌యాన్ కోసం భారత వైమానిక దళానికి చెందిన నలుగురిని ఎంపిక చేశారు. ఈ విషయాలను భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఛైర్మన్ కె శివన్ బుధవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు. కొత్త సంవత్సరం ఆరంభం నేపథ్యంలో సంస్థ తలపెట్టిన పలు కార్యక్రమాలను ఆయన వెల్లడించారు. చంద్రయాన్ 3 ప్రయోగానికి కేంద్ర ప్రభుత్వ ఆమోదం లభించిందని శివన్ తెలిపారు. చంద్రుని వద్దకు మూడో దఫా యాత్ర వచ్చే ఏడాది జరుగుతుందని, ఇందుకు అన్ని ఏర్పాట్లు సజావుగా సాగుతున్నాయని తెలిపారు. ఈ ఏడాదే (2020)లోనే చంద్రయాన్ 3 ఉంటుందని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఒక్కరోజు క్రితమే చెప్పారు. అయితే ఈ ఏడాది ఈ ప్రయోగం ఉండదని శివన్ స్పష్టం చేశారు.

గగనయాన్ కోసం రష్యాలో శిక్షణ

ఇక అంతరిక్ష శాస్త్రీయ పరిశోధనలలో భారతదేశం కీలకంగా భావిస్తోన్న గగన్‌యాన్ కోసం వ్యోమగాములకు రష్యాలో శిక్షణ ఇస్తారని వెల్లడించారు. భారతీయ వాయు దళానికి చెందిన నలుగురిని గగన్‌యాన్ కోసం ఎంపిక చేయడం జరిగింది. వీరిని ధీటైన వ్యోమగాములుగా తీర్చిద్దేందుకు రష్యాలోని అంతరిక్ష కేంద్రాలకు తగు శిక్షణకు పంపిస్తారని శివన్ చెప్పారు. గగన్‌యాన్‌కు ఎంపికైన వారంతా మగవారేనని తెలిపారు. వీరికి రష్యాలో ఈ నెల మూడో వారం నుంచే శిక్షణ అందుతుందని , గత ఏడాది గగన్‌యాన్‌కు సంబంధించి సంస్థ పురోగతి సాధించిందని, నమూనాల రూపకల్పన, వ్యోమగాముల ఎంపిక ప్ర క్రియ పూర్తి అయిందని వివరించారు. గగన్‌యాన్ ప్రా జెక్టు కోసం భారత దేశం రష్యా, ఫ్రాన్స్‌లతో స హకార ఒప్పందం కుదుర్చుకుంది. ప్రతిష్టాత్మక గగన్‌యాన్ కార్యక్రమం గురించి ప్రధాని మోడీ 2018 నాటి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రస్తావించారు.

ఈ ఏడాది పాతిక ప్రయోగాలు!

భవిష్యత్తు కార్యక్రమాల గురించి శివన్ వివరించారు. ఈ ఏడాది మొత్తం పాతిక పరీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. గడిచిన ఏడాది పూర్తికాకుండా ఉన్న వాటిని ఈ మార్చిలోగా పూర్తి చేయాలని సంకల్పించారు. తమిళనాడులోని తూత్తుకుడిలో ఇస్రో ప్రయోగ వేదికకు స్థల సేకరణ జరిగిందని తెలిపారు. శ్రీహరికోటలో ఇప్పటికే ఇస్రోకు సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో ఒక స్పేస్ పోర్టు ఉంది. గడిచిన ఏడాది ఇస్రో ప్రధానంగా విస్తరణ కార్యక్రమాలకు ప్రాధాన్యతను ఇచ్చింది. ఇదే సమయంలో తలపెట్టిన కార్యక్రమాల అమలుకు సామర్థ్యతను పెంచే దిశగా యత్నించామని శివన్ తెలిపారు.

రూ 14,000 కోట్ల కేటాయింపుల డిమాండ్

పలు రకాల అంతరిక్ష ప్రయోగాల కోసం కేంద్ర ప్రభుత్వానికి వ్యయ అంచనాలను తెలిపింది. 2020–21 కేంద్ర బడ్జెట్‌లో రూ 14000 కోట్లు కావాలని సంస్థ అభ్యర్థించింది.

వేగం తగ్గింపుతోనే వైఫల్యం

చంద్రయాన్ 2లో వైఫల్యానికి ల్యాండర్ విక్రమ్ వేగం తగ్గింపే కారణమని శివన్ తెలిపారు. ఈ ప్రయోగంలో వైఫల్యాలపై విలేకరులు అడిగిన ప్రశ్నకు శివన్ స్పందించారు. వేగం తగ్గింపు కేవలం అంతర్గత కారణాల వల్లనే జరిగిందని అంగీకరించారు. చంద్రుడి ఉపరితలంపైకి ప్రయోగాలలో చంద్రయాన్ 2 తొలి ప్రయోగం . చంద్రుడి ఉపరితలపు దక్షిణ ధృవంపై ల్యాండర్‌ను దింపేందుకు యత్నించారు. అయితే ఇది విఫలం అయింది. విక్రమ్ ల్యాండర్‌ను గుర్తించడంలో విజయం సాధించిన చెన్నైకు చెందిన యువ ఇంజనీర్‌ను శివన్ అభినందించారు. కూలిన పరికరం ఫోటోను విడుదల చేసే పద్ధతి అంతరిక్ష సంస్థకు లేనందున దీని తదుపరి ఫోటోను వెలువరించలేదని వివరించారు.

చంద్రయాన్–3కి రూ.600కోట్లు ఖర్చు

చంద్రయాన్ 3 ఇంతకు ముందటి చంద్రయాన్ 2ను పోలి ఉంటుంది. ఇందులో కూడా ల్యాండర్, రోవర్, ఇంధన శక్తి ఏర్పాట్లు ఉంటాయి. దేశాభివృద్ధికి ఉపయోగపడే ఉపగ్రహ ప్రయోగాలకు సంస్థ ప్రాధాన్యతను ఇస్తుందని శివన్ చెప్పారు. ఇటు చంద్రయాన్ 3, అటు గగన్‌యాన్‌ల కోసం ఏకకాలంలో అన్ని స్థాయిల పనులు జరుగుతున్నాయి. చంద్రయాన్ 3లో ఆర్బిటార్ ఉండదని, చంద్రయాన్ 2లో పంపించిన ఆర్బిటార్ సక్రమంగా ఉన్నందున, మరో ఏడేళ్లు ఇది పనిచేసే వీలున్నందున కొత్త ఆర్బిటార్ అవసరం లేదన్నారు. ముందుగా ఈ ఏడాదే చంద్రయాన్ 3 ఉంటుందని అనుకున్నామని, అయితే ఈ ప్రాజెక్టుకు కనీసం 14 నుంచి 16 నెలల సమయం పడుతుందని, ఈ మేరకు వచ్చే ఏడాదే దీనిని కక్ష్యలోకి పంపించడం సాధ్యమవుతుందని వివరించారు. చంద్రయాన్ 3 ఇంతకు ముందటి చంద్రయాన్ 2ను పోలి ఉంటుంది. ఇందులో కూడా ల్యాండర్, రోవర్, ఇంధన శక్తి ఏర్పాట్లు ఉంటాయి. దేశాభివృద్ధికి ఉపయోగపడే ఉపగ్రహ ప్రయోగాలకు సంస్థ ప్రాధాన్యతను ఇస్తుందని శివన్ చెప్పారు. ఇటు చంద్రయాన్ 3, అటు గగన్‌యాన్‌ల కోసం ఏకకాలంలో అన్ని స్థాయిల పనులు జరుగుతున్నాయి. చంద్రయాన్ 3 ప్రయోగానికి అవసరమయ్యే మొత్తం ఖర్చును ఇప్పటికి రూ 615 కోట్లుగా అంచనా వేశారు. చంద్రయాన్ 2కు అయిన వ్యయం రూ 960 కోట్లు. ల్యాండర్, రోవర్, ప్రొపుల్సన్ మాడ్యూల్‌కు కలిపి రూ 250 కోట్లు, ఇక ప్రయోగానికి అయ్యే ఖర్చు రూ 365 కోట్లుగా అంచనావేశారని, మొత్తం మీద వ్యయం రూ 600 కోట్లు దాటుతుందని ఇస్రో ఛైర్మన్ వివరించారు.

మేం రాజకీయాలకు దూరం

స్పష్టం చేసిన సిడిఎస్ బిపిన్ రావత్

న్యూఢిల్లీ: దేశ సాయుధ దళాలు రాజకీయాలకు చాలా దూరంగా ఉంటాయని, కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ఆదేశాల మేరకే వ్యవహరిస్తాయని రక్షణ దళాల అధిపతి (చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ –సిడిఎస్) జనరల్ బిపిన్ రావత్ బుధవారం స్పష్టం చేశారు. సిడిఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి ఆయన మీడియాతో మాట్లాడారు. త్రివిధ దళాలు – సైన్యం, వైమానిక దళం, నావికాదళం మధ్య అనుసంధానాన్ని, సమానతను పెంపొందించడమే తన మొదటి కర్తవ్యమని రావత్ చెప్పారు.

రాజకీయాలకు దూరంగా...

సైన్యంలో రాజకీయాలు, సిడిఎస్ పదవిని సృష్టించడంపై కాంగ్రెస్ లేవనెత్తిన ప్రశ్నలపై జనరల్ రావత్ స్పందించారు. 'మేము రాజకీయాలకు దూరంగా, బాగా దూరంగా ఉన్నాం' అని పేర్కొన్నారు. 'సిడిఎస్ పదవిని స్వీకరించడం మీకెలా ఉంది?' అని అడగ్గా – 'నా తలపై భారం తగ్గిందనిపిస్తోంది. నేను 41 సంవత్సరాలు గూర్ఖా హ్యాట్‌తో పనిచేశాను. ఇప్పుడది లేదు. ఇప్పటి పదవి మూడు దళాలకు తటస్థమైంది' అని సిడిఎస్ తెలిపారు.

1+1+1 కాదు 5 లేదా 7

'మూడు సాయుధ దళాలు ఒక టీమ్‌గా పనిచేస్తాయని మీకు చెప్పాలనుకుంటున్నాను. వాటిపై సిడిఎస్‌కు నియంత్రణ ఉంటుంది. కానీ ఏది చేసినా టీమ్‌గా కలిసే చేస్తాము' అన్నారు. ఈ ఏకీకరణను కేవలం మూడు దళాల కలయికగానే చూడకూడదని, అంతకంటే ఎక్కువనీ జనరల్ రావత్ పేర్కొన్నారు. 'నా ఆదేశాల ప్రకారమే అంతా జరగాలనుకోవడం లేదు. సమైక్యత అవసరం. మూడు దళాల్ని ఏకీకృతం చేసి, సామర్థ్యాన్ని పెంచడమే నా బాధ్యత. ఇప్పుడు రక్షణశక్తి 1+1+1 కాదు . అది 5 లేదా 7' అన్నారు. త్రివిధ దళాలకు కేటాయించిన వనరుల్ని సాధ్యమైనంత గరిష్ఠంగా వాడుకునేందుకు ప్రయత్నిస్తామన్నారు.

త్రివిధ దళాల నుంచి గౌరవ వందనం

సిడిఎస్ గా పదవీ స్వీకారం సందర్భంగా జనరల్ బిపిన్ రావత్ త్రివిధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. సైనిక దళాధిపతి జనరల్ మనోజ్ ముకుంద్ నరవానే, వైమానిక దళాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ రాకేష్ కుమార్ సింగ్ భదౌరియా, నౌకాదళం చీఫ్ అడ్మిరల్ కరంబీర్ సింగ్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.



ఢిల్లీలో త్రివిధ దళాల అధిపతులతో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ బిపిన్ రావత్ (కుడి నుంచి రెండో వ్యక్తి)

పాక్ కట్టడికి పక్కా వ్యూహాలు

- చైనాతో సరిహద్దు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది
- సేనల ఆధునీకరణకు ప్రాధాన్యత : కొత్త ఆర్మీ చీఫ్ మనోజ్ ముకుంద్

న్యూఢిల్లీ : ఉగ్రవాదులకు మద్దతిస్తున్న పాకిస్తాన్‌ను కట్టడి చేయడానికి భారత్ వద్ద పకడ్బందీ వ్యూహాలు ఉన్నాయని కొత్త ఆర్మీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవాణే అన్నారు. భారత్ చేపట్టిన దాడుల్లో పెద్ద ఎత్తున ఉగ్రవాదులు హతమవ్వడం పాక్ ఆర్మీకి పెద్ద ఎదురుదెబ్బ అని తెలిపారు. చైనా సరిహద్దులో భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేయనున్నామని తెలిపారు. నూతన ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన పిటిఐకి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఉగ్రవాదులపై పాక్ చూపిస్తున్న అలసత్వానికి ప్రపంచ దేశాలు కూడా పాక్‌కు దూరమయ్యాయని, ఉగ్రవాదం ఏ విధంగా నష్టదాయకమో ప్రపంచ దేశాలు గ్రహించాయని తెలిపారు. దేశంలో భద్రత వ్యవస్థను పటిష్టం చేసి ఎప్పుడు ఏ సమస్య వచ్చినా ఆర్మీని సిద్ధం చేయడమే తమ లక్ష్యమన్నారు. మానవ హక్కులను కాపాడడానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని ముకుంద్ నరవాణే తెలిపారు. చైనాతో సరిహద్దు సమస్యలకు త్వరలోనే శాశ్వత సానుకూల పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు ప్రధాన దేశాలతో భారత్ సరిహద్దులు పంచుకుంటోందని, ఇరు దేశాలూ సమాన ప్రాధాన్యత కలిగినవేనని ఆయన అన్నారు. గతంలో మనం పశ్చిమ ప్రాంతంవైపే దృష్టిసారించామని, ఉత్తర ప్రాంతం కూడా అంతే ప్రాధాన్యత కలిగి ఉందని గుర్తించాలన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ స్వాధీనంపై రాజకీయ నేతలు తరచూ చేస్తున్న ప్రకటనలపై స్పందిస్తూ అన్ని సవాళ్లు, వ్యూహాలపై సైన్యం విశ్లేషిస్తుందని, ఇది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. సేనల ఆధునీకరణ ప్రణాళికలకు కీలక ప్రాధాన్యత ఇస్తామని చెప్పుకొచ్చారు. సవాళ్లకు అనుగుణంగా దీర్ఘకాల వ్యూహాలతో ముందుకెళతామని, సేనలకు ఎదురయ్యే సవాళ్లలో మార్పులకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తామని అన్నారు.

చిరస్మరణీయ సంస్కరణలు

- సిడిఎస్ పదవి, రక్షణ వ్యవహారాల శాఖపై ప్రధాని మోడీ
- చరిత్రాత్మకం: హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్య

న్యూఢిల్లీ: సైనిక వ్యవహారాల శాఖ ఏర్పాటు, రక్షణ దళాల అధిపతి పదవిని వ్యవస్థీకృతం చేయడం చిరస్మరణీయమైన సంస్కరణలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ బుధవారం పేర్కొన్నారు. దేశపు మొదటి రక్షణ దళాల అధిపతిగా (సిడిఎస్) నియమితులైన జనరల్ బిపిన్ రావత్‌ను మోడీ అభినందించారు. దేశానికి గొప్ప నిబద్ధతతో, ఆసక్తితో పనిచేసిన అగ్రశ్రేణి అధికారి బిపిన్ రావత్ అని ప్రధాని ప్రశంసించారు. 'సైనిక నైపుణ్యానికి అనుగుణంగా సైనిక వ్యవహారాల శాఖను ఏర్పాటు చేయడం, సిడిఎస్ పదవిని వ్యవస్థీకృతం చేయడం చిరస్మరణీయం. ఆధునిక యుద్ధ రీతుల్లో ఎప్పటికప్పుడు ఎదురయ్యే కొత్త సవాళ్లను దేశం ఎదుర్కొనేందుకు ఈ సమగ్ర సంస్కరణ తోడ్పడుతుంది' అని ప్రధాని మోడీ ట్వీట్ చేశారు.

ఇది చరిత్రాత్మకం: అమిత్ షా

సిడిఎస్ పదవిని సృష్టించడం చరిత్రాత్మకం, చిరస్మరణీయం అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. త్రివిధ సాయుధ దళాల సంక్షేమం దిశగా నరేంద్రమోడీ ప్రభుత్వం చేసే కృషిని ఇది ముందుకు తీసుకెడుతుందని అన్నారు. ఈ అంశంపై వరసగా ట్వీట్లు చేస్తూ కేంద్ర హోంమంత్రి – తొలి సిడిఎస్ నియామకంతో చిరకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న మరో డిమాండ్ నెరవేరినట్టయిందని ప్రశంసించారు. 'సైనిక సంక్షేమం పరంగానే కాక, మన సాయుధ దళాల్ని ఆధునీకరించేందుకు, నవ భారతం ఆకాంక్షలు నెరవేరేందుకు కూడా ఇది బాట చూపుతుంది. ప్రపంచంలోనే ఉత్తమ రక్షణ వ్యవస్థల్లో భారతదేశం ఒకటి కావడానికి దేశానికి కావలసిన శక్తి ఈ నిర్ణయం ద్వారా సమకూరుతుంది' అన్నారు అమిత్ షా. ఈ సందర్భంగా ఆయన బిపిన్ రావత్‌ను అభినందించారు.



రాజ్యాంగస్ఫూర్తికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలి

యుటిఎఫ్ డైరీ ఆవిష్కరణలో చుక్కా రామయ్య

మన తెలంగాణ/హైదరాబాద్ : వర్తమాన సామాజిక పరిస్థితుల్లో రాజ్యాంగ స్ఫూర్తిని గ్రహించి అందుకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని ప్రముఖ విద్యావేత్త డాక్టర్ చుక్కా రామయ్య అన్నారు. బుధవారం టిఎస్‌యుటిఎఫ్ 2020 డైరీ, క్యాలెండర్‌ను ఎంఎల్‌సి నర్సిరెడ్డితో కలిసి చుక్కా రామయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లలందరికీ నాణ్యమైన, సమానమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎంఎల్‌సి అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ, గత 40 ఏళ్లుగా యుటిఎఫ్ డైరీ వెలువడుతుందని అన్నారు. ఉపాధ్యాయులను చైతన్య పరచడంలో, వృత్తి నైపుణ్యాలను పెంపొందించడంలో ఈ డైరీ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె. జంగయ్య అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి చావ రవి, రాష్ట్ర కార్యదర్శులు ఎస్‌వై కొండల్‌రావు, ఆర్.ఆంజనేయులు, ఇ.గాలయ్య, ఆర్. శారద, పత్రిక ప్రధాన సంపాదకులు పి.మాణిక్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుపతి, నర్సాపూర్, కాకినాడల మధ్య

91 ప్రత్యేక రైలు సర్వీసులు

మనతెలంగాణ/హైదరాబాద్: సంక్రాంతి పండుగ,సెలవుల సిజన్ ప్రారంభమైతున్న సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల రద్దీ నివారణకు వివిధ మార్గాలల్లో 91 ప్రత్యేక రైళ్లు నడుస్తాయని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఇందులో తిరుపతి–నర్సాపూర్‌ల మధ్య నేటి నుండి 31మార్చి వరకు 78 ప్రత్యేక రైళ్లు నడుస్తాయని తెలిపారు. ఈ మార్గంలో ప్రత్యేక రైళ్లు ప్రతి గురు, మంగళ, ఆదివారం రోజులల్లో తిరుపతి రైల్వే స్టేషన్ నుండి సాయంత్రం 6:50గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 5:40గంటలకు నర్సాపూర్ రైల్వే స్టేషన్ చేరుకుంటాయి. ఈ ప్రత్యేక రైళ్లు తిరుగు ప్రయాణంలో నర్సాపూర్ రైల్వే స్టేషన్ నుండి 3 జనవరి నుండి 1ఏప్రిల్ వరకు నడుస్తాయని తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లు నర్సాపూర్ రైల్వే స్టేషన్‌లో రాత్రి 10గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 8:45గంటలకు తిరుపతి రైల్వే స్టేషన్ చేరుకుంటాయి. అలాగే సికింద్రాబాద్–నర్సాపూర్‌ల మధ్య ఆరు ప్రత్యేక రైళ్లు సర్వీసులు 10 జనవరి నుండి 19వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని వివరించారు. అలాగే సికింద్రాబాద్–కాకినాడల మధ్య 10 జనవరి నుండి19వ తేదీ వరకు నడుస్తాయని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రైల్వేబోర్డు ఛైర్మన్ పదవీకాలం పొడిగింపు

న్యూఢిల్లీ: రైల్వేబోర్డు ఛైర్మన్ వినోద్‌కుమార్ యాదవ్ పదవీకాలం మరో ఏడాది పాటు పొడిగించడంతో ఆయన బుధవారం ఛైర్మన్‌గా మళ్లీ బాధ్యతలు స్వీకరించారు. ఈ విధంగా తన పదవీకాలం పొడిగింపును పొందిన మొట్టమొదటి సిఇఒగా ఆయన గుర్తింపు పొందారు. భారీ పరిపాలనా నిర్వహణ పునర్ వ్యవస్థలో భాగంగా రైల్వేలో ఈ పదవిని ఇటీవలనే సృష్టించారు. ఛైర్మన్‌గా ఏడాది పాటు తన పదవీ కాలానికి పొడిగింపు పొంద గలిగారు. ఈ పునర్వ్యవస్థీకరణకు కేంద్ర కేబినెట్ ఇటీవలనే ఆమోదించింది. మొదటిసారి యాదవ్ రైల్వే బోర్డు ఛైర్మన్‌గా, ప్రభుత్వ ఎక్స్ అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీగా 2019 జనవరి 1న నియామకమయ్యారు. అంతకు ముందు ఆయన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా, పని చేశారు.

ఈ నెల 20న పరీక్షలపై ప్రధాని ఇష్టాగోష్టి

న్యూఢిల్లీ : ప్రధాని మోడీ మరోసారి గురు అవతారం ఎత్తనున్నారు. పరీక్షలలో ఒత్తిళ్లను అధిగమించడం ఎలా? అనే అంశంపై ఈ నెల 20న విద్యార్థులతో, అధ్యాపకులతో ముచ్చటించనున్నారు. ఈ విషయాన్ని కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ బుధవారం తెలిపింది. ముందుగా ప్రకటించిన దాని ప్రకారం సంబంధిత పరీక్షా పే చర్చా కార్యక్రమం ఈ నెల 16వ తేదీన జరగాల్సి ఉంది. అయితే సంక్రాంతి, లోహ్రీ, ఓనమ్ ఇతర పర్వదినాలను దృష్టిలో పెట్టుకుని , దీనిని మరికొంత విస్తృతపర్చి 20వ తేదీకి వాయిదా వేశారు. విద్యార్థులు పరీక్షల సమయంలో ఎటువంటి ఒత్తిళ్లకు గురి కారాదు. వారిలో ఉండే పరీక్షల ఫివర్‌ను తొలిగించాలనే తపన ప్రధానిలో ఉందని, ఇందుకు అనుగుణంగానే విద్యార్థుల నుంచి సత్ఫలితాల దిశలో ప్రధాని ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారని మంత్రిత్వశాఖ వర్గాలు తెలిపాయి.

భారత్‌కుపాక్ అణుకేంద్రాల సమాచారం

ఇస్లామాబాద్ : భారత్, పాక్ ద్వైపాక్షిక ఒప్పందం ప్రకారం పాకిస్థాన్ బుధవారం అణుకేంద్రాల సమాచారాన్ని భారత్‌కు అందజేసింది. భారత్, పాకిస్థాన్ మధ్య అణుకేంద్రాలపై దాడుల నిషేధం, రెండు దేశాల మధ్య సమాచార వినిమయ సంబంధ ఒప్పందం 1988 డిసెంబర్ 31 న కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం భారత రాయబార కార్యాలయ అధికారులకు బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో పాక్ తన అణుకేంద్రాల జాబితాను సమర్పించింది. ఒప్పందం ప్రకారం ఏటా జనవరి 1న ఈ సమాచారాన్ని అందచేయవలసి ఉంటుంది.

పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

మన తెలంగాణ/పంజాగుట్ట : పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ ఎదుట మంగళవారం పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న మహిళ లోకేశ్వరి ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నైకి చెందిన లోకేశ్వరి (37) 2000లో శ్రీనివాస్ అనే వ్యక్తిని వివాహం చేసుకుంది. వీరికి ఒ కుమార్తె కూడా ఉంది. గత ఎనిమిది నెలల క్రితం భర్త లోకేశ్వరిని వదిలేసి వెళ్లిపోయాడు. అప్పటినుంచి తన కుమార్తె తో కలసి లోకేశ్వరి చెన్నైలో ఉంటున్న తన తల్లి దగ్గర ఉంటుంది. అయితే తిరుపతిలో మహబూబ్ నగర్ కు చెందిన వ్యాపారి ప్రవీణ్ కుమార్‌గౌడ్‌తో లోకేశ్వరికి పరిచయం ఏర్పడింది. ప్రవీణ్‌గౌడ్ లోకేశ్వరిని హైదరాబాద్‌లోని ఓ బంగారు దుకాణంలో పనికి పెట్టించాడు. ఈ క్రమంలో బంగారం చోరీ చేసినట్టు దుకాణం యజమాని లోకేశ్వరిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆమెను అరెస్టు చేసి, నగలను రికవరీ చేశారు. అనంతరం ఆమెను జైలుకు పంపించారు. జైలు నుంచి విడుదలై వచ్చిన తరువాత లోకేశ్వరి, ప్రవీణ్‌కుమార్ మధ్య గొడవలు జరగడంతో ఆమె చెన్నైలోని తన తల్లి వద్దకు వెళ్లిపోయింది. తనను ప్రవీణ్‌కకుమార్ మోసం చేశాడని ఫిర్యాదు చేసేందుకు మంగళవారం పంజాగుట్ట పోలీసు స్టేషన్‌కు వచ్చింది. ఒక్కసారిగా ఆమె తన ఒంటిపై కిరోసిన్ పోసుకుని, నిప్పంటించుకుంది. దీంతో వెంటే పోలీసులు ఆమెను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ప్రవీణ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

బాగ్దాద్ : బాగ్దాద్ లోని అమెరికా రాయబార కార్యాలయంపై ఇరాన్ మద్దతు ఆందోళనకారులు దాడి జరపడంతో అమెరికా భగ్గు మంది. మంగళవారం అమెరికా విమాన దాడులకు రెండు డజన్ల మంది పోరాట యోధులు మరణించడంతో ఆందోళన కారులు అమెరికా రాయబార కార్యాలయంపై దాడికి పాల్పడ్డారు. ఇరాక్ నుంచి అమెరికా బలగాలు తొలగి పోవాలని డిమాండ్ చేశారు. అమెరికన్లు చనిపోతే దానికి తగిన శిక్ష ఎదుర్కోవలసి వస్తుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టెహ్రాన్‌ను హెచ్చరించారు. మరణాలకు ఇతర నష్టాలకు ఇరాన్ పూర్తి బాధ్యత వహించక తప్పదని ట్రంప్ ట్విట్టర్ ద్వారాహెచ్చరించారు.

ఆస్తులపై మరోసారి దర్యాప్తు

- ఇఎస్‌ఐ స్కాంలో దేవికారాణి కుమారుడి వాటాలపై ఎసిబి ఆరా!
- ఫార్మా కంపెనీలపై లోతైన విచారణ

మనతెలంగాణ/హైదరాబాద్ : ఇఎస్‌ఐ స్కామ్ కేసులో మాజీ దేవికారాణి మూడేళ్ల కాలంలో రూ. 200 కోట్ల మేరకు అక్రమంగా ఆర్జించిన వైనంపై ఎసిబి మరోసారి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టనుంది. ఈ శ్కాంలో ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రైవేటు వ్యక్తుల ప్రమేయంపై ఎసిబి అధికారులు విచారణ చేపట్టడంతో పాటు పలువురు ఫార్మా కంపెనీల అధినేతలను అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ మెడికల్ శ్కాంలో ప్రధాన నిందితురాలు దేవికారాణితో పాటు ఈ కేసులో అరెస్ట్ అయిన 20 మంది నిందితుల ఆస్తులపై, లావాదేవీలపై ఎసిబి అధికారులు విచారణ చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఇఎస్‌ఐలోని ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ కుంభకోణం కేసుకు సంబంధించి అవినీతి నిరోధక శాఖ అధికారులు దర్యాప్తులో భాగంగా తనిఖీలు, సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ కేసులో డైరెక్టర్ దేవికా రాణితో పాటు పలువురిని అరెస్టు చేసిన అనంతరం పోలీసు కస్టడీలో నిందితులు వెల్లడించిన విషయాలపై లోతైన దర్యాప్తు చేపట్టనున్నారు. దేవికా రాణి డొల్ల కంపెనీల వ్యవహారంలో తాజాగా ఇఎస్‌ఐలో తెల్ల రక్తకణాల కిట్స్‌కొనుగోలులో భారీ అవినీతి జరిగినట్లు ఎసిబి అధికారులు గుర్తించారు. ఇఎస్‌ఐ మాజీ డైరెక్టర్ దేవికారాణి, జాయింట్ డైరెక్టర్ పద్మల అవినీతిపై మరోసారి దర్యాప్తు చేపట్టిన ఎసిబి అధికారులు షెల్‌కంపెనీల పేరుతో ఓమ్ని చైర్మన్ శ్రీహరిబాబు రూ.110 కోట్ల కొల్లగొట్టిన విషయాలను గుర్తించారు. దీంతో లెజెండ్ అనే డొల్ల కంపెనీ ఏర్పాటు చేసి ఆ సంస్థ నుంచి ఔషధాలు, రక్తపరీక్షల కోసం వినియోగించే కిట్లు కొనుగోలు చేసినట్లు పత్రాలు సృష్టించి కొల్లగొట్టిన మొత్తాలో నిందితుల వాటాలపై విచారణ సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓమ్ని ఎండి , ఇఎస్‌ఐ మాజీ డైరెక్టర్ దేవికారాణి, జాయింట్ డైరెక్టర్ పద్మలు వ్యూహాత్మకంగా డొల్ల కంపెనీకి కృపాసాగర్ రెడ్డి అనే వ్యక్తిని ఎండిగా నియమించి కేవలం రెండు ఒప్పంద పత్రాల్లోనే రూ.110 కోట్ల విలువైన ఔషధాలు కొనుగోలుకు సహకరించిన వారిని గుర్తించనున్నారు. ఈక్రమంలో తేజ ఫార్మా కంపెనీతో రాజేశ్వర్ రెడ్డి తమ్ముడు శ్రీనివాసరెడ్డి పేరిట రెండు షెల్ కంపెనీల లావాదేవీలపై ఎసిబి అధికారులు ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. ఇందులో భాగంగా 2013 వరకు తేజ ఫార్మ వ్యాపారంలో ఏమాత్రం రాణించని సంస్థ ఒక్కసారిగా కోట్లాది రూపాయలు ఎలా వచ్చాయన్న కోణంలో విచారిస్తున్నారు. ఇందులో భాగంగా



తేజాఫార్మలో దేవికారాణి తనకు కుమారుడిని వాటాదారునిగా చేసి మందుల కొనుగోళ్లు జరిపినట్లు లభ్యమైన పత్రాలతో పాటు ఒరిజిన్ ఫార్మా,సెరిడియా కంపెనీలలో వాటా దారునిగా చేసి పెద్ద ఎత్తున ఆయా కంపెనీల నుంచి వైద్య పరికరాలు, మందులు కొనుగోలు చేసినట్లు ఎసిబి అధికారుల దర్యాప్తులో తేలినట్లు సమాచారం. దేవికారాణి ఇఎస్‌ఐ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన 2014 నుంచి ప్రభుత్వ ధనాన్ని దిగిమింగసాగిందని, బినామి మెడికల్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలతో చేతులు కలిపి మందులు సరఫరా కానప్పటికీ బిల్లులు సృష్టించి ప్రభుత్వ ధనాన్ని కొల్లగొట్టిన వైనంపై విచారణ సాగుతోంది. మందుల వైద్య పరికరాల స్టాక్ ఎంట్రి రికార్డులో తన చేతి వాటం చూపుతూ దశల వారీగా రూ.200 కోట్ల మేర అక్రమంగా ఆర్జించినట్లు అధికారులు గుర్తించిన ఎసిబి అధికారులు 2018 జూలైలో ఒక్కసారిగా నకిలీ బిల్లులు సమర్పించి రూ.60 కోట్లు అబిడ్స్‌లోని పే అండ్ అకౌంట్స్ విభాగం నుంచి రహస్యంగా తరలించిన వైనంపై విచారణ సాగిస్తున్నారు. ఈ కుంభకోణంలో అధికారులు ఇప్పటికే 21 మందిని ఎసిబి అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ శ్కాంలో మిగిలిన వారిని సైతం అనతికాలంలో అరెస్టు చేసే అవకాశముందని ఎసిబి వర్గాలు వెల్లడిస్తున్నాయి

నిధుల విడుదలపై విచారణ

ఇఎస్‌ఐ డైరెక్టర్‌గా దేవికారాణి విధులు చేపట్టిన కాలంలో ప్రభుత్వం దాదాపు 500 కోట్ల రూపాయలు కేవలం మందుల కొనుగోలుకు విడుదల చేసినట్లు గుర్తించిన ఎసిబి అధికారులు ఆ దిశగా ఆయా మొత్తాలు ఎవరికి చెల్లించారన్న సమాచారం సేకరించారు. ముఖ్యంగా 2015, 2016 కాలంలో ప్రభుత్వం రూ. 143 కోట్లు, 2016,2017 కాలంలో రూ. 120 కోట్లు. 2017 నుంచి 2018లో రూ. 208 కోట్ల రూపాయల మేర బడ్జెట్ నుంచి విడుదలైన నిధుల వినియోగంపై ఆరా తీస్తున్నారు. అదేవిధంగా ఇఎస్‌ఐ ఆస్పత్రులకు మందులు, వస్తువులు, మిషనరీల కొనుగోలులో నిబంధనలు ఉల్లంఘించి అంశాలపై విచారణ మరోసారి చేపట్టనున్నారు. అదేవిధంగా ఇఎస్‌ఐ డైరెక్టర్ దేవికారాణి అక్రమాలలో భాగంగా పుట్టుకొచ్చిన బినామీ కంపెనీలైన పృథ్వి ఎంటర్ ప్రైజెస్, మైత్రి ఫార్మా, మహిధర మెడికల్, సర్జికల్స్, ఆర్‌ఆర్ ట్రేడర్స్, వైష్ణవ ఎంటర్‌ప్రైజెస్, గాయత్రి ఫార్మా, వసుధా మార్కెటింగ్ ఫార్మాస్యుటికల్, సర్జికల్ డిస్ట్రిబ్యూటర్స్, సికోత్రిక్ ఫార్మా, స్వస్తిక్ ఫార్మాస్యుటికల్స్, హిమాలయఫార్మా, శ్రీరామ ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్, గాయత్రి ఫార్మాలున్నాయని వాటిపై మరోసారి దాడులు సోదాలు నిర్వహించేందుకు ఎసిబి అధికారులు సమాయత్తమౌతున్నారన్నది విశ్వసనీయ వర్గాల సమాచారం.

అక్రమాస్తులపై మరోసారి దర్యాప్తు

ఇఎస్‌ఐ కుంభకోణంలో డైరెక్టర్ దేవికారాణి అక్రమంగా ఆర్జించిన స్థిర చరాస్తులపై ఎసిబి విభాగంలోని ప్రత్యేక అధికారులు మరోసారి విచారణ చేపడుతున్నారు. ఇందులో భాగంగా దేవికారాణికి సంబంధించిన రాజ్‌భవన్ రోడ్‌లో సేథి బిల్డర్‌లో రూ.3 కోట్ల ఖరీదైన ఫ్లాట్, షేక్‌పేట్ గ్రామంలోని ఆదిత్యాబిల్డర్‌లో రూ. 9.5కోట్ల విల్లా , అమరావతిలోని లిమెల్లె గ్రామంలో 10.000గజాల స్థలం (విలువ రూ.20కోట్లు), ఉప్పల్ సమీపంలోని నారపల్లిలో 3 ఎకరాల భూమి(విలువ రూ. 11కోట్లు), మహేశ్వరం మండలంలోని కందుకూరు గ్రామంలో 20 ఎకరాల భూమి(విలువ రూ.44కోట్లు), 2014 నుంచి 2018 మధ్య కాలంలో రూ.3 కోట్ల డైమండ్స్ కొనుగోలు చేసిన ఆస్తులపై ఎసిబి అధికారులు ప్రత్యేక దర్యాప్తు చేపడుతున్నారు.

మరో ఇద్దరి అరెస్ట్

ఇఎస్‌ఐ శ్కాంలో ప్రభుత్వ అధికారులతో కలిసి అక్రమాలకు పాల్పడిన ఓమ్ని మెడి ఎండి కంచర్ల శ్రీహరి, హోమోక్యు రీజినల్ మేనేజర్ టంకశాల వెంకటేశ్‌లను ఎసిబి అధికారులు బుధవారం నాడు అరెస్ట్ చేశారు. నిందితులపై సెక్షన్ 7,13(1)(సి)(డి), 7(ఎ)(సి) అవినీతి నిరోధక చట్టం 1988 రెడ్‌విత్ 7(ఎ), 13(1)(ఎ) 12,13(2) (పిసి యాక్ట్ 2018) 420, 120.బి, 34 ఐపిసి కింద కేసులు నమోదు చేశారు. అనంతరం ఓమ్ని మెడి ఎండి కంచర్ల శ్రీహరి, హోమోక్యు రీజినల్ మేనేజర్ టంకశాల వెంకటేశ్‌లను ఎసిబి కోర్టులో హాజరుపర్చగా కోర్టు 14రోజులు రిమాండ్‌కు విధించడంతో పోలీసులు చంచల్‌గూడా జైలుకు తరలించారు. లెజెండ్ ఎంటర్ ప్రైజెస్ నుంచి మెడికల్ కిట్లు, వస్తు సామాగ్రి 400 రెట్లు అధిక మొత్తాలు వెచ్చించి కొనుగోలులో చేయడంలో కంచర్ల శ్రీహరి కీలక పాత్రపోషించినట్లు ఎసిబి విచారణలో తేలింది. హోమోక్యులో తయారైన డబ్ల్యుబిసి క్యువెట్స్, గ్లూకోజ్ క్యువెట్స్, గ్లూకోజ్ ప్రతి యూనిట్‌కు వరుసగా రూ.11,800, రూ.1950 చొప్పున పంపిణీదారులకు సరఫరా చేశారు. అయితే ఇదే వస్తువులను రూ. 19,200, రూ.2,250 చొప్పున సరఫరా చేశారు. లెజెండ్ ఎంటర్‌ప్రైజెస్ పైన పేర్కొన్న వస్తుసామాగ్రిని డైరెక్టర్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్‌కు రూ. 36,800, రూ.6,200 ప్రకారం సరఫరా చేసినట్లు ఎసిబి విచారణలో వెలుగుచూసింది. అదే విధంగా తద్వారా యూనిట్‌కు వరుసగా రూ. 17,600, రూ. 3,500 చొప్పున బిల్లులు వసూలు చేశారు. ఈక్రమంలో 2017,2018 కాలంలో 6291 యూనిట్ల డబ్ల్యుబిసి క్యూవెట్స్ హోమోక్యూ సరఫరా చేసి రూ.11,07,21,600 మొత్తాలను అధికంగా వసూలు చేసింది. అదేవిధంగా (2017.2018)లలో 4500 యూనిట్ల హోమోక్యూ గ్లూకోజ్ క్యూవెట్లను సరఫరా చేసి 1,77,75,000 అధిక మొత్తాలను వసూలు చేశారు. ఈ నేపథ్యంలో ఇఎస్‌ఐ ఆ రెండు వస్తుసామాగ్రికి సంబంధించి 2017,2018 సంవత్సరంలో రూ. 12,84,96,600 మొత్తాల బిల్లులను చెల్లించింది. కాగా నిందితులు ఇఎస్‌ఐలో ప్రభుత్వ అధికారులతో కుమ్మక్కై వస్తుసామాగ్రి కొనుగోలు చేశారని, ప్రభుత్వ సొమ్మును ఉద్దేశ్య పూర్వకంగా దుర్వినియోగం చేసినట్లు ఎసిబి విచారణలో తేలడంతో ఓమ్ని మెడి ఎండి కంచర్ల శ్రీహరి, హోమోక్యు రీజినల్ మేనేజర్ టంకశాల వెంకటేశ్‌అరెస్ట్ చేశారు.





సిఎఎకు వ్యతిరేకంగా

ఢిల్లీలో పాటలు, పద్యాలతో ప్రదర్శనలు


న్యూఢిల్లీ : పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలు సాగిస్తున్న ఆందోళన కారులకు సంఘీభావం తెలుపుతూ ఢిల్లీ లోని కళాకారులు పాటలు, పద్యాలతో బుధవారం ప్రదర్శనలు సాగించారు. వీరంతా సఫ్దార్ హష్మి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఢిల్లీ లోని కానిస్టిట్యూషన్ క్లబ్ వద్ద సమావేశమై ప్రదర్శనలు సాగించారు. ఈ సందర్భంగా సఫ్దార్ హష్మి సోదరుడు సొహైల్ హష్మి తన సోదరుడు సహీబాబాద్ వద్ద థియేటర్‌లో 1989 జనవరి1న ప్రదర్శనలు ఇస్తుండగా, పాశవికంగా దాడికి గురయ్యాడని, ఆయన జ్ఞాపకార్థం ఏటా ఇదే రోజున ప్రజాస్వామ్య, సెక్యులర్ విలువలను ప్రబోధిస్తూ ప్రదర్శనలు ఇస్తుండడం పరిపాటిగా పేర్కొన్నారు. ఇందుకోసమే సఫ్దార్ హష్మి మెమోరియల్ ట్రస్ట్ 1989 ఫిబ్రవరిలో ఏర్పాటైందని చెప్పారు. ఈరోజు సిఎఎ లేదా కశ్మీర్ ఆర్టికల్ 370 రద్దు అమలుతో మన ప్రజాస్వామ్య విలువలు ప్రమాదంలో పడ్డాయని ఆయన చెప్పారు. ఎవరైతే ధైర్యంగా సిఎఎ లేదా ఇతర రాజ్యాంగ విరుద్ధ నిర్ణయాలను వ్యతిరేకిస్తారో వారికి ఈ ప్రదర్శనలు సృజనాత్మక మద్దతు అందిస్తాయని వివరించారు. రంగస్థల, చలన చిత్ర నటులు ఎంకె రైనా, మాజీ బ్యూరోక్రాట్ హర్ష్ మందిర్, ఆర్థిక వేత్తలు ప్రభాత్ పట్నాయక్; జయతి ఘోష్ తదితరులు ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నారు.

ఇద్దరు భారత సైనికుల మృతి

జమ్మూ: జమ్ముకశ్మీర్‌లోని రాజౌరి జిల్లాలో నియంత్రణ రేఖ వద్ద పాక్ చొరబాటు దార్లకు, భారత సైన్యానికి మధ్య బుధవారం జరిగిన ఎదురెదురు కాల్పుల్లో ఇద్దరు భారత సైనికులు మృతి చెందారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి చొరబాటు దారులు పాకుకుంటూ ఖరిత్రాయత్ అడవుల్లోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తుండగా రెండు వర్గాల మధ్య కాల్పులు జరిగాయి. నౌషెరా సెక్టార్‌లో అనుమానిత ఉగ్రవాదులు సంచరిస్తున్నారన్న సమాచారం అందడంతో తనిఖీలు చేస్తుండగా ఈ సంఘటన జరిగింది.

మనమంతా ఒక్కటే

పాక్ తప్ప ఐదుదేశాల నేతలకు మోడీ నూతన ఏడాది శుభాకాంక్షలు



న్యూఢిల్లీ : నూతన సంవత్సర ఆరంభం నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ పొరుగుదేశాల నేతలకు శుభాకాంక్షలు తెలిపారు. పాకిస్థాన్ మినహాయించి ఆయన 5 పొరుగుదేశాల నాయకులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆయా దేశాలతో సత్సంబంధాల మెరుగుదల దిశలో ఫోన్ కలిపారు. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాతో మాట్లాడుతూ ఇరు దేశాల సంబంధాలు ఇనుమడింపచేసేందుకు పాటుపడుతామని తెలిపారు. బంగ్లా జాతిపిత షేక్ ముజిబుర్ రహ్మాన్ శతజయంతితో భారత్ బంగ్లా మధ్య సంబంధాలు మరింత విస్తృతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పౌరసత్వ చట్టంతో ఈ మధ్యకాలంలో ఇరుదేశాల సంబంధాలు బెడిసికొట్టే పరిస్థితి ఏర్పడింది. అక్రమ వలసదారులందరినీ తిరిగి బంగ్లాదేశ్‌కు తిప్పిపంపుతామని బిజెపి నేతలు చెప్పడం వివాదాస్పదం అయింది. ప్రధాని తమ తాజా ఫోన్ దౌత్యంతో అన్నింటిపైనా సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. భూటాన్, నేపాల్, శ్రీలంక, మాల్దీవుల నేతలతోనూ ప్రధాని ఫోన్‌లో మాట్లాడారు. మొత్తం ఏడు దేశాల నాయకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని పాకిస్థాన్‌ను పట్టించుకోకుండా ఐదు గురు దేశాధినేతలతో వేర్వేరుగా మాట్లాడటం ప్రాధాన్యతను సంతరించుకుంది. పొరుగుదేశాలతో స్నేహానికే తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని ప్రధాని వారితో మాట్లాడిన సందర్భంగా స్పష్టం చేశారు. భూటాన్ రాజు జిగ్మే కేసర్ నంగెయిల్ వాంగ్చ్యూక్‌తో, నేపాల్ ప్రధాని కెపి శర్మ ఓలితో, శ్రీలంక అధ్యక్షులు గొటబాయ రాజపక్సేతో, మాల్దీవుల అధ్యక్షులు ఇబ్రహీం సొలిహ్‌తో వేర్వేరుగా జరిపిన ఫోన్ సంభాషణల నడుమ ఆయా దేశాలతో సంబంధాలను మరింతగా ఇనుమడింపచేసుకుని తీరుతామని తెలిపారు. పాకిస్థాన్, చైనాలను దృష్టిలో పెట్టుకుని భారత్‌కు చుట్టుపక్కల ఉన్న కీలక దేశాల నేతలతో ప్రధాని మోడీ నూతన సంవత్సర దౌత్యానికి దిగారు.

భద్రత పటిష్టతకు ఏ చర్యలు తీసుకున్నా వ్యతిరేకించం: కాంగ్రెస్

న్యూఢిల్లీ : దేశ భద్రతకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నా తాము వ్యతిరేకించబోమని కాంగ్రెస్ బుధవారం స్పష్టం చేసింది. త్రిదళాల సైనికాధిపతిగా జనరల్ బిపిన్ రావత్‌ను ప్రభుత్వం నియమించడంపై పార్టీ నేతలు అధిర్ రంజన్ చౌదరి, మనీష్ తివారీ చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ తనకు తాను దూరమైంది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుష్మితా దేవ్ ఈ సందర్భంగా పాత్రికేయులతో బుధవారం మాట్లాడుతూ దీనిపై ఇదివరకు చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని పేర్కొన్నారు. రావత్ త్రిదళాల సైనికాధిపతిగా తన బాధ్యతలు నెరవేరుస్తారని తాము భావిస్తున్నామని, భద్రత పటిష్టతకు ప్రభుత్వం ఏ చర్య తీసుకన్నా తాము వ్యతిరేకించేది లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీష్ తివారీ, రావత్ నియామకంపై మంగళవారం అనేక ప్రశ్నలు ట్విట్టర్ ద్వారా కురిపించారు. ఈ విషయంలో ప్రభుత్వం తప్పటడుగు వేసిందని వ్యాఖ్యానించారు. వ్యక్తుల కులం, తెగ, వర్గం, మతాలకు అతీతంగా ఉండే సైన్య వ్యవస్థపై రావత్ సిద్ధాంత సంబంధాల ప్రభావం పడకుండా చూడాలని అధిర్ రంజన్ చౌదరి వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదని కాంగ్రెస్ తన భావాన్ని వ్యక్తం చేసింది.

బీమా–కోరేగావ్ యుద్ధానికి 202ఏళ్లు

- ఐదు లక్షలకు పైగా తరలి వచ్చిన జనం
- భారీ భద్రతా ఏర్పాట్లు
- హాజరైన ప్రముఖ నేతలు

పుణే : భీమా కోరెగావ్ వద్ద ఐదులక్షల మందికి పైగా దళితుల సమ్మేళనం జరిగింది. దళితుల విజయానికి 202 ఏళ్ల సంస్మరణ వార్షికోత్సవ ఘట్టం కోలాహలరీతిలో సాగింది. మహారాష్ట్రలోని పుణేకు 40 కిలోమీటర్ల దూరంలోని పెర్నే గ్రామ సమీప ప్రాంతంలో పూర్తి భద్రతా ఏర్పాట్ల మధ్య 1818 నాటి ఆంగ్లేయులు మరాఠాల పోరు సంస్మరణ సభ జరిగింది. పలు ఆదివాసీలు భారీ సంఖ్యలో వణికించే చలిని కూడా లెక్కచేయకుండా ఇక్కడికి తరలివచ్చారు.

రెండేళ్ల క్రితం ఈ సంస్మరణ సభ తీవ్రహింసాకాండకు, తరువాత పోలీసు అణచివేత చర్యలకు దారితీయడం, పోలీసు బలగాలు భారీ స్థాయిలో ఇప్పుడు అన్ని చర్యలూ చేపట్టారు. వేదిక వద్దకు రాష్ట్ర ప్రభుత్వం పదివేల మంది బలగాలను రంగంలోకి దింపింది. ఈ ప్రాంతంలో ఇంటర్నెట్ సేవలను ముందు జాగ్రత్త



చర్యగా నిలిపివేసినట్లు పుణే జిల్లా కలెక్టర్ నవల్ కిశోర్ రామ్ అంతకు ముందు తెలిపారు. వదంతులు వ్యాపించకుండా ఉండేందుకు ఈ చర్యకు దిగారు. ఇక్కడి స్మారక యుద్ధస్తూపం వద్దకు ప్రతి ఏటా ఇదే రోజు (జనవరి 1)న దళితులు భారీ సంఖ్యలో తరలివస్తుంటారు. ఐదు లక్షల మంది దళితులు ఈ ప్రాంతానికి తరలివచ్చినట్లు కొల్హాపూర్ రేంజ్ ప్రత్యేక ఐజి సుహాస్ వాడ్కే తెలిపారు. అయితే ఇది మరింతగా పెరుగుతుందని అంచనా వేశారు. గత ఏడాది మొత్తం పది లక్షల మంది ఈ స్థూపం వద్దకు తరలివచ్చారు. తెల్లవారుజామునే ఈ ప్రాంతానికి ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, ప్రముఖ దళిత నేత ప్రకాశ్ అంబేద్కర్ ఇతరులు తరలివచ్చారు. పుష్పగుచ్ఛాలుంచి దళిత అమరవీరులకు నివాళులు అర్పించారు. పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు కూడా ఇక్కడికి తరలివస్తారని వెల్లడైంది. ఇక్కడి స్థూపాన్ని జయ స్తంభంగా వ్యవహరిస్తారు. అప్పట్లో జరిగిన మూడో ఆంగ్ల – మరాఠా యుద్ధం 202వ సంస్మరణగా ఈసారి లక్షలాది మంది తరలివచ్చినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఈస్ట్ ఇండియా కంపెనీకి చెందిన సైన్యానికి మహర్ దళిత వర్గానికి చెందిన వీరులు మద్దతుగా నిలిచారు. ఈ క్రమంలో అక్కడి అగ్రవర్ణాలైన పెషావర్‌లు ఓటమి పాలయ్యారు. ఈ దళితులను పెషావర్‌లు అంటరాని వారిగా భావించి అణచివేసే వారని, ఈ క్రమంలో పెషావర్లపై దళితులలో ఆగ్రహ జ్వాలలు పెరిగాయని ఈ క్రమంలో దళితులు తాము సాధించిన విజయాన్ని ఇక్కడ ప్రతి ఏటా ప్రతీకాత్మకంగా నిర్వహించుకుంటూ వస్తున్నారని స్థానికులు తెలిపారు. అయితే 2018లో ఈ సంస్మరణ కార్యక్రమం దశలో హింసాత్మక ఘటనలు చెలరేగాయి. ఇటువంటివి జరగకుండా ఈసారి రాష్ట్రంలోని నూతన ప్రభుత్వం స్థానిక పరిస్థితులను అన్ని కోణాల నుంచి పరిశీలించుకుని తగు జాగ్రత్తలు తీసుకుంది. సరైన ఏర్పాట్లు జరిగాయని ప్రకాశ్ అంబేద్కర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

ట్రేడ్

వాల్‌మార్ట్ ఇండియా డిప్యూటీ సిఇఒగా సమీర్ అగర్వాల్




న్యూఢిల్లీ: రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ ఇండియా చీఫ్ బిజినెస్ ఆఫీసర్ సమీర్ అగర్వాల్‌కు పదోన్నతి కల్పిస్తూ డిప్యూటీ సిఇఒగా నియమించింది. బుధవారం నుంచి అగర్వాల్ నియామకం అమల్లోకి వచ్చింది. వాల్‌మార్ట్ ఇండియా సిఇఒ క్రిష్ అయర్‌కు ఆయన రిపోర్ట్ చేసినట్టు కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. వాల్‌మార్ట్ ఇండియా అధికార ప్రతినిధి మాట్లాడుతూ 'సమీర్ అగర్వాల్‌ను వాల్‌మార్ట్ ఇండియా డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమించాం, 2020 జనవరి 1 నుంచి నియామకం అమల్లోకి వస్తుంది' అని తెలిపారు.

త్వరలో సరికొత్త ఒప్పో ఎఫ్15



న్యూఢిల్లీ: చైనాకు చెందిన స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ ఒప్పం ఎఫ్ సిరీస్ ఫోన్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసేందుకు సిద్ధమైంది. త్వరలో రాబోతున్న ఒప్పో ఎఫ్ 15 కూడా అద్భుతమైన డిజైన్‌తో ఎఫ్ సిరీస్ పేరుని కొనసాగించబోతోంది. సరికొత్త ఎఫ్ 15 స్మార్ట్‌ఫోన్ అతి తక్కువ బరువుతో, అద్భుతమైన డిజైన్‌తో ఫ్యాషనబుల్‌గా రాబోతోంది.ఇప్పటివరకు వచ్చిన అన్ని ఫోన్లతో పోలిస్తే ధర, ఫీచర్స్ ప్రకారం ఎలా చూసినా ఒప్పో ఎఫ్ 15 స్మార్ట్‌ఫోన్ అద్భుతంగా ఉండనుంది. వినియోగదారుల కోసం కావాల్సిన ఫీచర్స్‌తో, సరికొత్త ఆవిష్కరణలతో రాబోతున్న ఎఫ్ సిరీస్‌లో ఇంకా మనం ఊహించని ఎన్నో అద్భుతమైన ఫీచర్స్ ఉన్నాయి. స్లీక్ మోడల్‌గా వస్తున్న ఎఫ్ 15 స్మార్ట్‌ఫోన్ ఇప్పటివరకు వచ్చిన అన్ని ఫోన్లను మర్చిపోయేలా చేస్తుంది. 2019కి వీడ్కోలు చెప్తూ కొత్త ఏడాదిని సరికొత్తగా స్వాగతించేందుకు ఒప్పో సిద్ధమైంది. ఎఫ్ సిరీస్ అనగానే అద్భుతమైన డిజైన్, టెక్నాలజీ గుర్తుకొస్తాయి. వీటివల్లే ఎఫ్ సిరీస్ యువతకు బాగా దగ్గరైంది. బాగా నచ్చి పాపులర్ మోడల్ అయ్యింది. వీటిల్లో ఎఫ్ 9 ప్రో, ఎఫ్ 11 ప్రో మోడల్స్ అయితే బాగా నచ్చాయి. ధర ప్రకారం కూడా ఎఫ్ సిరీస్ వినియోగదారులకు అందుబాటులో ఉంది. ఒప్పో సెల్ఫీ ఎక్స్‌పర్ట్ ఎఫ్ సిరీస్‌ని 2016లో లాంచ్ చేశారు. అప్పటి నుంచి ఈ సిరీస్ స్మార్ట్‌ఫోన్ ఇండస్ట్రీలో ట్రెండ్‌సెట్ అయ్యింది.



స్టాక్ మార్కెట్

ఈ రోజు మార్కెట్ ముగింపు		మార్పు	%
సెన్సెక్స్	41575.14	411.38	(+1.00%)
నిఫ్టీ	12245.80	119.25	(+0.98%)

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	71.35
యూరో	79.67
బ్రిటిష్ పౌండ్	94.68
ఆస్ట్రేలియన్ డాలర్	50.17
కెనెడియన్ డాలర్	54.83
సింగపూర్ డాలర్	52.78
స్విస్ ఫ్రాంక్	73.80
చైనీస్ యువాన్	10.25
మలేషియన్ రింగిట్	17.44
న్యూజిలాండ్ డాలర్	47.96

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	37420	40021.39	0.54%
ముంబై	37950	40588.24	0%
ఢిల్లీ	38050	40695.19	0%
కోల్‌కతా	38350	41016.04	0%
కేరళ	36250	38770.05	0.82%
బెంగళూరు	36580	39122.99	0.08%
హైదరాబాద్	37420	40021.39	0.54%
గల్ఫ్	161.05	172.25	0.15%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 50000.00
ముంబై	₹ 50000.00
ఢిల్లీ	₹ 50000.00
కోల్‌కతా	₹ 50000.00
హైదరాబాద్	₹ 50000.00



మందగమనాన్ని అధిగమించాయ్









- డిసెంబర్‌లో పెరిగిన మారుతీ, మహీంద్రా సేల్స్
- హుందయ్, టొయొటా ప్రతికూల వృద్ధి

న్యూఢిల్లీ: డిసెంబర్‌లో నెలలో పలు కంపెనీ వాహన విక్రయాలు మెరుగయ్యాయి. తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీల వాహన సేల్స్ పెరిగాయి. మరోవైపు హుందయ్, టొయొటా కంపెనీలు ప్రతికూల వృద్ధిని నమోదు చేశాయి.

ఎం అండ్ ఎం స్వల్ప వృద్ధి

మహీంద్రా అండ్ మహీంద్రా అమ్మకాలు డిసెంబర్‌లో 1 శాతం మాత్రమే పెరిగాయి. ప్రస్తుతం 37,081 యూనిట్లుగా ఉండగా, గతేడాదిలో 36,690 యూనిట్లుగా ఉన్నాయి. గతేడాది చివరి నెల డిసెంబర్‌లో సేల్స్ విషయంలో తమ పనితీరు మెరుగ్గా ఉందని, ప్రస్తుతం మొత్తం నిల్వ స్థాయిలో సౌకర్యంగా ఉన్నామని ఎం అండ్ ఎం చీఫ్(సేల్స్ అండ్ మార్కెటింగ్) విజయ్ రామ్ నక్ర అన్నారు. కొత్త సంవత్సరంలో బిఎస్–6 వాహనాల విషయంలో మరింత వేగం పెంచుతామని, వచ్చే మూడు నెలల్లో మార్పు దిశగా మరిన్ని చర్యలు చేపడతామని ఆయన తెలిపారు.

హుందయ్ సేల్స్‌లో క్షీణత

హుందయ్ సేల్స్ డిసెంబర్‌లో 9.8 శాతం తగ్గాయి. గత నెలలో విక్రయాలు 37,953 యూనిట్లుగా ఉండగా, గత ఏడాది ఇదే సమయంలో ఈ సేల్స్ 42,093 యూనిట్లుగా ఉన్నాయి. 2019లో దేశీయ అమ్మకాలు 7.2 శాతం క్షీణించాయి. 2019 సంవత్సరంలో 5,10,260 యూనిట్లుగా ఉండగా, 2018 ఇదే సమయంలో ఈ సేల్స్ 5,50,002 యూనిట్లుగా ఉన్నాయి. హెచ్‌ఎంఐఎల్ డైరెక్టర్ (సేల్స్ మార్కెటింగ్, సర్వీస్) తరుంగ్ గార్గ్ మాట్లాడుతూ, 2019 దేశీయ వాహన పరిశ్రమకు సవాళ్ల సంవత్సరంగా ఉందని అన్నారు. దారుణ పరిస్థితుల్లో హుందయ్ మోటార్స్ ఇండియా వివిధ సెగ్మెంట్లలో 4 కొత్త బెంచ్‌మార్క్ ప్రోడక్ట్‌లను లాంచ్ చేసింది.

టొయొటా కిర్లోస్కర్ మోటార్

డిసెంబర్ నెలలో టొయొటా కిర్లోస్కర్ మోటార్స్ దేసీయ అమ్మకాలు అత్యంతగా 45 శాతం పడిపోయాయి. 2019 డిసెంబర్‌లో సేల్స్ 6,544 యూనిట్లు మాత్రమే నమోదవగా, 2018 సంవత్సరంలో ఈ విక్రయాలు 11,836 యూనిట్లుగా ఉన్నాయి. 2019లో కంపెనీ దేశీయ అమ్మకాలు 16.36 శాతం తగ్గాయి. 2019 సంవత్సరంలో సేల్స్ 1,26,701 యూనిట్లుగా ఉండగా, 2018 సంవత్సరంలో ఈ విక్రయాలు 1,51,480 యూనిట్లుగా ఉన్నాయి. టొయొటా కిర్లోస్కర్ మోటార్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నవీన్ సోని మాట్లాడుతూ, పరిశ్రమలో మందగమనం ఉన్నప్పటికీ రిటైల్ సేల్స్ సానుకూలంగా కొనసాగినందుకు ఆనందంగా ఉందని అన్నారు. కొన్ని సెగ్మెంట్లను ఆశించిన మేరకు సేల్స్ వృద్ధి లేదని అన్నారు.

ఎంజి మోటార్స్ శుభారంభం

2019 డిసెంబర్‌లో ఎంజి మోటార్స్ ఇండియా విక్రయాలు 3,021 యూనిట్లు నమోదు చేశాయి. ఎంజి మోటార్ ఇండియా డైరెక్టర్(సేల్స్) రాకేశ్ సిదానా మాట్లాడుతూ, హెక్టార్‌తో భారత మార్కెట్లోకి ప్రవేశించిన తమకు వేగవంతమైన విక్రయాలు నమోదు కావడం ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చిందని అన్నారు.

మారుతీ సేల్స్ 2.4 శాతం జంప్

గతేడాదిలో మందగమనం ప్రభావం నుంచి బయటపడి మారుతీ సుజుకీ మంచి విక్రయాలను నమోదు చేసింది. డిసెంబర్‌లో మారుతీ దేశీయ అమ్మకాలు 1,21,479 యూనిట్ల నుంచి 1,24,375 యూనిట్లకు చేరాయి. మొత్తంగా 2.4 శాతం వృద్ధిని నమోదు చేశాయి. గత నెలలో కాంపాక్ట్ సెగ్మెంట్‌లో న్యూ వాగనర్, స్విఫ్ట్, సెలెరియో, ఇగ్నిస్, బాలెనో, డిజైర్ వంటి మోడళ్ల సేల్స్ 65,673 యూనిట్లతో 27.9 శాతం వృద్ధిని చూపాయి. అయితే, గతేడాది (2018) డిసెంబర్ నెలలో వీటి సేల్స్ 51,346 యూనిట్లుగా మాత్రమే ఉన్నాయి. జిప్సీ, ఎర్టిగా, ఎక్స్ఎల్6, ఎస్–క్రాస్, విటారా బ్రెజ్జా సహా యుటిలిటీ వెహికిల్స్ అమ్మకాలు 17.7 శాతం పెరిగాయి. గతేడాదిలో 20,225 యూనిట్ల నుంచి 23,808 యూనిట్లకు పెరిగాయి. అలాగే ఆల్టో, ఎస్–ప్రెస్సో, ఓల్డ్ వాగనర్ వంటి మినీ సెగ్మెంట్ సేల్స్ 13.6 శాతం క్షీణించాయి. గతేడాది వీటి అమ్మకాలు 27,649 యూనిట్ల నుంచి ఈసారి 23,883 యూనిట్లకు తగ్గాయి.

మళ్లీ లక్ష కోట్లు దాటింది..

- డిసెంబర్‌లో జిఎస్‌టి వసూళ్లు రూ.1.03 లక్షల కోట్లు
- నవంబర్‌లోనూ లక్ష కోట్లకు పైగా జిఎస్‌టి



న్యూఢిల్లీ: జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) వసూళ్లు మళ్లీ గాడిన పడ్డాయి. వరుసగా రెండో నెల జిఎస్‌టి వసూళ్లు లక్ష కోట్ల మార్క్‌ను దాటాయి. 2019 ఆఖరి నెల డిసెంబర్‌లో ఈ వసూళ్లు రూ.1.03 లక్షల కోట్లు నమోదయ్యాయి. గతేడాది(2018) డిసెంబర్ నెలలో ఈ వసూళ్లు రూ.97,276 కోట్లు మాత్రమే. అయితే 2019 నవంబర్‌లో జిఎస్‌టి వసూళ్లు రూ.1,03,492 కోట్లుగా ఉన్నాయి. పండుగ సీజన్, అలాగే నిబంధనలను కఠినంగా అమలు చేయడం వల్ల ఈసారి వసూళ్లు పెరిగాయి. సి–జిఎస్‌టి వసూళ్లు డిసెంబర్‌లో రూ .19,962 కోట్లు కాగా, ఎస్–జిఎస్‌టి వసూళ్లు రూ.26,792 కోట్లు, ఐ–జిఎస్‌టి వసూళ్లు రూ .48,099 కోట్లుగా ఉన్నాయి. అదే సమయంలో సెస్ నుండి వసూళ్లు రూ.8,331 కోట్లు నమోదయ్యాయి.

సెప్టెంబర్, అక్టోబర్‌లో బాగా తగ్గాయి

నవంబర్‌లో జిఎస్‌టి వసూళ్లు బాగున్నాయి. నవంబర్ నెలలో జిఎస్‌టి కింద రాబడి 1.03 లక్షల కోట్లు. ఇందులో కేంద్ర జిఎస్‌టి రూ .19,592 కోట్లు కాగా రాష్ట్ర జిఎస్‌టి రూ .27,144 కోట్లు. ఇంటిగ్రేటెడ్ జిఎస్‌టిగా 49,028 కోట్లు వచ్చాయి. రూ.7,727 కోట్లు సెస్‌గా వసూలు అయ్యాయి. ఇంటిగ్రేటెడ్ జిఎస్‌టిలో రూ.20,948 కోట్లు దిగుమతుల నుంచి వచ్చాయి. అదేవిధంగా దిగుమతి చేసుకున్న వస్తువులపై సెస్ నుండి రూ .869 కోట్లు వచ్చాయి. జిఎస్‌టి రికవరీ పెరగడం వల్ల ప్రభుత్వానికి ఆర్థికంగా మద్దతు లభించనుంది.

మూడు నెలల తర్వాత

మూడు నెలల విరామం తర్వాత నవంబర్‌లో జిఎస్‌టి వసూళ్లు మళ్లీ రూ .1 లక్ష కోట్లు దాటాయి. దీంతో ప్రభుత్వానికి ఆర్థికంగా ఉపశమనం లభించింది. నవంబర్‌లోనే దేశ ఆర్థిక లోటు బడ్జెట్‌లో నిర్దేశించిన లక్ష్యంలో 102 శాతానికి చేరుకుంది. ఆదాయం పెరగడంతో ప్రభుత్వం ఎక్కువ మొత్తంలో ఖర్చు చేస్తుందని, ఇది అభివృద్ధిని వేగవంతం చేయడంలో సహాయపడుతుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. విశేషమేమిటంటే పండుగ సీజన్‌లో నవంబర్‌లో జిఎస్‌టి లక్షల కోట్లు చేరుకుంది. ఇది జూలై తర్వాత మొదటిసారిగా 1 లక్షల కోట్ల లక్ష్యాన్ని దాటింది. జిఎస్‌టి రికవరీ పెరుగుదల మార్కెట్ సెంటిమెంట్‌లో మెరుగుదలను ప్రతిబింబిస్తుందని డెలాయ్ ఇండియా భాగస్వామి ఎంఎస్ మణి అన్నారు. రాబోయే నెలల్లో ఈ పెరుగుదల కొనసాగితే ఇది ఆర్థిక లోటును అధిగమించడానికి ప్రభుత్వానికి సహాయపడుతుంది.

ఖర్చుపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి: సేన్

ఆర్థిక లోటుపై దృష్టి పెట్టడం కంటే ఖర్చు, వినియోగం పెంచడంపై ప్రభుత్వం ఇప్పుడు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఆర్థికవేత్త ప్రణబ్ సేన్ అన్నారు. సేన్ మాట్లాడుతూ, అసలు సమస్య వినియోగంలో ఉందని, ఇది పెరగడానికి ప్రజల చేతుల్లో డబ్బు అవసరమని అన్నారు. కొత్త బాండ్లను జారీ చేయడానికి వీలుగా బాండ్లను కొనుగోలు చేయమని ప్రభుత్వం ఆర్‌బిఐని కోరాలని అన్నారు.

2.6% పెరిగిన జెట్ ఇంధనం ధర

- సబ్సిడీలేని ఎల్‌పిజి రూ. 19 పెంపు
- ఐదు నెలల్లో ఐదుసార్లు పెరిగిన ఎల్‌పిజి రేటు

న్యూఢిల్లీ: విమానాల టర్బైన్ ఇంధనం (ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ – ఏటిఎఫ్) లేదా జెట్ ఇంధనం ధర 2.6 శాతం, సబ్సిడీ లేని వంటగ్యాస్ ధర సిలిండర్‌కు రూ. 19 పెరిగాయి. విమానాలకు శక్తిని సమకూర్చేందుకు వాడే ఎటిఎఫ్ రేటు కిలో లీటర్‌కు రూ 1,637.25 (2.6 శాతం) పెరిగింది. ఢిల్లీలో కిలో లీటర్ ధర రూ. 64,322కు చేరిందని రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఫ్యూయెల్ రిటైలర్లు విడుదల చేసిన ధర ల నోటిఫికేషన్ పేర్కొంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు స్థిరంగా పెరగడంతో వరసగా రెండు నెలలు ధరలు పెరగడం ఇది రెండోసారి. భారతదేశంలో 84 శాతం మేర ఇంధన అవసరాలకు దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోంది. అందువల్ల అంతర్జాతీయ ధరలను బట్టే దేశీయ ఇంధన ధరలు కూడా పెరుగుతాయి. గత ఏడాది డిసెంబర్ 1న కిలో లీటర్‌కు రూ 13.88 పెం చారు. జూన్ 2019 నుంచి ఇంత ఎక్కువగా జెట్ ఫ్యూయల్ ధరలు పెరగడం ఇదే మొదటిసారి. ఈ రంగంలో తీవ్రమైన పోటీని , ఆర్థిక సమస్యల్ని ఎదుర్కొంటున్న వైమానిక సంస్థలు ధరల పెరుగుదలతో మరింత సంక్షోభంలో పడతాయి. అయితే ధరలు పెరిగినా లీటర్ ఎటిఎఫ్ రేటు రూ 64.32 అవుతుంది. అది పెట్రోల్, డీజిల్ కన్నా తక్కువే. దేశ రాజధానిలో లీటర్ పెట్రోల్ రూ. 75.14, డీజిల్ లీటర్ రూ.67.96 పలుకుతున్నాయి. వంట గ్యాస్ ధరల పెంపు ఇలా ఉండగా ...సబ్సిడీ లేని వంటగ్యాస్ ధరను (ఎల్‌పిజి) 14.2 కిలోల సిలిండర్‌కు రూ. 714 వరకు పెంచాయి. ప్రస్తుతం దీని ధర రూ. 695 ఉంది. 2019 సెప్టెంబర్ నుంచి వంట గ్యాస్ ధరలు పెరగడం ఇది ఐదోసారి. గత ఐదు నెలల కాలంలో సబ్సిడీ లేని ఎల్‌పిజి ధర సిలిండర్‌కు రూ. 139.50 వరకు పెరిగింది.

మాల్యా చరాస్తులను విక్రయించండి

బ్యాంకులకు కోర్టు అనుమతి



ముంబై: బ్యాంకులకు వేలాది కోట్ల రుణాలను ఎగవేసి విదేశాలకు పారిపోయిన పారిశ్రామికవేత్త విజయ్ మాల్యాకు చెందిన చరాస్తులను విక్రయించేందుకు ప్రత్యేక కోర్టు అనుమతి ఇచ్చింది. రుణాలను తిరిగి రాబట్టుకునేందుకుగాను మాల్యా చరాస్తులను విక్రయించవచ్చని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బిఐ) ఆధ్వర్యంలోని 15 బ్యాంకుల కన్సార్టియానికి కోర్టు అనుమతి ఇచ్చింది. ఈ చరాస్తులలో 2016లో పిఎంఎల్‌ఎ(మనీ లాండరింగ్ నియంత్రణ చట్టం) కింద జప్తు చేసిన యునైటెడ్ బ్రెవరీస్ హోల్డింగ్స్ లిమిటెడ్(యుబిహెచ్‌ఎల్) షేర్లు వంటి సెక్యూరిటీలు ఉన్నాయి. మాల్యాను నేరస్తుడిగా ప్రకటించిన తర్వాత ఆయన చరాస్తుల జప్తునకు కోర్టు అనుమతిచ్చింది.

2020లో ఐపిఒల జోరు

సిద్ధమవుతున్న బర్గర్ కింగ్, యుటిఐ ఎఎంసి, ఎన్‌ఎస్‌ఇ వంటి ఇష్యూలు



న్యూఢిల్లీ: గత ఏడాది 2019 సంవత్సరంలో ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్స్(ఐపిఒలు) దలాల్ స్ట్రీట్‌లో ఇన్వెస్టర్లను ఆకర్షించాయి. ఐఆర్‌సిటిసి, సిఎస్‌బి బ్యాంక్, ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ప్రిన్స్ పైప్స్, ఇండియా మార్ట్, నియోజెన్ కెమికల్స్, రైల్ వికాస్ నిగమ్, స్టెర్లింగ్ అండ్ విల్సన్ సోలార్, అఫ్లె ఇండియా వంటి ఐపిఒలు గతేడాదిలో కీలకంగా ఉన్నాయి. ఈ ఏడాదిలో పలు ఐపిఒలు మార్కెట్‌ను ముంచెత్తెందుకు సిద్ధంగా ఉన్నాయి.

బర్గర్ కింగ్

ఫాస్ట్ ఫుడ్ దిగ్గజం బర్గర్ కింగ్ ఇండియా ఈ సంవత్సరం ఐపిఒల జాబితాలో ఉండాలని యోచిస్తోంది. ఈ ఐపిఒతో సంస్థలో మెజారిటీ వాటాను కలిగి ఉన్న ప్రైవేట్ ఈక్విటీ సంస్థ ఎవర్‌స్టోన్ క్యాపిటల్ చైన్ నుండి పాక్షిక నిష్క్రమణకు అవకాశం ఉంది. ఈ ఎవర్‌స్టోన్ క్యాపిటల్ రూ.600 కోట్ల విలువైన సెకండరీ షేర్ సేల్, రూ. 400 కోట్ల విలువైన నిధుల సేకరణ ఉంటుంది. ఇది ఫాస్ట్ ఫుడ్ గొలుసు వి స్తరణ ప్రణాళికకు వినియోగించనున్నారు. ఎడెల్విస్, కో టక్ మహీంద్రా క్యాపిటల్, జెఎమ్ ఫైనాన్షియల్, సిఎల్‌ఎస్‌ఎ బర్గర్ కింగ్ ఐపిఒను నిర్వహించే ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు.

యుటిఐ ఎఎంసి

దేశీయంగా దీర్ఘకాలంగా కొనసాగుతున్న మ్యూచువల్ ఫండ్ యుటిఐ ఎఎంసి ఈ ఏడాది ప్రారంభ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ) ద్వారా 8.25 శాతం వరకు వాటాను విక్రయించనుంది. ఎందుకంటే దాని ఐదు వాటాదారుల వద్ద ఉన్న వాటాను మళ్లించాలని భావిస్తోంది. ఈ పబ్లిక్ ఇష్యూలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎల్ఐసి, పంజాబ్ నేషనల్ బ్యాంక్, టి రో ప్రైస్‌చే ఆఫర్ ఉంటుంది. మొదట ముగ్గురు వాటాదారులు 10,459,949 షేర్ల చొప్పున, మిగతా ఇద్దరు 3,803,617 షేర్ల చొప్పున విక్రయిస్తారు.

ఎస్‌బిఐ కార్డ్స్ అండ్ పేమెంట్స్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్రెడిట్ కార్డ్ యూనిట్ అయిన ఎస్‌బిఐ కార్డ్స్ అండ్ పేమెంట్స్ గత ఏడాది నవంబర్‌లో సెబీతో ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపిఒ) కోసం దాఖలు చేశాయి. ఇష్యూ పరిమాణం రూ.8,500 కోట్ల నుంచి రూ .9,500 కోట్ల మధ్య ఉంటుంది.

హోమ్ ఫస్ట్ ఫైనాన్స్

హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ (హెచ్‌ఎఫ్‌ఎఫ్‌సి) తన ప్రతిపాదిత ఐపిఒ కోసం సెబీకి డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. దీని ద్వారా రూ.1,500 కోట్లు సేకరించాలని భావిస్తోంది.

ఇఇఎస్ఎల్

ప్రభుత్వరంగ ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఇఇఎస్ఎల్) ఈ సంవత్సరం తన శక్తి సామర్థ్య కార్యక్రమాలకు నిధులు సమకూర్చడానికి ప్రాథమిక మార్కెట్లోకి ప్రవేశించాలని యోచిస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాలను కంపెనీలకు లీజుకు ఇవ్వడానికి, విద్యుత్ వినియోగాన్ని కొలవడానికి స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడానికి ఐపిఒ నుండి వచ్చే నిధులను ఉపయోగించాలని సంస్థ యోచిస్తోంది. ఇఇఎస్ఎల్ అనేది ఎన్‌టిపిసి, పిఎఫ్‌సి, ఆర్‌ఇసి, పవర్‌గ్రిడ్ అనే నాలుగు ప్రభుత్వ రంగ సంస్థల జాయింట్ వెంచర్. ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ ఇన్వెస్టెక్ విలువ ఇఇఎస్ఎల్ ను 5,000 కోట్ల రూపాయలు.

కంప్యూటర్ ఏజ్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్

భారతదేశంలో పలు మ్యూచువల్ ఫండ్లకు సేవలందిస్తున్న రిజిస్ట్రార్ అండ్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ (ఆర్‌టిఎ) కంప్యూటర్ ఏజ్ మేనేజ్మెంట్ సర్వీసెస్(కామ్స్) ఈ ఏడాది రూ.1000 కోట్లు సేకరించాలని యోచిస్తోంది.

ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్

ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ డిసెంబర్‌లో డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డిఆర్‌హెచ్‌పి) ను రెగ్యులేటర్ సెబీకి రూ .1000 కోట్ల ప్రారంభ పబ్లిక్ ఆఫర్ కోసం దాఖలు చేసింది. ఐపిఒలో 550 కోట్ల రూపాయల సేకరించనుంది. ప్రమోటర్ ఈక్విటాస్ హోల్డింగ్స్ లిమిటెడ్ (ఇహెచ్‌ఎల్) 8 కోట్ల వరకు ఈక్విటీ షేర్లను విక్రయించే ఆఫర్ ఉంటుంది.

ఈజీమైట్రిప్

రూ.510 కోట్ల ఐపిఒను తేవడానికి ఆన్‌లైన్ ట్రావెల్ కంపెనీ ఈజీమైట్రిప్ గత ఏడాది డిసెంబర్‌లో క్యాపిటల్ మార్కెట్ రెగ్యులేటర్ సెబీకి దాఖలు చేసింది. కంపెనీ వ్యవస్థాపకులు నిశాంత్ పిట్టి, రికాంత్ పిట్టి ఒక్కొక్కరు ఆఫర్‌ఫర్ సేల్ మెకానిజం ద్వారా 255 కోట్ల రూపాయల షేర్లను విక్రయిస్తారు. ఈజీమైట్రిప్.కామ్ ను ఈజీ ట్రిప్ ప్లానర్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తోంది.

2020లో పసిడి బేజారే

6 నుంచి 8 శాతం తగ్గనున్న డిమాండ్ : ఐసిఆర్‌ఎ

ముంబై: గతేడాదిలో అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర 18 శాతం పెరిగింది. పసిడికి అత్యంతగా డిమాండ్ ఏర్పడింది. అమెరికా–చైనా వాణిజ్య చర్చలు, అంతర్జాతీయంగా ఆర్థిక వృద్ధి మందగించడం వంటి అనిశ్చితి పరిస్థితుల నేపథ్యంలో బంగారం ధరలు భారత్‌లో 24 శాతం పెరిగాయి. గత కొన్నేళ్లుగా ఎన్నడూ లేనంతగా 2019 సంవత్సరంలో నగలకు డిమాండ్ అత్యంతగా పెరిగింది. అసాధారణ పెరుగుదల కారణంగా నగల కొనుగోళ్లకు భారతీయులు దూరంగా ఉంటున్నారని ఐసిఆర్‌ఎ భావిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2019–20)లో బంగారం నగల డిమాండ్ 6 నుంచి 8 శాతం పడిపోయే అవకాశముందని ఐసిఆర్‌ఎ అంచనా వేస్తోంది. ఐసిఆర్‌ఎ కె.శ్రీకుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బంగారం నగలకు డిమాండ్ మందగించనుందని, దీనికి కారణం ధరల్లో వేగవంతమైన పెరుగుదలే కారణమని అన్నారు. ద్రవ్య పరమైన సంస్యలు, పంటలు చేతికి రాకపోవడం వల్ల గ్రామీణ మార్కెట్ అధ్వాన్నంగా ఉంది. ధర ఒక్కసారిగా పెరగడం, ఆదాయం తగ్గిపోవడం వంటి రెండు అంశాలు పసిడి నగల కొనుగోళ్లపై ప్రభావం చూపాయి.






న్యూ ఇయర్ హంగామా

నూతన సంవత్సరంలో కొత్త సినిమాలతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు ఫిల్మ్‌మేకర్స్. సంక్రాంతి పండుగ కానుకగా పలు పెద్ద స్టార్ల సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. పెద్ద స్టార్లు తమ సినిమాలతో ప్రేక్షకులను మురిపించబోతున్నారు. ఇక నూతన సంవత్సరం కానుకగా కొత్త పోస్టర్లను విడుదల చేశారు ఫిల్మ్‌మేకర్స్. ఈ కొత్త పోస్టర్లు, స్టిల్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సందడి చేస్తూ అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

సరిలేరు నీకెవ్వరు

సూపర్‌స్టార్ మహేష్‌బాబు హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. రష్మిక హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా ఈనెల 12న విడుదల చేస్తున్నారు. అయితే నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని చిత్ర బృందం కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేసింది. మేజర్ అజయ్‌కృష్ణ పాత్రలో మహేష్‌బాబు నటించిన ఈ చిత్రంలో విజయశాంతి ఓ ముఖ్య పాత్ర పోషించారు.

క్రాక్



మాస్ మహారాజ రవితేజ చేస్తున్న చిత్రాల్లో 'క్రాక్' కూడా ఒకటి. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వేసవి కానుకగా విడుదల చేయాలని ఫిల్మ్‌మేకర్స్ నిర్ణయించారు. ఇక న్యూ ఇయర్ సందర్భంగా విడుదల చేసిన సినిమా ఫస్ట్ లుక్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ చిత్రంలో రవితేజ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నాడు. శృతిహాసన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్‌కుమార్, సముద్ర ఖని ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు.

అల వైకుంఠపురములో

స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ దర్శకత్వంలో వస్తోన్న చిత్రం 'అల వైకుంఠపురములో'. పూజాహెగ్డే హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం ఈనెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈనెల 6న హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని పోలీస్‌గ్రౌండ్స్‌లో 'అల వైకుంఠపురము'లో మ్యూజికల్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ ఈ సినిమా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు ఫిల్మ్‌మేకర్స్.

అశ్వథ్థామ




నాగశౌర్య కథానాయకుడిగా ఐరా క్రియేషన్స్ బ్యానర్‌పై శంకర్‌ప్రసాద్ ముల్పూరి సమర్పణలో ఉషా ముల్పూరి నిర్మిస్తున్న చిత్రం 'అశ్వథ్థామ'. రమణ తేజ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో మెహరీన్ హీరోయిన్‌గా నటిస్తోంది. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని హీరో నాగశౌర్య న్యూ లుక్‌ను విడుదల చేశారు ఫిల్మ్‌మేకర్స్. ఈ పోస్టర్‌లో సూట్ ధరించిన ఈ యువ కథానాయకుడు హుందాగా దర్శనమిచ్చారు.

ఎంత మంచివాడవురా

నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా సతీష్ వేగేశ్న దర్శకత్వంలో రూపొందుతోన్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఎంతమంచివాడవురా'. ఆదిత్యా మ్యూజిక్ ఇండియాప్రై.లి. పతాకంపై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి దేవి మూవీస్ శివలెంక కృష్ణప్రసాద్ సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేస్తూ ఫిల్మ్‌మేకర్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో హీరో హీరోయిన్లు కల్యాణ్‌రామ్, మెహరీన్‌లు ఆకట్టుకుంటున్నారు.



భారతీయుడు 2



స్టార్ హీరో కమల్‌హాసన్, స్టార్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'భారతీయుడు 2'. కాజల్ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ చిత్రంలో రకుల్‌ప్రీత్ సింగ్, సిద్ధార్థ్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఈ సినిమా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు.

దర్బార్



సౌతిండియా సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా నటించిన చిత్రం 'దర్బార్'. ఎ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటించింది. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం ఈనెల 9న విడుదలకానుంది. న్యూ ఇయర్ విషెస్ చెబుతూ ఫిల్మ్‌మేకర్స్ 'దర్బార్' కొత్త పోస్టర్లను రిలీజ్ చేశారు. వీటికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది.

నిశ్శబ్దం

స్టార్ బ్యూటీ అనుష్క ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'నిశ్శబ్దం'. ఈ చిత్రంలో ఆమె మాట్లాడలేని సాక్షి అనే అమ్మాయి పాత్రలో నటిస్తున్నారు. హేమంత్ మధుకర్ దర్శకత్వంలో ఈ చిత్రం తెలుగు, తమిళ్, మలయాళం, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో రూపొందుతోంది. నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేస్తూ అనుష్క కొత్త స్టిల్‌ను విడుదల చేసింది చిత్ర బృందం.



భీష్మ




నితిన్, రష్మిక మందన్న హీరోహీరోయిన్లుగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'భీష్మ'. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో రూపొందుతోంది ఈ చిత్రం. నూతన సంవత్సరం సందర్భంగా సినిమా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో హీరోహీరోయిన్లు నితిన్, రష్మిక సందడిచేశారు.

క్రష్



ఫ్లయింగ్ ఫ్రాగ్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రవిబాబు దర్శక నిర్మాణంలో రూపొందుతోన్న చిత్రం 'క్రష్'. నూతన సంవత్సరం సందర్భంగా ఈ సినిమా టైటిల్ లుక్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఇందులో ఓ అందాల భామ బికినీలో దర్శనమిచ్చింది. ఇక ఈనెల 24 నుండి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.

హిట్



నేచురల్ స్టార్ నాని సమర్పణలో వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై విశ్వక్‌సేన్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'హిట్'. శైలేష్ కొలను దర్శకత్వంలో ప్రశాంతి త్రిపిర్‌నేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రుహానీ శర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. విశ్వక్‌సేన్ ఈ చిత్రంలో విక్రమ్ రుద్రరాజు అనే ఐపిఎస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు.

వరల్డ్ ఫేమస్ లవర్

యంగ్‌స్టార్ విజయ్ దేవరకొండ హీరోగా రూపొందుతోన్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'వరల్డ్ ఫేమస్ లవర్'. భిన్నమైన ప్రేమ కథా చిత్రంగా రూపొందుతోన్న ఈ సినిమాలో నలుగురు హీరోయిన్లు ఐశ్వర్యా రాజేష్, ఇజాబెల్లె లెయితె, క్యాథరిన్, రాశీఖన్నా నటిస్తున్నారు. ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్రలు, వారితో హీరో పాత్రకు ఉన్న సంబంధం ఏంటని తెలియజేస్తూ ఇప్పటికే ఐశ్వర్య, ఇజాబెల్లె, క్యాథరిన్, రాశీఖన్నాల లుక్స్‌ను విడుదల చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా ఈ నాలుగు లుక్స్‌ను జత చేసి కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు.



నా టాలెంట్‌ను చూసే అవకాశాలు!

''నేనెవరినీ అవకాశాల కోసం ఇప్పటిదాకా అడిగింది లేదు. నా ఇమేజ్ చూసి, నాకున్న ఫాలోయింగ్‌ను చూసి... వాటన్నింటికీ మించి నాలోని టాలెంట్‌ను చూసి నాకు అవకాశాలిస్తున్నారు. అలా వచ్చే అవకాశాల నుంచి కొన్నింటిని నేను ఎంపిక చేసుకుంటున్నానంతే'' అని అంటోంది బాలీవుడ్ శృంగార తార సన్నీలియాన్. ఈ బ్యూటీకి ఇప్పుడు బాలీవుడ్‌లో భారీగా ఫాలోయింగ్ ఉంది. ఆమెకు ఈమధ్య బాలీవుడ్‌లోనే కాదు సౌత్‌లోనూ అవకాశాలు వస్తుండడం విశేషం. ఈ సందర్భంగా సన్నీలియాన్ మాట్లాడుతూ... ''నాకెలాంటి ఛాన్సులివ్వాలో దర్శకులకు తెలుసు. అవి చెయ్యాలా వద్దా అనేది నాకు తెలుసు'' అంటూ వింత సమాధానమిచ్చింది. బాలీవుడ్‌లో చాలా మంది సూపర్‌స్టార్స్ ఉన్నారు కదా... వాళ్లందరితో సినిమాలెప్పుడు? అని అడిగితే... ''ఏమో వాళ్లకి నాతో సినిమా చేయాలనిపిస్తే ఖచ్చితంగా పిలుస్తారు. గతంలో షారుక్ సరసన నటించినట్లే మంచి ఛాన్స్ వస్తే మిగతా సూపర్‌స్టార్స్‌తో కూడా నటిస్తాను''అని పేర్కొంది సన్నీలియాన్.


సన్నీలియాన్

అలాంటి సినిమాలో నటించాలనుంది

'రన్ రాజా రన్' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ముంబయ్ భామ సీరత్ కపూర్. ఆతర్వాత 'టైగర్' సినిమాలో నటించి పరాజయాన్ని మూటగట్టుకుంది. తొలి సినిమా మంచి హిట్ అయినా... ఆతర్వాత ఫ్లాప్ రావడంతో అమ్మడి కెరీర్ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు తయారైంది. అనంతరం ఓంకార్ దర్శకత్వంలో వచ్చిన 'రాజుగారి గది 2' సినిమాలో సీరత్‌కపూర్ నటించింది. ఈ చిత్రం పర్వాలేదనిపించింది. ఇక ఎప్పటికైనా డ్యాన్స్ బేస్డ్ మూవీలో నటించాలన్నది సీరత్ కపూర్ కోరిక అట. బాలీవుడ్‌లో వచ్చిన 'ఎబిసిడి' సినిమా తరహాలో పూర్తిగా డ్యాన్స్ నేపథ్యం ఉన్న చిత్రంలో నటించాలన్నది తన కోరిక అని చెప్పింది ఈ భామ. స్వతహాగా సీరత్‌కపూర్ మంచి డ్యాన్సర్. నిజానికి అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గానే ఆమె సినీ కెరీర్ ప్రారంభించింది. అనుకోకుండా హీరోయిన్ అయ్యానని చెప్పింది సీరత్‌కపూర్. కన్నడ సినీ రంగం నుంచి కూడా తనకు పిలుపులు వస్తున్నాయని చెబుతోంది ఈ అందాల తార. ఈమధ్య బికినీ స్టిల్స్‌తో హల్‌చల్ చేసిన సీరత్... గ్లామర్ ప్రపంచంలో గ్లామరస్‌గా కనిపించడం తప్పేమి కాదని అంటోంది. గ్లామర్‌కు హద్దులేమీ ఉండవని పేర్కొంది ఈ హాట్ బ్యూటీ.


సీరత్ కపూర్

నాలుగు రోజుల టెస్టు మ్యాచ్‌కు తాను పూర్తిగా వ్యతిరేకమని ఆస్ట్రేలియా స్టార్ బౌలర్ నాథన్ లియాన్ స్పష్టం చేశాడు. టెస్టు మ్యాచ్‌ను నాలుగు రోజులకు కుదించాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి భావిస్తున్న విషయం తెలిసిందే. 2023 నుంచి దీన్ని అమలు చేసేందుకు ఐసిసి కసరత్తు ప్రారంభించింది. అయితే ఐసిసి నిర్ణయాన్ని లియాన్ పూర్తిగా వ్యతిరేకిస్తున్నాడు. నాలుగు రోజుల మ్యాచ్‌తో టెస్టుల్లో ఫలితం తేలడం చాలా కష్టమన్నాడు.









జోరుగా.. హుషారుగా

కొత్త సంవత్సర వేడుకల్లో క్రికెటర్లు

ముంబై: ప్రపంచ వ్యాప్తంగా పలువురు స్టార్ క్రికెటర్లు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. భారత కెప్టెన్ విరాట్ కోహ్లి, మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని, వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ, ఆస్ట్రేలియా స్టార్లు డేవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్, భారత యువ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య, వెస్టిండీస్ యువ సంచలనం హెట్‌మెయిర్ తదితరులు తమ తమ కుటుంబ సభ్యులతో కలిసి 2020 సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. విరుష్క జోడీ ప్రస్తుతం స్విట్జర్లాండ్‌లో సందడి చేస్తోంది. వెస్టిండీస్ సిరీస్ తర్వాత కాస్త విరామం దొరకడంతో విరుష్క జంట స్విట్జర్లాండ్‌లో వాలిపోయింది. అక్కడే ఈ జంట నూతన సంవత్సర వేడుకలను జరుపుకుంది. ఇక, ధోని కూడా సతిమణి సాక్షితో కలిసి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నాడు. కూతురుతో కలిసి మహి జంట ఈ వేడుకను జరుపుకుంది. రోహిత్ శర్మ దంపతులు కూడా తన గారాల పట్టితో కొత్త సంవత్సర వేడుకల్లో పాలుపంచుకున్నారు. ఇక, భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య తన స్నేహితురాలు, సెర్బియా మోడల్ నటాషాతో కలిసి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నాడు. ఆస్ట్రేలియా స్టార్లు వార్నర్, స్మిత్‌లు కూడా తమ కుటుంబ సభ్యుల సమక్షంలో కొత్త సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వీరితో పాటు ఇతర స్టార్లు కూడా కొత్త ఏడాది సంబరాల్లో మునిగి తేలారు.







ఒలింపిక్స్‌లో స్వర్ణమే లక్ష్యం

స్టార్ షట్లర్ పి.వి.సింధు

న్యూఢిల్లీ: టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు భారత బ్యాడ్మింటన్ స్టార్, తెలుగుతేజం పి.వి.సింధు స్పష్టం చేసింది. బుధవారం ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సింధు ఈ విషయం తెలిపింది. కిందటి ఏడాది ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పసిడి పతకం సాధించడంతో తన ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యిందని చెప్పింది. ఇదే జోరును ఒలింపిక్స్‌లోనూ కొనసాగించి స్వర్ణం సాధిస్తాననే నమ్మకాన్ని వ్యక్తం చేసింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్ తర్వాత వరుస ఓటములు ఎదురైనా తన ఆత్మవిశ్వాసం తగ్గలేదని పేర్కొంది. ఆటలో గెలుపోటములు సహజమని, అంత మాత్రాన దీని ప్రభావం తన కెరీర్ ఏమాత్రం ఉండదని అభిప్రాయపడింది. ఇక, వరుస ఓటముల తర్వాత తనపై విమర్శలు వెల్లువెత్తాయని, అయితే దీన్ని తాను పెద్దగా పట్టించుకోనని తెలిపింది. మళ్లీ పూర్వ వైభవం సాధిస్తాననే నమ్మకం తనకుందని వివరించింది. క్లిష్ట పరిస్థితులను సయితం తట్టుకుని ముందుకు సాగే సత్తా తనకుందని, ఇందుకు తాను సాధించిన విజయాలే నిదర్శనమని సింధు పేర్కొంది. టోక్యో ఒలింపిక్స్ లక్ష్యంగా తన సాధన ఉంటుందని, దీని కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు పోతున్నట్టు తెలిపింది. ఈసారి ఒలింపిక్స్‌లో కచ్చితంగా స్వర్ణం గెలుస్తాననే నమ్మకం తనకుందని వివరించింది. తన కెరీర్‌లోనే ఈ ఏడాది చాలా ప్రత్యేకమైందని స్పష్టం చేసింది. ఒలింపిక్స్‌లో పసిడి సాధించడం ద్వారా తన ఆటపై వచ్చిన విమర్శలకు తగిన సమాధానం చెబుతానని భారత స్టార్ షట్లర్ ధీమా వ్యక్తం చేసింది. ఇక, తన కెరీర్‌లో ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొన్నానని, ప్రతి సారి వాటిని తన ఆట ద్వారా తిప్పికొట్టిన విషయాన్ని గుర్తు చేసింది. మరోవైపు కొత్త సంవత్సరం తన కెరీర్‌కు కొత్త ఊపు ఇస్తుందనే నమ్మకాన్ని సింధు వ్యక్తం చేసింది.



సెకండ్ ఇన్నింగ్స్‌కు సర్వం సిద్ధం

హోబర్ట్ ఓపెన్‌తో సానియా

న్యూఢిల్లీ: భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా సెకండ్ ఇన్నింగ్స్‌కు రంగం సిద్ధమైంది. రెండేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత సానియా మళ్లీ టెన్నిస్‌లో అడుగు పెట్టనుంది. ఈ నెలలో జరిగే హోబర్ట్ ఓపెన్‌తో సానియా మళ్లీ టెన్నిస్‌లో పునరాగమనం చేయనుంది. 2017లో సానియా చివరి సారిగా టెన్నిస్ ఆడింది. ఆ టోర్నీలో గాయం వల్ల అర్థాంతరంగా వైదొలిగింది. ఆ తర్వాత గర్భం దాల్చడంతో ఆటకు పూర్తిగా దూరం కాక తప్పలేదు. తన కొడుకు ఇజాన్ పుట్టిన తర్వాత కూడా సానియా చాలా రోజుల పాటు ఆటకు దూరంగానే ఉంది. అయితే ఈ ఏడాది మళ్లీ టెన్నిస్ ఆడేందుకు సిద్ధమైంది. దీని కోసం కఠోర సాధన చేసింది. అంతేగాక నాలుగు నెలల పాటు శ్రమించి ఏకంగా తన బరువును 26 కేజీలు తగ్గించుకుంది. ప్రస్తుతం పూర్తి ఫిట్‌నెస్‌తో సెకండ్ ఇన్నింగ్స్‌కు సమరోత్సాహంతో సిద్ధమైంది. చాలా కాలం తర్వాత తనకు ఇష్టమైన టెన్నిస్‌ను తిరిగి ప్రారంభిస్తుండడం గొప్ప అనుభూతిని ఇస్తుందని సానియా పేర్కొంది. ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ తన పునరాగమనం విషయాన్ని వెల్లడించింది. సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ టెన్నిస్ కోర్టులో బరిలోకి దిగుతున్నానని, త్వరలోనే ఫామ్‌ను అందుకుంటాననే నమ్మకం తనకుందని తెలిపింది. ఈ ఏడాది తనకు చాలా ప్రత్యేకమని, తాను ఎంతో ప్రేమించే టెన్నిస్‌ను తిరిగి ఆడనుండడం గొప్పగా అనిపిస్తుందని వివరించింది. ఇక, ఈ నెల 11 నుంచి జరిగే హోబర్ట్ ఓపెన్‌తో సానియా మళ్లీ కెరీర్‌కు శ్రీకారం చుట్టనుంది. మహిళల డబుల్స్‌లో నదియా కిచెనెన్ (ఉక్రెయిన్)తో, మిక్స్‌డ్ డబుల్స్‌లో అమెరికా ఆటగాడు రాజీవ్ రామ్‌తో కలిసి బరిలోకి దిగనుంది.


సానియా

నటి నటాషాతో హార్దిక్ నిశ్చితార్థం

ముంబై: భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య త్వరలోనే ఇంటి వాడు కానున్నాడు. ఇక, తన ప్రియురాలు, బాలీవుడ్ నటి నటాషాతో త్వరలోనే పెళ్లి చేసుకోనున్నాడు. అంతేగాక నటాషాతో హార్దిక్ నిశ్చితార్థం కూడా చేసుకున్నాడు. దీనికి సంబంధించిన



ఫొటోలను అభిమానులతో పంచుకున్నాడు. ఇక, ఎంగేజ్‌మెంట్ విషయాన్ని కూడా హార్దిక్ ధ్రువీకరించాడు. స్నేహితురాలు నటాషాతో తన నిశ్చితార్థం జరిగిందని, త్వరలోనే తాము వివాహం చేసుకోనున్నామని తెలిపాడు. నటాషా ప్రస్తుతం బాలీవుడ్ సినిమాల్లో నటిస్తోంది. ఇక, హార్దిక్ పాండ్య భారత స్టార్ క్రికెటర్లలో ఒకడిగా పేరు తెచ్చుకున్నాడు. కొంతకాలంగా హార్దిక్ ఆటకు దూరంగా ఉన్నాడు. గాయం వల్ల అతను టీమిండియాకు దూరంగా ఉండాల్సి వచ్చింది. కాగా, నటాషాతో హార్దిక్ ప్రేమ యాణం కొనసాగిస్తున్న విషయం చాలా సార్లు బయట పడింది. అయితే ఎప్పుడూ కూడా హార్దిక్ దీన్ని అధికారికంగా ధ్రువీకరించ లేదు. కానీ, కొత్త సంవత్సరం సందర్భంగా తామిద్దరం నిశ్చితార్థం చేసుకున్నామని, ఈ సందర్భంగా తాను నటాషాకు ఉంగరం తొడగడాన్ని సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నాడు.

చేవ తగ్గలేదు

షరపోవా

బ్రిస్బేన్: మరి కొన్నేళ్ల పాటు టెన్నిస్ ఆడే సత్తా తనకుందని రష్యా స్టార్ మారియా షరపోవా స్పష్టం చేసింది. ఒకప్పుడూ మహిళల టెన్నిస్‌లో అగ్రశ్రేణి క్రీడాకారిణిగా కొనసాగిన షరపోవా డోపింగ్ ఆరోపణల్లో చిక్కుకుని కొన్నేళ్ల పాటు ఆటకు దూరమైంది. పునరాగమనం తర్వాత ఆశించిన స్థాయిలో రాణించక పోవడంతో షరపోవా కెరీర్ ముగిసినట్టేనని వార్తలు జోరందుకున్నాయి. దీనికి తగినట్టుగానే కిందటి ఏడాది షరపోవా ఆట అంతంత మాత్రంగానే సాగింది. దీంతో షరపోవా రిటైర్మెంట్ ప్రకటించడం ఖాయమని విశ్లేషకులు సయితం ఓ అభిప్రాయానికి వచ్చేశారు. అయితే షరపోవా మాత్రం ఈ వార్తలను ఖండించింది. మరి కొన్నేళ్ల పాటు టెన్నిస్‌లో కొనసాగుతానని తేల్చి చెప్పింది. తనలో చేవ తగ్గలేదని, పూర్వ వైభవం సాధించే సత్తా ఉందని పేర్కొంది. ఈ ఏడాది బ్రిస్బేన్ ఓపెన్‌తో పూర్వవైభవం అందుకుంటాననే నమ్మకాన్ని వ్యక్తం చేసింది. రానున్న రోజుల్లో కొన్ని టైటిల్స్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు స్పష్టం చేసింది. కాగా, గతంలో మహిళల సింగిల్స్‌లో టాప్ ర్యాంక్‌లో కొనసాగిన షరపోవా ప్రస్తుతం 133వ ర్యాంక్‌కు పడిపోయింది.



క్లీన్‌స్వీప్‌పై ఆస్ట్రేలియా కన్ను

నేటి నుంచి కివీస్‌తో చివరి టెస్టు

సిడ్నీ: ఇప్పటికే సిరీస్‌ను సాధించి జోరుమీదున్న ఆస్ట్రేలియా గురువారం నుంచి న్యూజిలాండ్‌తో జరిగే మూడో, చివరి టెస్టుకు ఆత్మవిశ్వాసంతో సిద్ధమైంది. ఈ టెస్టులోనూ కూడా గెలిచి సిరీస్‌ను 3–0తో క్లీన్‌స్వీప్ చేయాలనే పట్టుదలతో ఆస్ట్రేలియా కనిపిస్తోంది. మరోవైపు న్యూజిలాండ్ కనీసం ఈ మ్యాచ్‌లోనైనా నెగ్గి కాస్తయిన పరువును దక్కించుకోవాలని భావిస్తోంది. అయితే ఆస్ట్రేలియా ఫామ్‌ను చూస్తుంటే కివీస్ మ్యాచ్ గెలవడం అటుంచి డ్రా చేసుకున్నా గొప్పేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టెస్టు ఛాంపియన్‌షిప్ ప్రారంభమైన తర్వాత ఆస్ట్రేలియా వరుస విజయాలతో చెలరేగి పోతోంది. ఇటీవలే పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడించింది. తాజాగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న సిరీస్‌ను కూడా ఒక మ్యాచ్ మిగిలివుండగానే సొంతం చేసుకుంది. ఇక, సిడ్నీ వేదికగా జరుగనున్న మూడో టెస్టులో కూడా గెలుపే లక్ష్యంగా పెట్టుకుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఆస్ట్రేలియా సమతూకంగా కనిపిస్తోంది. డేవిడ్ వార్నర్, బర్న్స్, స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్, లబూషేన్, మాథ్యూవేడ్, కెప్టెన్ పైన్ తదితరులు అద్భుత ఫామ్‌లో ఉన్నారు. వార్నర్, లబూషేన్ వరుస సెంచరీలతో చెలరేగి పోతున్నారు. కిందటి మ్యాచ్‌లో హెడ్ కూడా శతకంతో అలరించాడు. ఈసారి కూడా ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్ చెలరేగేందుకు సిద్ధంగా ఉన్నారు. బౌలింగ్‌లో కూడా ఆస్ట్రేలిఇయాకు ఎదురులేదనే చెప్పాలి. కమిన్స్, స్టార్క్, లియాన్, పాటిన్సన్ తదితరులు అసాధారణ రీతిలో చెలరేగి పోతున్నారు. ఈ మ్యాచ్‌లో సత్తా చాటాలనే పట్టుదలతో ఉన్నారు. ఇదే జరిగితే కివీస్‌కు మరోసారి ఇబ్బందులు తప్పక పోవచ్చు.





Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666